# విచిత్ర తరంగిణి



కర్త
తత్త్వ సాహిత్య కోవిద - సాహిత్య తత్త్వ విశారద
**యల్లంరాజు శ్రీనివాసరావు**

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# విచిత్ర తరంగిణి



కర్త

తత్త్వ సాహిత్య కోవిద - సాహిత్య తత్త్వ విశారద

**యల్లంరాజు శ్రీనివాసరావు**

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# సమర్పణ



నాకున్ జన్మ నొసంగి- నా తనువు నానావ్యాధులం జెంది- య
ట్లాక న్ బెట్టిన సైచి పెంచి - పతి నిర్యాణంబుచే నార్తయై-
సాకల్యంబుగ తత్త్వ దర్శన వచో జాలంబు నా వల్లనే
యా కర్ణించి - శతాయువై చనిన మా యమ్మన్ బ్రశంసించుచున్

సీతమ్మ పేరు గల- మా
మాత కుపాయనముగా సమర్పించెద- నా
చేత ప్రణీతంబగు నీ
నూతన మగు కృతి - ఋణాపనోదన మతినై

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# విచిత్ర ద్వారము

ఇటీవల త్రవ్వకాలలో మళ్ళీ కొన్ని బయట పడ్డాయి. ఇవేమీ శిథిలాలు కావు. భయపడకండి. నన్నడిగితే మణులూ, మాణిక్యాలూ. ఇంతకు ముందిలాంటివే కొన్ని బయటపడితే వాటన్నింటినీ పోగుచేసి చిత్రతరంగిణి అనే పేరుతో మీ కందించాను. అప్పడివి నా దృష్టిలో పడకుండా ఎలా తప్పి పోయాయో నాకే తెలియదు. నా అదృష్టం కొద్దీ ఇప్పటికైనా దృష్ట మయ్యాయి. అదే నాకు సంతోషం.

ఇక ఆలస్యం దేనికి. వెంటనే మీ వంటి రసజ్ఞుల కంద జేస్తే బాగుంటుందని సంకల్పం కలిగింది. ఇదుగో ఈ మూసలో బోసి మీ చేతి కిస్తున్నాను. స్వీకరించండి. ఆస్వాదించండి. దీని అన్న చిత్ర తరంగిణి అయితే దాని తమ్ముడిది వి చిత్ర తరంగిణి. అందులో లేని విశేషాలు కొన్ని ఇందులో పొందుపడి ఉన్నాయని అర్థం.

ఇందులో వేదాంత భాగ మెంత ఉందో వచ్చీ పోయి సాహిత్యభాగం కూడా అంత ఉంది. సాహిత్య సౌరభమనే పేరుతో దాని స్వరూపమూ - దాని అందచందాలూ - వాటి ప్రయోజనమూ అంతా బయటపెట్టాను. మఱి దానికి తార్కాణంగా అల్లసాని వారి కావ్యనిర్మాణ రహస్యాన్ని కూడా విప్పి చెప్పాను. పోతే ఇక అద్వైత వేదాంత మంటారా. దాని సారమంతా ఆబాలగోపాలమూ అందరికీ పక్షపాతం లేకుండా పంచిపెట్టాను. కాగా ఈ రసాయనంలో అక్కడక్కడా ద్రాక్షా,

జీడిపప్పు లాగా మంచి పద్యాలూ, మాటలూ కూడా మీకు హృద్యంగా సాక్షాత్కరిస్తాయి.

నేను చెప్పటం దేనికి. మీరే చూడండి. చదవండి. మళ్లీ మళ్లీ చదివి చూడండి. రసజ్ఞులూ తత్త్వజ్ఞులైతే మీకే తెలుస్తుంది. దీనిలో ఎంత సారస్యముందో. ఆమాటకు వస్తే మరొక మాట కూడా చెప్పవలసి ఉంది మీకు. నాకు దొరికిన నగలూ నట్రా మరొక రెండు కూడా ఉన్నాయి. అద్వైత విజ్ఞానసారమే ఇంకొక రెండు పాత్రలలో నిండుగా పోసి ఉంచాను. అయితే అవి రెండూ తెలుగు పాత్రలు కావు. సంస్కృత పాత్రలు. సంస్కృత భాషలోనే వ్రాశానవి ఎప్పడో. అవి కూడా ప్రచురించాలని ఉంది త్వరలోనే. నాగర లిపిలోనే వ్రాసి అచ్చువేస్తే రాష్ట్రంలోనే కాక, దేశవిదేశాలలో కూడా తద్జ్ఞులందరూ చూస్తారు గదా అని నా ఆశ. చూద్దాం కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ. ఇంకొక్క విషయం. ప్రస్తుత మీ గ్రంథంలో పందొమ్మిదే ఉన్నాయి వ్యాసాలు. మరీ పందొమ్మిదే అయితే బేసి సంఖ్య. బాగుండ దనిపించింది. అంచేత మరొక్క వ్యాసం సంస్కృతంలో వ్రాసి చివరలో ప్రకటిస్తున్నాను. అది తెలుగు లిపిలోనే ఉంది. సంస్కృతాభిజ్ఞులైనవారు చదువుకొని ఆనందించవచ్చు.

సెలవు,
భవదీయః
శ్రీనివాస నామధేయః

# తరంగ పంక్తి


1. తరంగము - సరస్వతి నమ స్తుభ్యమ్
2. తరంగము - శివాభ్యర్థన
3. తరంగము - ఆత్మ విమర్శ
4. తరంగము - స్వాతంత్ర్య దినోత్సవము
5. తరంగము - పుట్టపర్తి నారాయణాచార్యుల అభినందన
6. తరంగము - శేషశాస్త్రి గారితో నాఅనుభవం
7. తరంగము - సాహిత్య సౌరభము
8. తరంగము - ఆంధ్ర కవితా పితామహ - అల్లసాని
9. తరంగము - నవవిధ గణపతులు - ప్రతీకవాదం
10. తరంగము - వినాయకుని గాణాపత్యము
11. తరంగము - యోగమంటే ఏమిటి
12. తరంగము - శివలీలా వైభవము
13. తరంగము - జననము - మరణము
14. తరంగము - మానవజన్మ - దాని విశిష్టత
15. తరంగము - పురుషార్థములు - వివరణ
16. తరంగము - ఐహికము - ఆముష్మికము
17. తరంగము - పరమపురుషార్థము - మోక్షము
18. తరంగము - జీవయాత్ర
19. తరంగము - అద్వైత విజ్ఞాన సారము
20. తరంగము - ఉపనిష త్సందేశః


Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# సరస్వతి నమస్తుభ్యమ్

శారద, శారదాంబురుహ చారుతరాస్య, మదాస్య గేహసం
చారము సేయుఁగాక తనసన్నిధి సన్నిధియై- దయామృతా
సారమువోని సౌఖ్యములు సర్వదయై యిడి నన్ను సర్వదా
పారము జేర్చుఁగావుత మపార భవాంబుధి మగ్న మానసున్.

శరణన్నన్ గరుణాతరంగిత కటాక్షస్ఫార వీక్షాపరం
పరల న్నన్నుఁ గృతార్థసార్థవహుఁగా బాటింతువంచున్ భవ
చ్చరణంబుల్ శరణంబు వేడెదను బో సర్వేశ్వరీ ! యీ చరా
చరభూత ప్రకరోపజీవ్యములు.. శశ్వత్సౌఖ్యసంప్రాప్తికిన్.

ఆ వాల్మీకిమహర్షి నీదయిన దివ్యాకార మీక్షించి ఆ
యావేశంబున బల్కినట్టి దొక కావ్యంబయ్యె- నీ రమ్యమూ
ర్త్యావిర్భావమునన్ హఠాచ్చకితుడై యా కాళిదాసుండు తా
నైవేద్యంబుగ నీకొసంగిన కృతుల్ నానారసాలంకృతుల్.

నామము రూపమంచు నొకనాటక మీయది నీదు వైఖరీ
ధామమె - దీనిదాటిచన తారసిలున్ మఱిమూడు- వానికే
నామము రూపముం గలవు- నల్లడ గన్పడు నట్టిదెల్ల నీ
వామకటాక్ష పాతిత నవామల దీధితిజాలమే సుమీ !

Yalamanchi Srinivasa Rao
www.advaitavedanta.in

నీవె పరయన- పశ్యంతి నీవె- నీవె
మధ్యమయు- వైఖరియు నీవె- మదిదలంప
నీవుగానిది కలదె యీ నిఖిలజగతి,
నిఖిలజగతియు నీవెకా నీరజాక్షి.

ఒకకేల నవనవోద్యోగ యోగవిభూతి
నెనయించు పుస్తక మ్మొనరఁదాల్చి,
ఒక హస్తమున చిరాభ్యుదయదాయక శతా
ధికసంచితాక్షమాలిక ధరించి,
ఒకకరమ్మున చకచ్చకితకాంతిగుళుచ్ఛ
మనసొప్పు రామచిల్కను వహించి,
ఒకపాణి సలిలవేణిక భక్తిఁగొనితెచ్చి
యిడిన కాంచనపద్మ మిరియఁజేర్చి,

ధర్మకామార్థ మోక్షప్రదాత్రి ననుచు,
నాల్గు పురుషార్థములు దాల్చి నాల్గుకేల,
నీవు సాక్షాత్కరింపనో దేవి మాకు
కామితార్థంబు లికనేమి గలుగు చెపుమ.

★★★

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# శివాభ్యర్థన

1. శ్రీకిక్ ధాత్రికి పీఠమై చనుతను శ్రీ ధర్మ రక్షా విధి
స్వీకార ప్రియ మిత్రమై నిలువ – దోర్విన్యస్త దివ్యాయుధా
నీకం బాసుర శక్తి భేదన కళా నిర్ణిద్రమై కొల్వ – నీ
లోకం బేలెడు నాది దేవుడు కృపాలో కంబు పై నిల్పెడున్.

2. అశ్రాంత పతి సేవనైక జీవన భాగ్య
 కమనీయ గుణ సమాఖ్యాత చరిత
ప్రత్యంగ సౌందర్య వైభవో జ్జ్వల దేహ
 బహు కార్య భార నిర్వహణ దక్ష
చేతనా చేత నోద్భూతి కారణ గర్భ
 ద్వంద్వాను భవ పయోధర వినమ్ర
కామాది సూచకో డ్డామరాయుధ హస్త
 సింహాసనీ కృతా శేష గగన

3. అస్తి నాస్తి పద ప్రయోగాతి వర్తి
భూమి కా ఖేల నాలోల – భూత పాల
మమ్ము కరుణించి ముక్తి కడ్డమ్ము లేక
ఓ సరిలు గాక మా తల్లి యోగమాయ ॥

★★★



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# ఆత్మ విమర్శ

1. మానుషజన్మమెత్తియు - నమానుషకృత్యము లాచరించు నీ
మానవజాతి యెన్న డిక మంచికి నర్థమెఱుంగు - నెన్నఁడీ
దానవ చేష్టితం బుడిగి దైవ గుణంబుల నభ్యసించు - నీ
శానుడె వచ్చిచెప్పినను సంభవమంచు దలంప నెప్పుడుఁ.

2. ఆయీశానుడె గాదెయిచ్చె మనకా హామీ యితః పూర్వమే
చాయం దుష్కృతు లుద్భవింతురు వినాశంబేను కల్పింతుఁబో
మ్మాయా వేళలనంచు - నా శపథమేమాయెఁ సమస్త ప్రజా
శ్రేయో ఘాతిపరశ్శతాధికరిపు శ్రేణిఁ విదారింపఁగ ఁ.

3. అప్పుడెగాని యిప్పుడది యక్కఱరాని ప్రతిజ్ఞయాయెనో
చెప్పుటగాదు చేయవలె - చేతకు మాటకు పొంతనంబులే
కొప్పమి యీ సరాధముల కుండిన నుండగ వచ్చుగాక - యీ
తప్పిదమా పరాత్పరుడె తానెటు లాడగనేర్చె నీశుడై

4. ఈశ్వరుండాడె ననిగాదు - ఈశుడాడె
నని యొకానొక మహితాత్ము డనినమాట
మహితచిత్తుడె గావచ్చు మౌనివర్యు
డైన గావచ్చు. నతడును మానవుండె.

5. మానవు లందటీ జగతి మారణయంత్ర కృత ప్రమాద వీ
క్షానాల దగ్ధచిత్తులయి యాత్మలనిట్టు తపించి యుందు-రీ
శానుడె రామకృష్ణ త ను సంహతి దాల్చి కృతావతారుడై
యీ నరరూప రాక్షసుల నెల్లవధించె నటంచు నార్తులై.

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

6. ఈ విధమున వారికి గల
యా వేదన కథల నల్లి వ్యక్తము చేసెం
గావలయును వాల్మీకియు
నా వేదవ్యాసుడును మహాద్భుత ఫణితి ఁ.

7. అంతియకాని యీశ్వరుడె యార్తజనావను డుండెనేని యీ
వంతున శాస్త్రవేత్తలును పాలక వర్గము తోడు దొంగలై
దొంతరలైన యస్త్రములతో భువనాంతర జీవకోటి ది.
గ్భ్రాంతులంఁజేయగా తనది గాదని యూరక చూచుచుండునే.

8. మరి యీ సృష్టికి న్యాయ మేమిటిక ధర్మం బేమిటఁ ప్రశ్నకుఁ
సరిగా నుత్తర మిచ్చుటెవ్వరికినే సాధ్యంబుగా - దింతకుఁ
సరిపెట్టన్వలె పూర్వజన్మకృత దుష్కర్మాను రూపంబె యీ
పరితాపంబని - యుక్తి యుక్తముగ తోపంబోవ ద వ్వాక్యము ఁ.

9. సకల ప్రాణులు నొక్కమాటుగ వినాశం బొంద - వారెల్ల నిం
తకు ముందేకముగా నొకేయొక మహాదౌష్ట్యంబు గావించిరో
అకలంకంబగు గాదె యందఱకు నాద్యంబైన జన్మంబు - దా
నికి తర్వాత కళంక మెట్లొదవె - నందెట్లేర్పడెఁ భేదముఁ

10. పాపపుణ్యంబులును సమభాగమైన
మనుజ జన్మంబు ప్రాప్తించు ననుచు జెప్పు
శాస్త్ర- మటులైన మృగపక్షి జాతికంటె
హీనమగు మానవుల జాతి యెట్టులొదవె

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

11. పరమనికృష్ట జీవులని భావన సేయు సరీసృపంబులు ౯
తరువులు - పక్షులు౯ మృగవితానము చూడగ నొండొకళ్ళతో
నరమరలేక చాలవఱ కాదర మొప్పగ జీవయాత్రలో
నిరతము సాగిపోవ నది నేరని మర్త్యుడుమేటి యెట్లగు౯

12. మన సొక్కటి యుండగనే
గన నేరదు ఘనత - యుండగా వలయు వివే
చన యందురు మన పెద్దలు.
మను జున కదిలేక యెట్లు మహి జనియించె౯.

13. కొందఱకీ వివేకమొన గూడియు లేదు సుఖంబు - పుట్టువుం
జెందిన యప్డు - రేపు మృతిజెందిన యప్పుడు కోలుపోవుచో
నందఱు మానవుల్వలెనె యంత వివేకము కోలుపోయి యీ
బొందిని మాత్రమే విడిచిపోయిరి సర్వము శూన్యమన్నటుల్.

14. కావున దీనికంతటికి కారణమేమని పట్టిచూచిన౯
భావన కందరానిదని భావనచేసియె తజ్ఞులందరు౯
నీవనుకొన్న దంతయు ననిర్వచనీయ మటంచు బల్కి-రీ
భావముతోడఁ జూడనిక ప్రశ్నయె లేదని తోచునెమ్మది౯

15. ఐవను ప్రశ్న వేయుటకు నా స్పద మున్నది - నిర్వచింపగా
దీనిన శక్యమన్న - మరిదేనికి శక్యము - భావమున్ననే
గాని యభావమంచు పలుకం జన-దింతకు నిర్వచింపగా
దేనిని జూచి చెప్పెదరు - దీని న నిర్వచనీయ మంచిటుల్

16. సర్వము కాదు పొమ్మనుచు చాటిన యప్పుడికేది కావలెన్
నిర్వచనీయ - మున్న దొక నేనెగదా పరిశేష వృత్తిచే -
సర్వ వి లక్షణంబయిన సాక్షిని గావున నాకు గల్గదీ
చర్విత చర్వణంబయిన జన్మవినాశ భయం బొకింతయు౯

17. అని వేదాంతులు మనకి
చ్చిన యభయము - కాని సాక్షి చేతన యున్న
ట్లను భవములేదు నాకీ
తనువును ప్రాణంబు మనసు తప్ప విడిచినఁ.

18. అవునదిసత్య - మీ తనువు ప్రాణము నింద్రియ చిత్తవృత్తులే
నవునని చూచు నంతవఱ - కన్నియు నాకిటు గోచరించుచో
నివి యెటు కాదు నేననుచు నించుక నీవు విమర్శ చేసితే
నవలనె యుంటి వాకసము నట్లు నిరాకృతి వౌచునెల్లచో.

19. వాస్తవమయ్యు నాయనుభవంబున కేల ఘటిల్లదన్న నీ
వస్తిమితుండవై కనునదంతయు కాంచెడునేనటంచు వ్య
త్యస్తము గాగ చూచుటయె అందులకుంగల కారణంబు - నీ
వాస్తవమైన రూపమున వాప్తము సేయక విస్మరించుటే.

20. అసలగు రూపమున్ మఱచి నప్పుడు నీకదె అన్యరూపమై
మెసలుట తథ్య - మెట్ల నిన మేదినిపై బడు సూర్యరశ్మినీ
విసుకపరం గనుంగొనిన నెత్తుగలేచిన యెండమావులై
వెస భ్రమగొల్పుగాదె - యి వి వేలును లక్షలు జీవితంబులో.

21. నేనని యసలగు నాత్మ
జ్ఞానము లేకునికి నదియె కాయము గా నీ
ప్రాణేంద్రియములు గా నీ
మానసముగ తోచు చుండె మహి సర్వముగా.

22. ఇదె సంసారంబను పేరిట
గుదిబండయి మెడకుంజుట్టు కొనియెను నీకున్
వదలదు నీ య జ్ఞానము
వదలక పీడించు చుండువఱకును సుమ్మీ

23. జ్ఞానమె నా స్వరూపమని చాటిన యప్పుడు. దాని నేనెటుల్
కానక విస్మరించితి – నఖండచి దాత్ముడనయ్యు నింద్రియ
ప్రాణ మనశ్శరీరముల బంధములో నెటుచిక్కుకొంటి నో
దీనికి నేమిటుత్తరము తెల్పుమటం చడుగం దలంచినన్

24. దానికి నుత్తరం బిడిరి తద్జ్ఞులు నీకిపుడున్న యట్టి యీ
జ్ఞానము నిర్విశేషమగు జ్ఞానము కాదు – విశేషరూపమీ
జ్ఞానము – కానిచో నడుగంజాలవు నీవొక ప్రశ్న దానికి
నేనును నుత్తరం బొసగనేరను సుమ్ము యథార్థ మారయన్

25. ఇది యెటులన్న ప్రశ్న యెపుడేర్పడెనో యపుడే యఖండతా
స్పదమగు నీ స్వరూపమును బాసి తి – వప్పుడెనేను నాదిగా
జెదరి సఖండమై యొకటి జీవుడు వేరొకటీ జగత్తుగా
సదమదమౌచు జూచెదవు సంసృతియన్ మృగతృష్ణికాంభమున్

26. కావున వృత్తులేవియును కల్పన చేయక జ్ఞాన మాత్రమే
నీవని చూతువేని ఒక నీవననేల సమస్త లోకమున్
నీవయితోచు – నప్పుడిక నేనును నాదను ద్వైత భేదసం
భావనయే యభావమయి బంధ నివృత్తి తనంత నేర్పడున్.

★★★

Yalamanchi Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

# స్వాతంత్ర్య దినోత్సవము

1. మరలన్ వచ్చె నిదే – స్వతంత్ర భరతాంబా జన్మ సంవత్సర
స్ఫురితోత్సాహ సహస్ర దీధితి – మహః పూర్ణా ఖిలాశాంతమై
మరలన్ హెచ్చెను – భారతీయ జనతా మాంగళ్య సంకీర్తనో
ద్ధుర నానాకవి కంఠకాహళము – లాతో ద్య ప్రతోద్యంబులై.

2. ఎంత శుభోదయం బయిన దీదిన మీ భరతావనీ ప్రజా
సంతతి కంచు కొందఱ తి సమ్మదవీచుల తేలియాడగా –
ఇంతటి దారుణావసర మెన్నడు గాన మటంచు వేదనా
క్లాంత మనోలతాంతులు విలాపము సేతురు కొంద రార్తులై.

3. బహు వస్తు జాల సంపద లీను వివిధ యం
త్రములఁగూడిన పరిశ్రమము లేమి
పలు ధాన్యములు రత్నములు పుష్ప ఫల సంత
తుల నిచ్చు ఖనివనీ స్థలము లేమి
గ్రామ పర్వత సరి ద్వ్యో మాధ్వముల మనో
జవములై చనువాహ చయము లేమి
అణు పరీక్షా చణ క్షణ సముత్ప్రేషిత
గ్రహ మార్గగా మ్యుపగ్రహము లేమి.

4. శాస్త్రశోధన లేమి – విస్తార దూర
సాగరాన్వేషణము లేమి – చర్చ సేయ
అభ్యుదయ కారి కార్య దిశాభిముఖమె
దేశ మిది – లేదు సందేహ లేశమిపుడు.

Vallamsri Brahmasri Rao www.advaitavedanta.in

5. చేసితి మెన్నొ రాష్ట్ర జన జీవన దాయి శుభ ప్రసంగముల్
వేసితి మెన్నొ నవ్యతర విస్తృత దీర్ఘ బృహ త్ప్రణాళికల్
త్రోసితి ముచ్చ నీచకుల దుష్ట పిశాచిని మూల మూలకుఁ
రోసితి మగ్రరాజ్యముల రూక్ష విశృంఖల రాక్షసక్రియల్

6. అక్షర శూన్య వక్త్రుడగు నాతడు - కూడును గుడ్డ లేని ప్ర
త్యక్ష కు చేలు - డెందు నిలయం బననోచని ద్రిమ్మరీడు - ని
ర్లక్ష య భేష్ట వర్తనుడు - లంఘిత సర్వ సమాజ ధర్మ హే
మాక్షుడు - లేదు లేదని మహోర్భటి చాటితి మెట్టుకోటపై

7. ఇది యంతయుఁ గానిది - అ
భ్యుదయం బిక నేమిగలదు. పొమ్మని తోచుఁ
మది - కైనను తోపదు నె
మ్మదికిఁ తత్త ద్వ్యతి క్రమంబులు చూడఁ -

8. నలువది రెండు వర్షముల నాటికి ముందు విదేశ పాలనా
బలవ దభేద్య రాక్షసిని పాఱఁగఁదోలి యహింసనాత్మకో
జ్జ్వల కరవాల ధార - మన వారలు చూడ స్వదేశ పాలనా
చ్ఛల భయ దోగ్ర రాక్షసిని జాతి కోసం గగఁబోలు క్రమ్మఱన్

9. స్వాతంత్ర్యంబను పేరు పేరునకె - రాష్ట్రం బంతయున్ పారతం
త్ర్యాతంక జ్వర పీడితంబయి - ముహుః స్వార్థక్రియాలాభని
ష్ణాతంబై - యితరేతరాభిభవ హింసాధ్వంస నాపాదకో
త్పాతంబై శతధావిశీర్ణమయి పోవం జూడమే యెల్లెడన్

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

10. ఉత్తరంబున సమా యత్తమై కచ్చెకు
కాలు ద్రవ్వెడు చమూజాల మొకటి
పంచ బంగాళమౌ ప్రాగ్ది శాభ్యంతర
ప్రాంత మందలి యాతి బాధ యొకటి
పశ్చిమంబున యజ్ఞపశు సమాన వద్దైక
పారీణమగు చిక్కు ప్రశ్న యొకటి
ఇది లంకయను మాట కెనయౌచు దక్షిణా
శను సాగు రాక్షస చర్య యొకటి.

11. ఒకటి యననేల ఒక్కొక్క టకట వికట
కూట పర్వత కోటి శృంగాటకమున
నిలిపి జాతిని – నిలువున ఒలిచి తొలిచి
కలచి వైచుట చూడమే కన్ను లార.

12. మానము ప్రాణముంగొను అమానుష కృత్యము లెల్ల గొప్పవి
జ్ఞానము – జాతి నీతి యను జాడ దలం పని ఆత్మకార్య సం
ధానమె ధ్యేయ – మైన మన నాగరి కత్వము పాల్య పాలక
స్థానము లందు రెండిటను సాగెడు నిప్పు – డ పక్ష పాతియై

13. ఇట్టి యెడ – నేమి స్వాతంత్ర్య – మేమి శాంతి
ఏమి యుత్సవ – ముత్సాహ మేమిటనెడు
మాట యును లేక పోదు ముమ్మాటి కిపుడు
మాన సంబుల నెంతటి మౌనికైన

14. ఐనను రాకపోవ దసుఖాంత కరంబగు వేళ – దుర్దశా
ధీన విదీనయైన భరతేందిర వెండియు మందహాసర
మ్యాననగాక పోవ – దను నాశ ఫలించెడుఁగాక – ఈరవీం
ద్రానన భారతీ ధ్వనితమై – హితమై – సతతోపభోగ్యమై

Vallabhajosyula Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

# డా॥ పుట్టపర్తి నారాయణా చార్యులకు ఆయన షష్టి పూర్తి సందర్భంలో.

1. శ్రీమాన్ సహస్ర ముఖకీర్తిత భాగధేయో
నారాయణో జయతు భాగవతానురక్తః
యస్యావతార విభవైరివ కావ్యజాతై
రారజ్యతేహి సకలోపి రసజ్ఞలోకః

2. భాషాపయో వితరణేన బహుప్రబంధ
క్షీరాన్న భోజన మిషేణ మహాకవీనాం
మార్గానుధావన వశేన సరస్వతీయం
పుత్రంయద్దైవ జననీ బహుధా పుపోష

3. కావ్యంయధా భవతి యస్య వినోది శాస్త్రమ్
యశ్శైవ వైష్ణవ కథాసు సమం నిమగ్నః
ఆశైశవా దపిచ యే న తు నిర్విశేషమ్
దుగ్ధం త్రిలోక జననీ స్తనయో ర్నిపీతమ్-

4. యస్యాగమేషు వివిధేషు పురాణవాటీ
ష్వారామ నామక మహామను ధారణేషు
కావ్యేషు చిత్తసుఖదాన మహాఫలేషు
లీలాశుకీవ ధిషణా విహర త్యజస్రమ్.



Vallabhaneni Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

5. ఆద్యాపిబాల ఇవయః పతనానుషంగా
త్సంద్దృశ్యతే జ్వలితయాచ ధియా ప్రగల్భః
యస్యానభిజ్ఞ మధునాపి జగత్ప్రవృత్తేః
సర్వజ్ఞతామివ దధాతి కలాసుచేతః

6. శ్రీ శ్రీనివాస విబుధేన సమర్పితోయం
పద్యానుబంధ రచనా కుసుమోపహారః
నారాయణస్య హృదయే వనమాలికాభాం
శోభాం తనోతు నితరా మిహ షష్టిపూర్తౌ

★★★

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# శేషశాస్త్రి గారితో నా అనుభవం

గడియారం శేషశాస్త్రి గారితో నాకు మొదటి నుంచీ అంత పెద్ద పరిచయం లేదు. మా ప్రాంతం వేరు. ఆయన ప్రాంతం వేరు. కాని నేను రాయలసీమ కళాశాలల్లో చాలా కాలం పని చేయటం మూలంగా వారితో కొంత పరిచయ మేర్పడింది. అప్పుడప్పుడు ఏవైనా సభలలోనూ సమావేశాల లోనూ కలుసుకోటం తటస్థిస్తూ ఉండేది. అంతే కాక నేను పది పదిహేను సంవత్సరాలుగా ప్రొద్దుటూరులోనే ఉండడం వల్ల ఐదారు సార్లు వారింటికి కూడా వెళ్ళి మాట్లాడటం జరిగింది. ఇదీ నాకు వారితో ఉన్న అనుబంధం.

గడియారం వారనగానే మొట్టమొదట వారి శివభారతం గుర్తుకు వస్తుంది. ఆధునిక కాలంలో ఇది ఒక చక్కని చారిత్రక ప్రబంధం. ఇతి వృత్త మెంత ఉదాత్తమైనదో రచన కూడా అంత ప్రసన్నంగా సాగింది. మనకీ కాలంలో ఖండ కావ్యాలున్నవేమో కాని కొనా మొదలు ఇంత ఒడుదుడుకులు లేకుండా సాగిన మహాకావ్యం లేదు. పైగా కవి కవిత కోసమే గాక సార్వకాలికమైన సార్వజనీనమైన జీవిత సత్యాలను చాటటం ఇందులో ఒక గొప్ప విశేషం. అతిలోకమైన కవితా శిల్పం కాకపోయినా అతి సూక్ష్మమైన చిత్ర విచిత్రమైన మానవ మనస్తత్త్వాన్ని విప్పి చెప్పటంలో గొప్ప విజయాన్నే సాధించిన కావ్యమిది. ప్రసన్న గంభీరమైన ఈ కావ్యం మహాభారతం లాగానే భారతీయత అనేది లోకంలో ఉన్నంత వరకు బ్రతుకు తుందనటంలో సందేహం లేదు. కవి బ్రహ్మ చెప్పినట్టిది ఆంధ్రావళి మోద ముంబొరయు ఒక అద్భుతమైన కళాఖండం.

పోతే వీరు బాగా వృద్ధులైన తరువాత రచించిన మహాకావ్యం మరొకటి ఉంది. అది వారి రామాయణం. వాల్మీకాన్ని చక్కగా అవగాహన చేసుకొని రచించిన ఈ గ్రంథం చాలా విపులమైనది. పరిమాణంలోనే కాదు. గుణంలో కూడా ఇది ప్రశంసనీయమే. ఒక మారు శాస్త్రులు గారి ఇంట్లోనే దీన్ని గురించి ప్రస్తావన వచ్చింది. నాకొక్కడికీ అందులో కొన్ని పద్యా లక్కడక్కడ చదివి వినిపించారు. శివ భారతంలో ఉండే పొంగు కూడా తగ్గి ఇది ఇంకా సరళంగా సుందరంగా నడిచింది. రామ కథలోని అన్ని అంశాలను స్పృశిస్తూ ఆ కథలోని రహస్యార్థాలను గూడా ఎంతో వ్యంగ్యంగా ప్రదర్శిస్తుందీ మహాకావ్యం.

ఇలా భారత రామాయణాలను రెండింటిని భావన చేసి మరలా భారతీయులకు వైయక్తిక సామాజిక ధర్మాలను రెండింటిని ప్రబోధించి నిజమైన ప్రగతి పథంలో అడుగుపెట్టించిన ఈ మహాకవి ఆంధ్రులందరికీ చిరస్మరణీయుడు.

వీరి రచన మాదిరే వీరి జీవితం కూడా చాలా నియమ బద్ధమైనది. వ్రాతే కాక మాట కూడా మంచి నిగ్రహం కలిగి ఉంటుంది. వీరి బోధనా పాటవమెంతో మనోజ్ఞంగా ఉండేదని అది వారి కొక ప్రత్యేకమైన కళ అని ఇప్పటికీ వారి శిష్యకోటి వేనోళ్ళ పొగుడుతూ ఉంటుంది. ఇక వయస్సు మళ్ళే వరకు వారు చేసిన అష్టావధాన శతావధానాల విషయం చెప్పనే అక్కరలేదు. అంతో ఇంతో అన్ని విషయాలలోనూ ప్రవేశ ముండేది శాస్త్రి గారికి. అన్నిటిని మించి వారిలో నాకు గొప్పగా నచ్చిన విషయాలు రెండున్నాయి. ఎదుటివారిని నొప్పించకుండా తనకు గిట్టని వారినైనా సరే

అదే పనిగా నోరు తెరిచి ఆక్షేపించకుండా మృదువుగా, హితంగా ప్రసంగించటం ఒకటి. ఒకరు తటస్థపడిందే తడవుగా తన పాండిత్య ప్రకర్షనంతా బయటపెట్టాలనే ఆదుర్దా లేకపోవటం మరొకటి. నిజంగా శాస్త్రి గారు పూర్ణ పురుషులు. సహస్ర మాసజీవి అయిన వారి భౌతిక శరీరం మనకు దక్కకపోయినా దేశకాలా వధులు దాటిన వారి కీర్తి శరీర మెప్పుడు మన ఎదుటనే ఉంది.

★★★

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# సాహిత్య సౌరభము

1. సాహిత్య మనే మాట అటు శాస్త్రకోటినీ - ఇటు కావ్య కోటినీ రెండింటినీ పరామర్శించే మాట. రాగా రాగా ఇది కావ్య శాఖకు మాత్రమే పరిమితమైనది. కనుక ఇప్పుడు సాహిత్య మని ఎవరెక్కడ ప్రయోగించినా దాని కర్థం కావ్య ప్రపంచమే గాని మరొకటి గాదు. Literature అనే ఇంగ్లీషు పదానికిది సబ్రహ్మచారి.

2. అసలు శాస్త్ర జగత్తుకూ - కావ్య జగత్తుకూ ఉత్తర దక్షిణ ధ్రువాలకున్నంత దూరమున్నది. కావ్య మనేది ఒక విలక్షణమైన సృష్టి. శాస్త్ర సృష్టి లాంటిది కాదది. శాస్త్రమేదైనా తీసుకొని చూడండి. అది మానవ జీవితం చుట్టూ ప్రదక్షిణం చేస్తుందే గాని జీవితాలయంలో ప్రవేశించదు. కావ్య మనేది అలా కాదు. అది సరాసరి జీవితంలోకి చొచ్చుకొని పోయి దాని లోతులనే స్పృశిస్తుంది. శాస్త్రానికి జీవితం చుట్టూ ఉండే లోకమే సామగ్రి అయితే కావ్యానికి జీవితమే సామగ్రి. అంతే కాదు. శాస్త్ర ప్రపంచ మొకవాస్తవాన్ని **Fact** చెప్పి ఊరకుంటుంది. మరి కావ్య మంతటితో నిలవదు. ఆ వాస్తవాలన్నిటికీ ఒక ఆదర్శాన్ని వెదకి పట్టుకొని దానితో వీటిని ముడిపెట్టటానికి యత్నిస్తుంది. అందుకే దీని నొక్క దానినే సాహిత్యమని పేర్కొన్నారు పెద్దలు.

3. ఆ మాటకు వస్తే ఒక శాస్త్రమే గాదు. మానవుడు గడించిన అన్ని జ్ఞానాలకూ మిన్న సాహిత్య జ్ఞానం. లోక జ్ఞానం శాస్త్ర జ్ఞానం - కళా జ్ఞానం - అని మూడు జ్ఞానాలు గదా మానవుడికున్నది. ఇందులో లోక జ్ఞానం మనకు మంచీ చెడ్డా అంతా కలగా పులగం

చేసి అందిస్తుందే గాని సత్యా సత్యాలను చక్కగా విభజించి చూపదు. శాస్త్ర జ్ఞానం సత్యాలనెన్నింటినో బయట పెడుతుందే గాని అందులో సౌందర్య మనే గుణం చాలా తక్కువ. పోతే ఈ సౌందర్యచ్ఛాయ నెంతగానో సంతరించుకొన్నాయి సంగీత నృత్య చిత్రలేఖ నాదులైన కళలు. కానీ ఈ కళలన్నింటిలోనూ కనిపించే సౌందర్యమంతా మనం పోగు చేసినా అది పరి పూర్ణమైనది కాదు. అది పరిపూర్ణత నందు కొన్నది. ఒక్క సాహిత్యంలోనే. అదే సత్యమూ – సుందరమూ – సమగ్రమూ – అయిన మానవ విజ్ఞానం.

4. సత్యం – శివం – సుందర మని అభియుక్తుల సుభాషితం. ఇవి మూడు ఎక్కడ పడుగుపేకగా పెనవేసుకొని ఉంటాయో దానినే మన పెద్దలు సమగ్రమైన జ్ఞానమని నిర్దేశించారు. సాహిత్య మేవం విధ విశేషణ త్రయవిశిష్టం. కనుకనే అది సమగ్రతా శిఖరాన్ని అధిరోహించింది. ఇందులో సత్యమనేది కావ్య ప్రతి పాదితమైన విషయం. సుందరం దాని రచన. మరి శివ మనేది తన్ముఖంగా కవి ధ్వనింపజేసే ఆదర్శం లేదా ప్రయోజనం. ఇది ప్రేయస్సయినా కావచ్చు. శ్రేయస్సయినా కావచ్చు. ప్రేయస్సంటే మానవుడికి తాత్కాలికంగా కలిగే సంతృప్తి. శ్రేయస్సు దానితోపాటు జనించే ఉత్తమ సంస్కారం. ఒకటి తన వరకే అయితే మరొకటి తనకూ సమాజానికీ కూడా ఉపకరించేది. మొత్తం మీద ఇవి రెండే సాహిత్య క్షేత్రం నుంచి మన మెప్పటికైనా ఆసించే ఫలాలు. ఏతత్ఫల ద్వయరస మాధుర్యాన్ని రసజ్ఞుల నాలిక కందించే ప్రణాళికే రచన. అదీ సౌందర్యాన్ని పొందు పరుచు కొన్నప్పుడే అపేక్షిత రసాస్వాద సిద్ధి. మరి ఈ రచనా ప్రణాలిక కాధారమైన పారిజాతం ఇతి



Yalamanchili Brahmasri Srinivasa Rao www.avantaveda.in

వృత్తం. ఇతి వృత్త మన్నా వృత్త మన్నా వస్తువన్నా – కథ అన్నా – సామగ్రి అన్నా – అన్నీ ఒక దాని కొకటి అన్నదమ్ములే. ఇంతకూ సామగ్రి లేకుంటే రచన లేదు. రచన లేదంటే ఫలసిద్ధిలేదు. మూడింటికీ ఉన్న ఈ సాహచర్యం మూలాన్నే సాహిత్య మనే నామధేయం సార్థక మయింది. ప్రకృష్ట మయిన బంధం కావటం మూలాన ప్రబంధమయింది. దీనిని సాధించట మొక్కటే కవికున్న వ్యాపారం కాబట్టి ఇది చివరకు కావ్యమయింది.

5. దీనిని బట్టి సాహిత్య ప్రక్రియలో వీటి మూడింటికీ మధ్య ఉన్న ఒక గొప్ప సామరస్య మేమిటో ఇప్పుడు మనకు బాగా తేటపడుతున్నది. అదేమిటంటే కేవలమొక సత్యాన్ని ఉన్న దున్నట్టు ఏకరువు పెట్టి నంత మాత్రాన అది సాహిత్యం కానేరదు. ఏ భావాన్ని వర్ణించినా అది సుందరంగా హృదయంగ మంగా వర్ణించాలి. మరి ఎంత రమణీయంగా వర్ణించినా అందులో భావ మనేది కరవైతే మరలా ప్రయోజనం లేదు. దానికాధార పీఠమైన వస్తువు కూడా ఒకటి చోటు చేసుకొని ఉండాలి. భావ సంపదలేని సౌందర్యం నేల విడిచిన సామయితే – సౌందర్య స్పర్శలేని భావ మొక చవీ – సారంలేని భోజనం. ఈ క్రింది పద్యాన్ని చూస్తే మీకీ సూత్రార్థం బోధపడుతుంది.

"ఏఱకుమీ కసుగాయలు
దూఱకు మీ బంధుజనుల – దోసము సుమ్మీ
పాఱకు మీ రణమందున
మీఱకు మీ గురుల యాజ్ఞ మేదిని సుమతీ"

Yalamanchili Brahmaji Srinivasa Rao
www.advaitavedantam

ఇది మంచి పద్యమే. ఒక మంచి సుభాషితమే చెబుతున్నది. సందేహం లేదు. అయితే అది అంత వరకే. ఒక జీవిత సత్యం చెప్పటం వరకే దాని జీవితం ఆగిపోయింది. ఆ చెప్పటంలో ఒక చెప్పుకోదగిన అందమేదీ కానరాదు. ఏ అలంకరణా వేషధారణా లేకుండా పాత్రలు ఒక దాని వెంట ఒకటి రంగంలోకి వచ్చి వెళ్లినట్టుగా వెళ్ళుతున్నాయి భావాలన్నీ. అదే మరో పద్యం చూడండి.

అల్పుడెపుడు పలుకు నాడంబరము గాను
సజ్జనుండు పలుకు చల్లగాను
కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ ! వినుర ! వేమ –

ఇది కూడా ఒక గొప్ప సత్యాన్ని చెప్పే పద్యమే. అయితే ఇది దాన్ని ఊరక ఏకరువు పెట్టటం లేదు. చెప్పటంలో ఒక అందమూ, చందమూ ఉంది. అది కంచు – కనక మనే రెండు ఉపమాన ద్రవ్యాలను కొని తేవటం ద్వారా వ్యక్తమవుతున్నది. ఆడంబరంగా పలకట మంటే ఏమిటో చల్లగా మాటాడటమంటే ఏమిటో ఎలా ఉంటుందో మాటలతో చెప్పలేని అనుభూతి నివి మౌన భాషలోనే మన కందిస్తున్నాయి.

6. ఒక కవి సమర్థుడయిన కొలదీ ఈ అందాన్ని తన రచనలో అనేక మార్గాల సాధించగలడు. అలంకారంలోనే గాదు. శైలిలోనే గాదు ఛందస్సు లోనే గాదు – ఆఖరు కొక మాటనేర్పులో కూడా సాధించగలడు. ఇవైనా ఏదో స్థాలీపులాక న్యాయంగా పేర్కొన్న మార్గాలు. ఒక్కొక్క మార్గంలో మరలా ఎన్నో మలుపులూ తిరుగులూ ఉండవచ్చు. వాటికిక అవధులంటూ లేవు. ప్రౌఢుడైన కవి

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అన్నింటిలోనూ రవి ప్రభ లాగా దూసుకొని పోగలవాడే.

కందుకము పోలె సుజనుఁడు
క్రిందంబడి మగుడ మీఁదికి న్నెగయుఁజుమీ
మందుఁడు మృత్పిండమువలెఁ
గ్రిందంబడి యడఁగియుండు ఁగృపణత్వమునన్

చూడండి ఈ పద్యంలో కవి సుజన మూఢజనుల స్వభావ వైషమ్యాన్ని ఒకచక్కని ఉపమాలంకారమనే నేపథ్యం మీద ఎంత చమత్కారంగా చిత్రించి చూపాడో ! ఇలాగే శైలిలో చూపిన మరి ఒక పద్యాన్ని తిలకించండి.

విదలింప నుఱుకు సింగపుఁ
గొదమయు మదమలిన గండ కుంజరములపై
నిది బలశాలికి నైజము

గద ! తేజోనిధికి వయసు కారణ మగునే। ఇందులోనూ అలంకారం లేక పోలేదు. కాని దానిని మించి ముందుగా వచ్చి సహృదయుడి డెందాన్ని తాకేది అందులోని శైలి. అది ఆరోహణావరోహణాత్మకం. పద్యం పూర్వార్థంలో ఆరోహణ. ఉత్తరార్ధంలో అవరోహణ. సింగపు కొదమ ఎగిరి దూకుతున్నట్టు వర్ణించే పట్టున ఆరోహణ – అది తేజోనిధికి సహజమని ఒక లోక ధర్మాన్ని చాటే చోట అవరోహణ – పాటించటం రచన కెంత మెఱుగు పెడుతున్నదో రసికజనైక వేద్యం.

7. మరి ఛందో రీతిలోనే అందాన్ని చిందించటం అంతా ఇంతా కాదు. సంగీతంలో రాగాల లాగా ఎన్నో వందలు వేలున్నాయి భాషలో



Yalamarti Srinivasa Rao
www.avadhanavedika.in

ఛందస్సులు. అందులో ఏదో ఒకటి అలవోకగా తీసుకొని వ్రాయవచ్చు. కాని అలా వ్రాసుకొంటూ పోవటంలో వైశిష్ట్యం లేదు. ఏ భావానికి – ఆ భావంలో కూడా ఏ స్థాయికే వృత్తం సరిపోతుందో అదీ ఎంత సంఖ్యలో నడిస్తే బాగుంటుందో తూకం తూచినట్టుగా రచన చేయటం నన్న పని గాదు. రచనలో సడిసన్న ప్రౌఢ కవి క్రీడారంగం. కీచకుడు సైరంధ్రీ వేషంలో ఉన్న ద్రౌపదిని వెంటాడుతూ వచ్చిన దృశ్యాన్ని పరికించిన భీమసేనుడి ఆగ్రహాన్ని మహాకవి తిక్కనామాత్యుడు వర్ణించిన ఘట్టాన్నే తీసుకొని చూడండి. ఈ విద్య ఎలాంటిదో మనకు కనులకు కట్టినట్టుగా తెలిసి పోతుంది. అందులో ఒక కంద పద్యం – ఒక చంపక మాల – ఒక సీస పద్యం వరుసగా వస్తాయి. కోపం ఉదయించినప్పుడు కందం. అది కొంచెం పెరుగుతూ పోతే చంపకం. బాగా పెరిగి విజృంభించి ప్రళయ తాండవం చేసే భూమిక నందు కొనే సరికి సీసం. పాత్ర కేర్పడిన కోప విజృంభణను బట్టి పద్య విజృంభణ. ఛంద: ఖేలనలో ఎంత ఔచిత్య పాలన ! సహృదయుడైన భావుకుడెవడికి వాడు చదువుకొని పొందవలసిన ఆనందమది. మాటలతో చాట వలసింది కాదు. పోతే ఒక్కొక్కప్పు డిలాంటి విశిష్టమైన మార్గ మేదీ కాకపోయినా కేవల మొకమాట పొందికలోనే పలుకుబడిలోనే సౌందర్యం జాలువారే సందర్భాలు కూడా ఎన్నో ఉంటాయి. “నాదు మేనున్నది – చెంత గంగ మడుగున్నది – ఐనటు లయ్యేదుం దుదిఁ” అని వా పోయే సీత మాటలలో బలవంతంగా నేను ప్రాణత్యాగం చేయబోతున్నాననే భావం వాచ్యంగా ఎక్కడా కానరాదు. కంఠోక్తిగా చెప్పకున్నా మాటల సందర్భాన్ని బట్టి చూస్తే భావుకుడైన వాడి మనస్సు కది వెంటనే స్ఫురించక పోదు.

8. ఈ దారిలో నడుస్తూ పోతే మన మెంత దూరమైనా నడవవలసిందే కాని గమ్యం చేరలేము. ఇంతకూ సారాంశ మేమంటే సౌందర్య శబలితం గాని భావం ఒక శుష్కమైన సమిధ లాంటిది. దాని కొక దీప్తీ వ్యాప్తీ లేదు. అట్లాగే ఒక విశిష్టమైన భావమాలంబనం గాని సౌందర్య సృష్టి కూడా అపేక్షణీయం కాదు. అది ఒక శవానికి చేసే శృంగారంలాగా అమంగళమే అనిపించుకొంటుంది. శరీరానికి ప్రాణమెలాంటిదో రచనకు భావమలాంటిది. భావ సంపదలేని కేవల రచనా సౌందర్యం కవి నేర్పునే ప్రకటిస్తుంది గాని హృదయాన్ని కదలించలేదు. మన సాహిత్యంలో ఉత్తరాంధ్ర యుగానికీ – క్షీణ యుగానికీ చెందిన రచనలన్నీ చాలా వరకీ కోవకు చెందినవే. మాటల పోటీలో వాళ్లెంత ముందంజ వేశారో మధురమైన భావనలో అంత వెనక్కు తగ్గారు.

నువ్వుఁ బువ్వు నవ్వు జవ్వని నాసిక
ఇలాంటి రచన లే ర సజ్జులను నవ్వించటానికో ।
ఏ మంద మేమి సేయుద
మేమందని మందలింత మేమందమొ !

ఇందులో భావమైతే ఉంది గాని దానిని నిలువునా దిగ మ్రింగేంతటి సౌందర్య సంపాదనా సంరంభం కనిపిస్తూ ఉంది కవికి. ఇలాంటి రచనలెన్నో కుప్ప తెప్పలు మన సాహితీ సామ్రాజ్యంలో.

9. కాబట్టి మనం గమనించవలసిందే మంటే అసుందరమైన భావమెలా ప్రశంసనీయం కాదో భావ బంధురం కాని సౌందర్యం కూడా అలాగే అభినందనీయం కాదు. రెండూ రెండు అపాయకరమైన

అంచులు. కవి ఈ అంచులపైన ప్రయాణం చేస్తే అధః పాతాళంలో పడి పోయే ప్రమాదముంది. అంచేత ' స పురస్కృత మధ్యమ క్రమః ' అని మహాకవి వర్ణించినట్టుగా మధ్యే మార్గాన్నే పట్టుకొని పోవాలి. ఏమిటా మధ్యను మార్గం ! ఒక స్మరణీయమైన అర్థాన్ని రమణీయమైన మార్గంలో పొదిగి మనకు ప్రదర్శించటం. ఇలాంటి భావరచనా సామరస్యమే పునః పునరను సంధానాత్మకమై లోకోత్తరమైన రసానుభవాన్ని సహృదయలోకానికి ప్రసాదిస్తుంది.

10. తిక్కన గారి ఈ వర్ణన చూడండి ప్రస్తుతం చెప్పుకొన్న సూత్రానికెలా అద్దం పట్టి చూపుతున్నదో.

"యమమహిష ఘంటికా నా
దము వినఁగౌతూహలంబు దళుకొత్తెడు. చి
త్తములు గల కౌరవుల – కి
ష్టములగునే సంధి కార్య శాంతి వచనముల్ ॥

రాయబారానికి పోయే సమయంలో ద్రౌపది శోకో ద్రేకాన్ని ఉపశమింప జేసే వాసు దేవుని నోట వెలువడిన మాటలివి. దుర్యోధనాదు లతి మూర్ఖ స్వభావులు. తన మాట లెలాగూ వారు ఆలకించబోరు. అవి వారి చెవులకు శూలాయమానాలు. ఎలాగూ భారత యుద్ధం తప్పదు. అందులో దుశ్శాసనుడు చిత్రవధ పాలవుతాడు. దుర్యోధనుడు తొడలు విఱిగి నేల గూలుతాడు. అదే గదా ద్రౌపదికి కావలసింది. అలాంటి దారుణ పరిణామం కన్నారగాంచితే గాని ఆవిడ ఉడుకు చల్లారదు. మరి సంధి ప్రయత్నం సఫలమైతే అది ఎలా సంభవం. సర్వజ్ఞుడైన శ్రీ కృష్ణుని కది తెలియనిది కాదు. కనుకనే అతడంటున్నాడు. ఆ కౌరవ

పాంసనులు నా శాంతి వచనాలెలా వింటారు. అవి ఎంత చెడ్డా చచ్చు పుచ్చు మాటలే గదా. నిత్యోల్లాస శీలురైన వారి మనస్సుకవి ఉత్సాహమెలా కొలుపగలవు. అలాంటి కౌతుకమే వారికి కలగాలంటే అంతకన్నా ఆడంబరంగా వినిపించే రణరణధ్వనులే కావాలి. అవి ఏవోకావు. యమధర్మరాజు వాహనమైన దున్నపోతు మెడలో గట్టిన ఘంటానాదములే సుమా – ఎంతో ఆలస్యం కూడా లేదవి వారి చెవిని బడటానికి. అవి వినాలని ఎంతో వేడుకతో చెవులు రిక్కించుకొని దిక్కులు చూచే వారికి నా శాంతి వాక్యాలెలా వినబడతా యంటాడు పరమాత్మ. ఏమిటీ మాట కర్థం. ఆకౌర వాధము లెట్లాగూ యుద్ధంలో అంతా కట్టగట్టుకొని చావదలచారు గాని బ్రతకాలనే భావమొక్కరికీ లేదు. అలాంటి మొండితనమున్న వాళ్లునా మాట లెలాగూ వినరు. కయ్యానికి కాలుదువ్వుతారు. ఆ హోమకుండంలో సపరివారంగా పూర్ణాహుతి అయిపోతారు. దానితో నీ ప్రతీకార వాంఛ కూడా అప్రయత్నంగానే నెరవేఱుతుంది. నీవు కోరుతున్నదీ అదే గదా. ఇంత అంతరార్థ మిమిడి ఉన్న దిందులో. అంతే గాదు దుష్ట శిక్షణ – శిష్ట రక్షణ చేసి ధర్మ సంస్థాపన గావించకపోతే నేను లోకంలో అవతరించి ఏమి ప్రయోజన మనే మహార్థం కూడా ఒకటి తొంగిచూస్తున్నదీ మాటల్లో.

11. ఇంత లోతైన భావంగల ఈ పద్యానికి సంతరించిన రచన చూడండి ఎంత సౌందర్యాన్ని చిందుతున్నదో. ' యమమహిష ' అనే మాట మొదలు కొని ' కౌరవులు ' అనే మాట వరకూ మూడున్నర చరణాలు కేవల మారోహణ మార్గంలో నడిస్తే – తతిమా ఆ

కొంచెమూ అవరోహణంలో నడుస్తుంది. మొదట చెప్పిన భావం రౌద్ర బీభత్స భయానకాలను ద్యోతనం చేయాలి కాబట్టి అది ఆరోహణాత్మకవే కావలసి ఉంది. పైగా యమమహిష అన్నప్పుడెక్కడో ఊర్ధ్వలోకాలకు సంబంధించిన వ్యవహారం గదా అది. అంచేత తదను సారిగా రచన ఊర్ధ్వముఖంగానే సాగటం ఎంతైనా శోభావహం. అలాగే రెండవది శమ ప్రధానమైన ఖండం కాబట్టి అది అవరోహణలో నడవడమే అందం. పైగా ఎక్కడో వినువీధులలో గాదు. భూమిమీద హస్తి పురిలో కౌరవుల సభలో తానాడవలసిన మాటలవి. కనుక రచన అవరోహణాత్మకంగా సాగటమే సముచితం. ఇక్కడ మరి ఒక రమ్యత ఏమంటే పద్యం ఎత్తుగడ సమాసజటిలంగా ఆరంభమయింది. తరువాత కొన్ని తడిపొడి తెలుగు మాటలతో సాగింది. అలా సాగినా సంస్కృత సమాసంతో చేతులు కలిపి అవి కూడా ఊర్ధ్వాభిముఖంగా పయనించటమే వింత. మరి అలాంటి పొడిపొడి మాటలే అయినా – ఇష్టము లగునే దగ్గర నుంచి నడకలో ఒక సడలిక ఏర్పడి అది నిమ్నాభిముఖంగా సాగటం ఇంకా వింత. పద ప్రయోగం కూడా ఎంతో అభిప్రాయ గర్భంగా కనిపిస్తుందిక్కడ. ఘంటికా నాదమొకటైతే – శాంత వచనాలు మరొకటి. నాదానికుండే ప్రచండత వచనాని కెక్కడిది. పైగా అర్థంలేనిది నాదమైతే అర్థప్రకాశకమైనది వచనం. అయినా అర్థరహితమైన నాద మార్భాటంగా చెవుల బడుతుంటే ఇది దాని అనురణనంతో అణిగి పోవలసిందే. అందుకే అది ఊర్ధ్వగామి అయితే ఇది అధోగామియై దానిలో లీనమైనట్లు భాసించటం. ఇలా భావన చేసే కొద్దీ ఎన్నో

సుందరమైన కళా రహస్యాలు ముద్దుగా స్ఫురిస్తూపోతాయి ఇందులో. సత్య సౌందర్యాలకు రెండింటికీ మందిరమైన ఇలాంటి పద్యాలు లోకంలో మహాపురుషుల లాగా - సాహిత్య లోకంలో మనకెక్కడో గాని దర్శనమీయవు.

12 ఇంతకూ సాహిత్యరంగంలో సత్యమంటే ఏమిటో - సౌందర్య మంటే ఏమిటో తడవి చూచాము. రెంటికీ ఉండే ప్రగాఢమైన మైత్రిని కూడా పరిశీలించాము. ఈ మైత్రి ఎలాంటి దంటే ఒక ద్రవ్యానికీ దాని ఆకృతికీ ఉండే మైత్రిలాంటిది. బంగారం ద్రవ్య Substance మైతే కటక ముకుటకే యూరాద్యలంకారాలు దాని ఆకృతి. బంగారమెంత విలువగల దైనా వట్టి బంగారు ముద్ద ముద్దు గొలుపదు. దానినేదో ఒక ఆభరణ రూపంలో దర్శిస్తేనే అందం. అలాగే ఆకృతి ఎంత మనోజ్ఞమైనా అది బంగారంతో గాక ఏ కొయ్యతోనో నిర్మిస్తే హంగురాదు. దానికి విలువ ఏముందనే పేలవ భావమొకటి మన డెందాన్ని పీడిస్తుంటుంది. రెండూ రెండే. ఆకృతిలేని ద్రవ్యం అనాకర్షకం. మంచి ద్రవ్యం గాని ఆకృతి అనుత్కర్షకం. సువర్ణంలాంటి ఉజ్జ్వలమైన ద్రవ్యమూ కావాలి - సుందరమైన ఆభరణం లాంటి ఆకృతీ కావాలి. అప్పుడే అది సహృదయ హృదయ దేశాన్ని అలంకరించటాని కర్హమవుతుంది. సత్య సౌందర్యాలకు రెంటికీ మధ్య ఉండే అనుబంధ మిలాంటిది. రెంటికీ అవినాభావ సంబంధం.

13. ఇంత మాత్రంతోనే సమసిపోలేదు సాహిత్య సౌధ నిర్మాణం. వాటి రెంటికీ తోడు మూడవది మరొకటి ఉంది. దాని పేరే శివం. అవి రెండూ ఒకటి సామగ్రి - ఇంకొకటి దాని కట్టు బడి అయితే -

ఈ శివ మనే మూడవది వాటి రెంటికీ మించిన ఒకానొక అనిర్వచనీయమైన ఆత్మతత్త్వం. మనకు శరీరమూ - ప్రాణమే గాక తద్విలక్షణమైన ఆత్మ Self ఒకటి ఉందనే అంశం మరచిపోరాదు. అది దేహ ప్రాణాలను రెంటినీ ఆవరించి ఉంది. ఎంతగా ఆవరించి ఉందంటే అది వినా వీటి కస ల స్తిత్వమే లేదు. దాని కోసం పుట్టాయివి. దాని కోసమున్నాయి. చివరకు దాని లోనే లయమవుతాయి. అది వీటి కామూలాగ్రమూ నియామకం దాని చెప్పు చేతలలో నడచినప్పుడే ఇవి చరితార్థం. లేకుంటే వీటికి విలువలేదు. ఏమి కారణం. ఇవి కావ్యానికి స్వరూప Substance మైతే అది ప్రయోజనం. ప్రయోజనానురోధిగా స్వరూపం గాని స్వరూపానుసారిగా ప్రయోజనం కాదు. ఒక ప్రణాళిక వేసుకొని మన మిల్లు కడతామా. ఇల్లు కట్టి ప్రణాళిక వేసుకుంటామా. కాబట్టి కావ్య ప్రపంచ నిర్మాణ ప్రయత్నంలో ఏ వస్తువైనా ఏ సన్నివేశమైనా - ఎలాంటి రచన అయినా - తన్మూలంగా ఆ కవి ఆదించే ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని సాగాలే గాని మరో విధంగా సాగటానికి వీలు లేదు. ఇదుగో ఈ ప్రయోజనమే శివ మనే మాట కర్థం.

14. శివం - హితం - శ్రేయం - కల్యాణం - వీటన్నిటికీ ఒక్కటే అర్థం. శివేతరక్షతయే అన్నారు ఆలంకారికులు. శివేతర మంటే అ శివం. అ శివాన్ని శమింపజేసే దేదో అది శివేతరక్షతి. అది కావ్యానికి ప్రయోజనమట. పోతే విశ్వశ్రేయః కావ్య మని జగద్ధితమ్ కావ్యమని మహాకవులెంతగానో వర్ణిస్తూ వచ్చారు. ఆఖరుకు శాస్త్రజ్ఞులు కూడా శాస్త్ర స్వరూపాన్ని వర్ణిస్తూ మంగళాదీని -



Yalamanchili Srinivasa Rao www.advaitavedanta.in

మంగళ మధ్యాని - మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే' శాస్త్రాని కాదిలోనూ మధ్యలోనూ అంతంలోనూ మంగళాన్ని నిబంధించాలి. అప్పుడే ఆ శాస్త్రం రాణిస్తుందని చాటారు. మంగళమంటే శివానికి మారుపేరే. ఇది శాస్త్రాని కెలాగో కావ్యానికి కూడా అలా అపరిహార్యమే. కావ్యం ఆదిలో ఇంకా కథారంభం కాకముందు కవి చెప్పిన మాటలన్నీ శివకరంగానే ఉండాలి. మధ్యలో కథా సన్నివేశాలన్నీ తన్మయంగానే సాగాలి. చివరకు కావ్య రచన ముగిసే సందర్భమంతా శివాంతంగానే సమాప్తం కావాలి. అప్పుడే కావ్య నిర్మాణ మంతా ఎంత బహుముఖంగా నడిచినా అన్నింటికీ కలిపి ఏకవాక్యత అనేది సిద్ధిస్తుంది. అస లొకకవి కావ్యం రచించాడంటే ఎందుకు రచించినట్టు దాని వల్ల ఏమిటి ప్రయోజనం అని అడిగితే జవాబు చెప్పాలి గదా. 'ప్రయోజన మనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే' ప్రయోజనంలేని పని ఎంత మూఢుడు కూడా చేయ బోడు. అలాంటప్పుడింత పెద్దకార్య భారం పని లేక ఎట్టుకున్నాడా మహాకవి. దాని కేదో ఒక మహోద్దేశమే ఉండితీరాలి. అది శివం కాక మరేమిటి. తాను రచించే కావ్యం ద్వారా తనకూ తనచుట్టూ బ్రతికే లోకానికీ సర్వవిధాలా హితకారి అయి ఉండాలది. పురోగతికి తోడ్పడేదిగా ఉండాలి. అలా దోహదం చేయకపోతే మనకు లౌకిక మైన జీవనమే చాలు. సాహిత్యం వరకూ పోనక్కరలేదు. సాహిత్యమనేది ఈ సృష్టికి కవి బ్రహ్మ చేసే ప్రతి సృష్టి. సృష్టిలో మనకు కరవైన శాంతి సౌఖ్యాల కొఱత తీర్చటానికి ఈ ప్రతి సృష్టికి కవి పితామహులు పూనుకొన్నారు. అలాంటి శపథం చేసి సృష్టించిన ఈ కావ్యసృష్టిలో కూడా మనకా భావం అందని ప్రాని



Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

పంద్రైతే ఇక చెప్పేదేముంది. ఉభయభ్రష్టులం కాక తప్పదు. అంచేత సాహిత్యమనేది సార్వజనికమూ సార్వకాలికమూ కావాలంటే అది సర్వథా శివకరం అయితీర వలసిందే. కాకుంటే కళ కళ కోసమే అనే నిష్ప్రయోజన వాదానికది బలి పశువులాగా నిలిచిపోతుంది.

15. ఈ శివ మనేది మరలా రెండు విధాలు. ఒకటి నిర్వృతి. మరొకటి సంస్కృతి. ఇందులో నిర్వృతి అంటే ఒక అనిర్వచనీయమైన ఆహ్లాదమూ లేదా సంతృప్తి. కావ్యంలో ఒక ఘట్టాన్ని పట్టుకొని దానిలో దాగి ఉన్న భావాలనూ సౌందర్య రేఖలనూ పదే పదే భావన చేసే కొద్దీ రసజ్ఞుడైన వాడికలాంటి ఆహ్లాదం కలగక మానదు. ఇలాంటి అనుభూతి మన లాంటి పాఠకుల కందరికీ అపేక్షణీయమే కాబట్టి ఇది శివం క్రిందికే వస్తుంది సందేహం లేదు. అయితే ఆ శివ స్వరూపంలో పూర్వార్ధం మాత్రమే. పోతే ఉత్తరార్ధం మరొకటున్నది. అది సంస్కృతి అని మనవి చేశాను. కేవల మాహ్లాదమే గాక దానితో పాటు చదువరులకొక ఉత్తమమైన చిత్త సంస్కారాన్ని కూడా సమకూర్చాలి కావ్యమనేది. ఆనందానికి కరిగేదైతే చిత్తం సంస్కారంతో మెఱుగెక్కుతుంది. అప్పుడది దర్పణం లాగా పరిశుద్ధమై పరిపూర్ణమైన జీవిత చిత్రాన్ని ప్రతిబింబించేందుకు పాత్ర మవుతుంది. ఇదీ ఇందులో ఉన్న రహస్యం.

16. ఏవం విధ విశేషణ ద్వయ విశిష్టమైన సాహిత్య ప్రయోజనమైన ఈ శివతత్త్వాన్ని ఎలా సాధించాలి దానిని లోకానికెలా ప్రదర్శించాలని ఇప్పుడు ప్రశ్న. సాహిత్యో పనిషద్వేత్తలైన మహాకవులందరూ మహర్షుల లాగా గొప్పద్రష్టలు. అసలు ఋషికాకుంటే వాడు కవి శబ్ద వాచ్యుడే కాడు. ఋషిత్వమంటే

దర్శనమే Vision కదా. కనుకనే నానృషిః కురుతే కావ్యమనే నానుడి ఏర్పడింది లోకంలో. ఇలాంటి ఋషికల్పులైన మహాకవు లెప్పుడూ దర్శిస్తూనే ఉంటారా తత్త్వాన్ని. తాము దర్శించిన ఆ సత్యాన్నే మరలా తమ కావ్య నేపథ్యం మీద చిత్రించి ఈ లోకానికి ప్రదర్శిస్తుంటారు. ఈ ప్రదర్శన వ్యాపారం కూడా ఒకటి గాదు. బాగా పరిశీలించి చూస్తే ఇందులో నాలుగంతస్తులు గోచరిస్తాయి. అవి ఒక దాని కంటే ఒకటి ఉన్నతమూ ఊర్ధ్వాభి ముఖమూ. పట్టుకొని పోవాలే గాని సహృదయుణ్ణి అంతకంత కవి ఊర్ధ్వముఖం గానే సాగించుకొని పోతాయి. చిట్ట చివరకు జీవిత గౌరీ శిఖరం మీదనే తీసుకొని పోయి నిలుపుతాయి.

17. భూమికా చతుష్టయంలో మొట్టమొదటి భూమిక పేరు అభిరుచి Taste. అంతవరకూ కేవల మీ ప్రాపంచిక జీవనం తోనే తృప్తి పడే మానవుణ్ణి సాహిత్య ప్రపంచం వైపు మళ్ళించాలంటే దాని పైన మొదట వాని కొక అభిరుచిని కల్పించాలి. ఆహారం మానవుడికి కావలసిందే అయినా అది రుచిగా ఉంటేగాని భుజించలేము. తోటి మానవులతో మాటాడటం కూడ అని వార్యమే గాని ఆ సంభాషణ వినాలని బుద్ధి పుట్టించాలే గాని కంపతొడుగులాగా శుష్కంగా సాగితే వినలేము. ఏ వ్యవహారమైనా లోకంలో మన మనస్సుకు రుచిస్తే గాని అందులో మనం ప్రవేశించబోము. సరిగా ఈ లోక వ్యవహారం లాంటిదే సాహిత్య వ్యవహారం కూడా. సాహిత్యం కూడా అన్నింటి కన్నా ముందు సహృదయుడి కిలాంటి ఒక అభిరుచి నందజేయాలి. అది ఒక ప్రరోచన. దాని చేత ప్రలోభితుడైన మానవుడు సాహిత్య క్షేత్రంలో

తనపాటికి తానే ప్రవేశిస్తాడు. ఇదుగో ఇలాంటి ప్రరోచకమైన అభిరుచిని మనకు కల్పించడానికే మహాకవులందరూ ప్రయత్నించారు. అందు కోసమే నిత్యమూ మనం లోకంలో చూచే ప్రకృతి దృశ్యాలనే వన్నెచిన్నెలు పెట్టి ఎంతో మనోజ్ఞంగా మన కన్నులకు కట్టినట్టు వర్ణిస్తారు. మామూలుగా చెబితే ఎంతో చప్పగా ఉన్నవే మెఱుగులు దిద్దితే ఎంతో గొప్పగా కనిపిస్తాయి. మన మింతకు ముందు సాదాగా చూచి వదిలేసిందే ఇప్పుడెంతో గొప్ప హోదాను సంతరించుకొని సంతసం గొలుపుతుంది. ప్రాతదానికి రంగు పూసి సరిక్రొత్తగా ప్రదర్శించినట్టు ఒక సంబరం చూపు తుంది. చూడండి ఈ వర్ష వర్ణన ఎంత హర్షదాయక మో।

18. కరకా చిటపటరవ భీ
కరమై - పెళ పెళ నినాద ఘనమై - ఝుం ఝూ
మరుదుజ్ఝిత బిలమంద్ర
స్వరమై - యక్కొండ నొక్క వర్షము గురిసెన్

- ఇది అల్లసాని పెద్దన మనుచరిత్రలో వర్షపాతాన్ని వర్ణించే సన్నివేశంలో ఒక పద్యం. వర్షం కురవట మనేది అబ్బురమైన విషయం కాదు. ఎన్నో సార్లు మనం చూస్తూనే ఉన్నాము జీవితంలో. కాకుంటే పర్వత ప్రాంతాలలో పడే వర్షాన్నే అన్ని మార్లు మనం చూడక పోవచ్చు. అంత తరుచుగా కాకపోయినా అప్పుడప్పుడయినా చూడకపోలేదు. మరి దానిలో విశేష మేముందని. ఏ ముందో గాని ఈ పద్యాన్ని అడిగితే మాత్రం ఎంతో ఉన్నట్టు మనకు వినిపిస్తుంది. కొండ మీది వాన - అందులోనూ హఠాత్తుగా కురిసిన వాన. దాని కడ్డం ఆపు ఉండదు

కదా. వాన చినుకుల కన్నా ముందు బ్రహ్మాండమైన వడగండ్లు పడుతున్నాయి. అలా పడుతుంటే చిటపటమనే ధ్వనులు వినిపిస్తున్నాయి. చుట్టూరా విన వచ్చే ఆ ధ్వనులకు గుండె లదిరిపోతున్నాయి. దీనికి తోడు పెళ పెళ మనే నినాదాలతో పెద్ద పెద్ద చెట్లన్నీ విరిగి నేలకొఱుగుతున్నాయి. మరి ఝుంయి మని వీచే తుఫాను గాలి గుహా ద్వారాలలో నుంచి బయటికి వస్తుంటే గుంయి మని చెవులు బీటలు పాఱుతున్నాయట. ఒక ఎత్తైన కొండ, దాని మీద అంతకన్నా ఎత్తైన నల్లని మేఘాలు. వాటిలో నుంచి అనర్గళంగా కురిసే వడగండ్లు. దూరంగా విఱుచుకు పడే ఫలవృక్షాలు. అప్పుడప్పుడు గుహలలో నుంచి కనపడకుండా భయంకరంగా వీచే పిశాచిలాంటి తుఫాను గాలి – మూడు ప్రకృతి దృశ్యాలు మన కండ్ల ఎదుట నిలుపుతున్నాడు మహాకవి. అవి మనోయవనిక మీద చెదరకుండా నిలవాలంటే పలు విధములైన వర్ణాలలో వాటిని చిత్రించి చూపాలి. అలాగే చిత్రిస్తున్నాడు మహాకవి. కరకలకు చిటపటలు – చెట్లకు పెళపెళలు. ప్రభంజనానికి ఝుమఝుమలు, ఒకదానిని మించిన దొకటి. దేనికి దగిన వర్ణం దానికి. అందులోనూ మొదటిది రవం. రెండవది అది ముదిరిన నాదం. మూడవ దంత కన్నా తీవ్రమైన మంద్రస్వరం. మూడూ మూడు మలుపులు. మూడింటినీ సూచించటానికి పద్యం నడకలో మూడు విరుపులు. ఒకటి చిటపటలతో విరిగితే – మరొకటి పెళ పెళలతో విరిగితే వేరొకటి ఝుమఝుమలతో విరుగుతున్నది. అన్నీ జతగూడే సరికి తూకమెక్కువై ఆకొండ చరియలను నొక్కి వేస్తున్నాయి. అందుకే

కాబోలు 'అకొ్కండ నొక్క' అని గట్టిగా నొక్కి మాటాడుతున్నాడు పెద్దనకవి.

19. పెద్దన గారు చేసిన ఇంత చిన్న వర్ణన లోనే పాఠకుని చిత్తాని కెలాంటి అభిరుచి రేకెత్తుతున్నదో పరికించండి. దానితో ఇంకా కవి ఏమి చెబుతాడో ఎలా వర్ణించబోతాడో చూతామనే ఒక కుతుహలంతో పరవళ్ళు తొక్కుతుంది సహృదయుడి హృదయం. దానినింకా ఉఱ్ఱూత లూగిస్తున్నాడు తదనంతర పద్యంలో మహాకవి.

– తెల తెల వేఁగిన నగ్గిరి
జల జల ప్రవహించు సెలల చప్పుళ్ళు శిఖా
వలకులకల కేకాకల
కలములుగల తల పొలంబు కనుగొను వేడ్కఁ

రాత్రి అంతా వర్షం కురిసి తెల్ల వారగానే వెలిసి పోతుంది. వెలిసిన తరువాత ఆ తొలి సంజ వెలుగులో మెరిసిపోయే ఆ కొండ పరిసర దృశ్యాల్ని మన మనో నేత్రాలకు మరలా చిత్రీకరిస్తున్నాడు కవి –

– తెల తెల వేఁగిన దఁట రాత్రి. అది తెల తెల కాగానే జల జల మని క్రిందికి దూకే సెలయేళ్ళ చప్పుళ్ళు చెవిలో బడుతున్నవట. మరి ఆ సెలల ప్రక్క నిలబడి చక్కగా పురులు విప్పి నాట్యం చేస్తూ మధ్య మధ్య క్రేంకారాలు చేస్తున్న వట మయూరాలు. అలాంటి పొలాన్ని ఒక మారు తిలకించాలని ముచ్చట పడ్డాడు స్వరోచి. స్వరోచి పడ్డాడో లేదోగాని కావ్య సుధావీచులలో తేలియాడే రసజ్ఞసితరోచులు మాత్రం ఈ ప్రకృతి రామణీయక వర్ణనకలా పడక పోరు. సాహిత్య రంగంలోని అభిరుచి అంటే అలాంటిది.

Yalamanchili Srinivasa Rao www.advaitavedanta.in

20. పోతే ఇంతకన్నా పయినున్న రెండవ భూమిక అభినివేశం Engrossment. బాహ్యమైనది అభిరుచి అయితే ఆభ్యంతరమైన దభినివేశం. బాహ్య ప్రకృతి కంటే అంతః ప్రకృతి మానవుడి కింకా సన్నిహితం కదా. అది జీవితాని కుద్దీపకమైతే ఇది కేవల మతని జీవితమే. జీవిత మంటే అది శారీరకమూ కావచ్చు - వాచికమూ కావచ్చు - మానసికమూ కావచ్చు. మూడింటి సమాహారమే జీవిత మంటే. అందులో శారీరకమైతే అవి చేష్టలు. వాచికమైతే మాటలు సంభాషణలు - మరి మానసమైతే భావాలు - ఆలోచనలు - ఆవేశాలు - అనుభూతులు - ఇలా ఎన్నో. వీటినే అలంకారికులు అనుభావాలనీ - సంచారి భావాలనీ సాత్వికభావాలనీ పేర్లు పెట్టి వ్యవహరించారు. వీటి కాలంబనం విభావం. అది మానవుడే. వాడికి వెలపల ఉన్న ప్రకృతీ ఒక విభావమే. దాని కుద్దీపన మని పేరు. మొత్తానికీ ఉద్దీపనం మూలంగానైతేనేమి, సహజంగా నైతేనేమి. మానవుడికి ఏర్పడే ఈ అనుభవాదులున్నాయే అవే అసలు మానవతత్త్వం. మిగతాదంతా దానికి బాహిరమే. అంచేత బాహిరమైన దృశ్యాలను వర్ణించిన దానికంటే ఈ అంతస్తత్త్వాన్ని వర్ణించినప్పుడే సహృదయుడి మనస్సు ఎక్కువగా స్పందిస్తుంది - దీపిస్తుంది - ద్రవిస్తుంది - తాదాత్మ్యం చెందుతుంది. ఎందుకంటే అది మనదైతే ఇది కేవలం మనమే. అందుకే దీని నభినివేశ మన్నారు. బాగా లోపలికి దిగటమని అర్థం. జీవితంలోకి దిగిపోయి అందలి మాధుర్యాన్ని చవిచూచే అనుభూతి ఇందులోనే మనకెక్కువగా లభిస్తుంది.

21. "అరుణ గభస్తి బింబ ముదయాద్రి పయింబొడ తేర - గిన్నెలో - పెరుగును వంటకంబు వడపిందెలు నుంగుడు వంగబెట్టు నిర్భర కరుణా ధురీణయగు ప్రాణము ప్రాణము తల్లి యున్నదే - హరహర! ఎవ్వరింక కడుపారసి పెట్టెద - రీప్సితాన్న ముల్" ఇది కాశీ ఖండంలో శ్రీనాథుడు వ్రాసిన పద్యం. గుణనిధి ఉపాఖ్యానం లోనిది. వాడు తండ్రి మాట వినక బాల్యం నుంచీ ఆటకూటాయిగా తిరిగిన బాపతు. తల్లి గారాబం జాస్తి వాడికి. చివరకు తల్లిదండ్రులకు దూరమై బ్రతుకు బండలు చేసుకొని తిన తిండి లేక అలమటిస్తూ ఒకనాడు ఒంటరిగా తనలో తానిలా వాపోతున్నాడు. "తండ్రి ఎంతకోపగాడైనా - ఆయన చెవికి రాకుండా తన తప్పులన్నీ కప్పి పుచ్చి కంటికి రెప్పలాగ కాపాడింది నా తల్లి. ప్రతిరోజు తెల్లవారగానే పిల్ల వాడెంత ఆకలిగా ఉన్నాడోనని వెండి గిన్నెలో పెరుగన్నం కలిపి తెచ్చినాకు పసివాడికి వలె తినిపించేది. అలాంటి దయామయి తల్లి ఇప్పుడేది. ఇక నా కడుపు చూచి తిండి పెట్టు దిక్కెవ్వరు. చూడండి. వాడెంత సోమరి అయినా పశ్చాత్తాపంతో వాడనే ఈ మాటలు లోపలపడే వాడి ఆవేదన నెంతగా బయటపెడు తున్నాయో - దానిని వింటుంటే మన హృదయానికి కూడా ఎలాంటి ఆవేదన కలుగుతున్నదో. ఒక ఆవేదనే కాదు - దాని వెనకాల దాగి ఉన్న ఒక తల్లి కొడుకుల అనుబంధమూ - దైవికంగా దానికి దూరమైతే దాని కోసం పడే ఆరాటమూ - ఒక మానవుడు తాను చేసిన పొరపాటుకు చెందే అనుతాపమూ - మాతృదేవత ప్రతి ఫలం కోరని పుత్రవాత్సల్యం లోని విలువా - ఎన్నో భావాలు కన్నుల ఎదుట సాక్షాత్కరిస్తాయి. మనలను తన్మయత్వంలో ముంచి వేస్తాయి.

Yellamraju Srinivasa Rao
www.advaitaveda.in

22. మరొక సందర్భంలో మరొక మహాకవి వ్రాసిన పద్యం తిలకించండి.

" వాసో నిగ్రహ మెన్న రాఁకలియు నీర్వట్టుం దలంపర్తలల్
మాసెంగా యన-రంగముల్ బడలినం బాటింప - రట్లుండనీ -
ఆ సాయంబును నా నిశాత్యయముగా - నామ్నాయముల్ గ్రోల్చుచో
- నా సీన ప్రచలాయితం బయిన లే - దాహావితర్కింపఁగ≡" -

ఇవి అగస్త్య మహర్షి మాటలు. ఎవరితోనో అన్నవి గావు. తనలో తాను అనుకున్న మాటలివి. ఎవరిని గూర్చి. తన శిష్యులైన అయుత నియుతులను గూర్చి. వారు తన శిష్యులైనా అలాంటి ఇలాంటి శిష్యులు గారు. అంత శ్రద్ధా భక్తులతో చదువుకొన్న విద్యార్థులే ఎక్కడా కానరారు. మనకు గాదు. అగస్త్యునిలాంటి తీక్ష్ణ స్వభావుడికే ఆశ్చర్యం కొలిపింది వారి విద్యాభ్యాస దీక్ష. పండగనాడు కూడా కొత్తగుడ్డలు కుట్టించలేదని పేచీ పెట్ట లేదా కుఱ్ఱవాళ్ళు. ఆకలి దప్పులని కూడా అనుకోలేదు. తలకాయలు మాశాయి సీకాయ లేదా అని అడగలేదు - తుదకు శరీరాలు ఓర్చుకున్నా సొటసొటలు పోలేదు. మరి పగలు రాత్రి అని లేకుండా గురువు గారు వేదమంత్రాలు బోధిస్తుంటే కాదనకుండా వల్లిస్తూనే ఉన్నారు. అలా వల్లించేటపు డల్పాచమన మని అయినా చెప్పి బయటికి వెళ్ళి వచ్చే బాపతు కాదట. ఏమిటీ వర్ణన. విద్యార్జన చేయటాని కెంత దీక్ష ఉండాలో - గురుభక్తి ఎంతగా పాటించాలో - అలాంటి వారి పట్ల సద్గురువులైన వారికెలాంటి వాత్సల్యమో - తల్లి బిడ్డలను మరిపించే వారి పరస్పర స్నేహానుబంధ మెలాంటిదో - ఎన్ని భావాలో ఈ పద్యం చదివితే మన మనసులను గిలిగింతలు పెడతాయి.

23. ఈ రీతిగా మానవుడి అంతః ప్రకృతిని చిత్రీకరించడంలో ఎన్నో రేఖా చిత్రాలను గీయటమే గాక ప్రౌఢులైన మహాకవు లప్పుడప్పుడు బాహ్య ప్రకృతిని వర్ణించడంలోకూడా వాటిని మధురాతి మధురంగా ధ్వనింపజేస్తారు. అది రెండింటి శోభనూ పుడికి పుచ్చుకొని ద్విగుణీకృతంగా వెలిగిపోతుంది. అచేతన వర్ణనలో చేతన వ్యవహార మని అలంకారికులు వక్కాణించిన కావ్య మర్మ మిదే.

" కలయ జగమునఁగల యట్టి నలుపు లెల్ల
తెలుపులుగఁజేసి నీడలు తెలుపు సేయ
గా - వశముగామిఁ బొడము దుఃఖమునఁబోలె
సాంద్రచంద్రిక తుహిన బాష్పములు గురిసె "-

పున్నమి వెన్నెలను వర్ణిస్తున్నాడు కవి. పిండి ఆరబోసినట్టు పండు వెన్నెల నలుదిక్కులా నిండికాస్తున్నది. ఆ తెలుపులో ఎక్కడగానీ నలుపనే వార్త కూడా లేకుండా పోయింది. ఎంత దూరం ప్రసరిస్తే అంత మేర అది నలుపు లన్నింటినీ తెలుపుగా మార్చగలిగింది. కాని ఒక్క నలుపును మాత్రమది అలా మార్చలేక పోతున్నది. అవే అక్కడక్కడ చెట్లలో చేమలలో కనిపించే నీడలు. ఎంతశ్రమపడినా వాటిని మాత్ర మది తెలుపు చేయ సాధ్యం కాలేదు. అందుకు తీవ్రమైన పరితాపం చెందిన ఆకౌముది కనుల నుండి అప్రయత్నంగా దుఃఖాశ్రుకణాలు జాలువారాయి. అందుకు నిదర్శనం ఇక్కడా అక్కడా చిందిపడిన మంచుబిందువులేనని మనకు నచ్చజెపుతాడు మహాకవి. నిజంగా వెన్నెల కలాంటి నిర్వేదం కలిగిందా. సృష్టిలోఅది ఒక అచేతనమైన పదార్థం. దానికీ నలుపులన్నీ తెలుపు చేయాలనే తలపూ లేదు. చేయలేక పోయాననే

పరితాపమూ లేదు. తన్ని మిత్తంగా దుఃఖబాష్పాలు స్రవించిందీ లేదు. నేత్రాలుంటే గదా బాష్పాలు స్రవించటానికి. అయితే ఏమిటి దంతా. ఇదంతా కవి కల్పించిన మహేంద్ర జాలం. కవి ప్రౌఢోక్తి సిద్ధమని ప్రాచీనులు చాటించిన మాట కిదే అర్థం. చేతనో చితమైన వ్యవహార మ చేతన ప్రకృతి కారోపించి ఒక భావాన్ని వర్ణిస్తున్నాడు. ఆ వర్ణన మూలంగా మన కది ఒక అచేతన మనే భావం తాత్కాలికంగా మనసుకు రాదు. చేతనులైన మనబోటి మానవుల చరిత్రే తలపున బాఱుతుంది. వారి అనుభూతితో మనకు సానుభూతి ఏర్పడుతుంది.

24. చూడండి. ప్రస్తుత పద్యంలో కవి వెన్నెలనే వర్ణిస్తున్నా అర్థాన్ని కొంచెం భావన చేస్తే మనకందులో మను చరిత్ర లోని ఒక పాత్ర వృత్తాంతమే కన్నులకు కడుతుంది. ఆ పాత్ర ఎవరో గాదు. వరూధిని. ప్రవరుడు వరూధినిని నిరాకరించి పోయిన తరువాత ఆమె దీనస్థితిని ఎంతగానో వర్ణించాడు కవి. ఇంతలో చంద్రోదయ మయింది. చంద్రికలు నలుదెసలా జాలువారాయి. అందులో కూడా కవికి వరూధిని దైన్యమే దర్శన మిచ్చింది. దానినే తాను వ్యంగ్యంగా మాటలతో చిత్రించి ఆ చిత్రాన్ని మనకూ ప్రదర్శిస్తున్నాడు. ఎలాగా అని అడగవచ్చు. వెన్నెల వరూధినే. వెన్నెల లాగా అచ్చమైన మచ్చలేని ప్రకృతి ఆవిడది. ఎందరో సురగరుడోరగ గంధర్వాది కుమారులను కూడా అంతవరకూ కన్నెత్తి చూడలేదా అచ్చరకన్నె. అలాంటిదే దైవశక్తి చేతనో చూచీ చూడటంతోనే ఆ విప్రవరుణ్ణి వరించింది. కోరిక తెలిపింది. బ్రతిమాలింది భంగపోయింది. చివరకు బలవంతం కూడా చేసింది. అయినా ఆ కఠినహృదయుడి

మనసు కరగలేదు. ఆవిడ మనోరథాన్ని మన్నించలేదు. దానితో భగ్న మనోరథ అయి ఆవిడ కన్నీరు మున్నీరుగా విలపించసాగింది. ఈ విలాపమే కౌముదీ వృత్తాంతంలో కూడా కనిపించిందా కవికి. నలుపు తెలుపు చేయటం - గంధర్వాదులందరినీ ఆకర్షించగలగటం. నీడ మాత్రం తెలుపు చేయలేక పోవడం ప్రవరాఖ్యుణ్ణి ఆవర్జించ లేకపోవటం. తన్మూలంగా తుహిన బాష్పాలు రాల్చటం వరూథిని శోకంతో కన్నీరు కార్చటమే. ఈ విధంగా కావ్యనాయికా వృత్తాంతమే కౌముదీ వర్ణనా ప దేశంతో కవి చేశాడు అని భావుకుడి కనిపిస్తుంది.

25. అంతేకాదు. కావ్య పరంగానేకాక లోకపరంగా కూడా ఈ పద్య భావాన్ని మన మన్వయించుకోవచ్చు. లోకంలో ఒకానొక మహాత్ముడుంటాడు. వెన్నెలలాగా సౌమ్యమైన ఉదాత్తమైన స్వభావ మాయనది. తన చుట్టూ జరిగే దారుణాలను చూచి సహించలేక ఆయన తనతోడి మానవుల తామస స్వభావాన్ని సాత్త్వికంగా మార్చటాని కెన్నో విధాల బోధ చేస్తాడు. ఎంతగానో సంస్కరించాలని ప్రయత్నిస్తాడు. కాని కొందరే ఆయన సందేశాన్ని అందుకొని బాగుపడతారు. మిగతా ప్రజానీకమంతా ఎప్పటిలాగే పరమనీచంగా ప్రవర్తిస్తుంటారు. అయ్యోవీరిని మాత్రం నేనేమీ మార్చలేకపోయానే అని ఆ సాధువు హృదయ మెంతగానో బాధపడుతుంది. దానితో అప్రయత్నంగా ఆయనకనుల నుంచి బాష్పకణాలు రాలినా ఆశ్చర్యం లేదు. ఆయన ఒక బుద్ధుడే అనుకోండి. ఇలాంటి మహనీయుని జీవిత వృత్తాంతం కూడా తొంగిచూస్తున్నదీ వర్ణనలో.

26. ఇలా చెబుతూ పోతే ఎంతైనా చెప్పవచ్చు ఈ అభినివేశాన్ని గూర్చి. మానవ సహజమైన భావాలన్నీ అభినివేశ దాయకములే. అలంకారికులు చిత్తవృత్తులని ఉదాహరించిన వివే. అవి ముప్పదిమూడనివారు నిరూపించారేగాని అవి అంతమాత్రమే అనుకోరాదు. 33 అనే సంఖ్యను వారు కేవలమూ For Example ఉపలక్షణంగా భావించి ఉంటారు. ఎలాగైతే నివిదలలో దేవతల సంఖ్య ముప్పదిమూడని పేర్కొన్నా ప్రాకామ్య సిద్ధిబలం చేత 33 కోట్లు రూపా లెత్తగలరో అలాగే ఈ భావాలు 33 అయినా ఆవాపోద్వాపాలను బట్టి 33 కోట్లు కావచ్చు. ఒక్క మాటలో చెబితే అనంతములూ విచిత్రములూ. సూక్ష్మాతి సూక్ష్మములైన ఆ దారులన్నీ తిరిగి చూడాలే గాని మాటలతో వర్ణించేవి గావు. మహాకవులంతా అలా యధేచ్ఛగా సంచరించిన వారే. రవి గాంచనిచో కవి గాంచునే గదా. మామూలు వాడూహించని అందాలెన్నో చిందుతుంటాయి వారి వర్ణనలలో. చూడండి. మహాభారతంలో ధర్మరాజంటే మనకండ్ల కెంతో సాత్త్వికుడుగా సౌమ్యుడుగా కనిపిస్తుంటాడు. అదే భీముడనే పేరు వింటూనే అలా కనిపించదు. పెద్దపెద్ద మీసాలు మిడిగ్రుడ్లు పెట్టుకొని గదాదండ మొకటి చేత పట్టుకొని భీకరంగా వచ్చి కండ్ల ముందు నిలుచుంటాడు. మరి అలాంటి పాత్రల స్వరూపాన్ని ఆయాసందర్భాల కనుగుణంగా మార్పిడి చేసి మహాకవులు వర్ణిస్తుంటే అతడేనా ఇతడని మనకాశ్చర్యం వేస్తుంది.

" గాండీవ జ్యారవంబు ............... మూర్ఛిల్లకుండ≡

ఇది తిక్కన ఉద్యోగ పర్వం లోని పద్యం. సంజయుడు రాయబారం వచ్చి మొదట తమ్ములను పొగడి తరువాత వెంటనే కౌరవు యోధులను పొగుడుతూ వ్యంగ్యంగా తమరిని బెదిరించే మాటలు మాటాడినపుడా మాటలలోని బెదిరింపును గమనించి మండిపోయిన ధర్మజుని మాటలివి. పైకి సాత్త్వికుడుగా కనపడుతున్నా లోలోపల దాగి ఉన్న ధర్మరాజు భయంకర స్వభావాన్ని ఎలా బయటపెడుతున్నదో చూడండి ఈ పద్యం. అలాగే – " ఏమీ పార్థుడు నీవు ....... పెంపఱుౘ " అనే ఈ పద్యం చూడండి. ఇది శ్రీ కృష్ణుడు రాయబారం చేయబోతూ భీముడిని ఏమి చెబుతావని అడిగి – అతడు సంధికే ప్రయత్నించమని చెబితే – ఇదేమిటి చచ్చు మాటలివి భీమసేనుడి మాటలేనా అని బావగారు తనతో చదురు లాడితే ఆ సారస్యాన్ని గ్రహించి తానూతూకం గానే జవాబిచ్చిన భీముడి మాటలివి. మీరంతా నడుంకట్టి రంగంలో దిగి ఘనవిజయం సాధిస్తుంటే మేము కాదన్నా మా. పెద్దమిట్టెక్కి ఒక ఉత్సవాన్ని చూచినట్టు చూచి పొంగిపోమా. ఇలా పనిలేక పోతే మాకూ మంచిదే గదా. ఇలాంటి కవ్వింపు మాటలకు కదిలిపోయే వాడు కాదు భీముడంటాడు. చూడండి ఆ పద్యం చదివేటపుడు ధర్యరాజు మూర్తిని దర్శించటానికే భయపడతాము. మరి ఎప్పుడూ భయపడే భీముడి స్వరూప మీ పద్యం చదివినంతసేపూ మనకెంతో సౌమ్యంగా దర్శనమిస్తుంది. ఇలా సందర్భోచితంగా స్వభావ వినిమయం చేసి వర్ణించినా ఎంతో అద్భుతంగా వర్ణిస్తారు మహాకవులు. దానిలో మానవుల స్వభావంలోని లోతులు తడమిచూచేకొద్దీ ఎంత వైచిత్రి ఉందా అనే ఆశ్చర్యమూ అంతకంత కభి నివేశమూ ఎక్కువవుతుంది సహృదయుడికి.

27. మనమింత వరకూ బాహ్యామైన ప్రకృతి సరిహద్దులను దాటి మానవుడి ఆభ్యంతర ప్రపంచంలో ప్రవేశించాము. ప్రస్తుత మంతకన్నా అతీతమైన మరొక ప్రపంచంలో అడుగిడ బోతున్నాము. అదే అభ్యుదయ Elevation మనే మూడవ క్షేత్రం. ఈ క్షేత్రంలో ప్రవేశించేసరికి వెనుక మనంచూచిన భావాలన్నీ మారిపోతాయి. మారిపోయి సరిక్రొత్త రూపాలతో దర్శనమిస్తాయి. అన్ని భావాలకూ ఇది స్థాయి రూపం. అంతకు ముందు వాటి ఉల్బణరూపమే దర్శించాము. ఉల్బణత్వమనండి ఆవేశ మనండి. అది ఎంత అనుభూతి నిచ్చినా కేవలం తాత్కాలికమే. తగ్గు తరగతిదే. ఇక్కడ అలా కాదు. తాత్కాలికమైన ఆ పొంగులన్నీ స్తిమితపడి ఒక ప్ర[illegible]ంత, గంభీరమైన ఆ కృతిని ధరిస్తాయి. దీనికే ధర్మమని నామధేయం. ధర్మమంటే ధరించేది. అంటి పట్టుకొనేదని అర్థం. ఒక భావం మన మనసు నంటి పట్టుకొంటే అది ధర్మమవుతుంది. తాత్కాలికమైన కోపతాపాలలా అంటి పట్టుకోవు. స్తిమితమైన దశలోనే అలా పట్టుకొంటుంది. అలా పట్టుకొన్న భావమే మనలను ప్రగతి పథంలో నడుపుతూ పోగలదు. కాబట్టి నీతి అని కూడా దాని కొక నామాంతర మేర్పడింది ఇలాంటి ధార్మికమైన నైతికమైన స్థితినే అభ్యుదయ మన్నారు పెద్దలు. ఇలాంటి అనుభూతిని మనకు ప్రసాదించే కవితకు కూడా ఎన్నో ఉదాహరణలు దొరుకుతాయి మనకు మహాకవుల రచనలలో

'గృహ సమ్మార్జన మో............... నీ లీలకుం బాత్రముల్'

ఇది విష్ణు చిత్తుడు స్వామి వారితో మనవి చేసిన ఘట్టం. విష్ణు చిత్తుడనే పేరే చెబుతుంది ఆయన ఎంతటి మహాభక్తుడో. అందుకే

ఆయనను పెరియాళ్వారని పేర్కొన్నారు సంప్రదాయజ్ఞులు. మన్న నారు సేవకే అంకితమైన జీవిత మా మహనీయునిది. విద్యా గంధం లేకపోయినా భగవద్భక్తి సుగంధం ఎంతగానైనా గుబాళిస్తూ ఉన్న మహా భాగవతుడు విష్ణు చిత్తుడంటే. అలాంటి వాడికి మన్ననారు అనుగ్రహంతో పాండ్యరాజు కొలువులో ఉన్న విద్వాంసులను వాదంలో గెలవట మొక బరువైన పనికాదు. అయినా నాపయి అంతబరువు మోపవద్దు. నేనోపనంటాడా అమాయిక బ్రాహ్మణుడు. ఎప్పుడూ నేను చేయగల పనులే నాకొప్పజెప్పు. అవి తాము చెప్పి నా చెప్పకున్నా నేను ఉత్సాహంతో చేయగలనంతే గాని నాకీ వాదాలూ - విజయాలూ దేనికి. కావాలంటే మరి ఎవరైనా మేధావంతులుంటే వారికప్పగించు స్వామీ నేను అపఠిత శాస్త్ర గ్రంధుణ్ణి జనుషాంధుణ్ణని మనవి చేసుకుంటాడు మన్ననారుకు. చూడండి ఈ మాటలలో ఎంత వినయం - ఎంత సేవా బుద్ధి - ఎంత నిష్కల్మషతా ఎంత నిరాడంబరతా కొట్టవచ్చినట్టు కనిపిస్తుందో. ఒక మానవుడిలో ఉండే ఇలాంటి ఉదాత్త భావాలను వింటున్నప్పుడు మనం కూడా ఇలాంటి ఉత్తమ భావాలనే అలవరుచుకొని జీవిత మార్గాన్ని శుభ్రం చేసుకోవాలనే అభిప్రాయం ఏర్పడటాని కెంతైనా అవకాశముంది.

28. ఇలాంటిదే మరొక ఉదాహరణ చూడండి.

"నిరయంబైన నిబంధమైన ......ధీవర్య వేయేటికిన్"

ఇవి బలి చక్రవర్తి శుక్రుడితో అన్న మాటలు. వచ్చినవాడు ఎవడోగాదు. సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు. యాచన అనే నెపంతో నీ సర్వస్వమూ అపహరిస్తాడు. కాబట్టి ఈ దానం చేయవద్దు

మానుకో మని హెచ్చరించాడు ఆ చార్యుడు. అయినా దానికే మాత్రమూ వెనుకకు తగ్గలేదు దానవ చక్రవర్తి. ఏమైనా ఆపదరానీ. అది నరకమే గానీ స్వర్గమే గానీ – వచ్చి అడిగినవారు హరియే గానీ హరుడే గానీ – ఒక మారు ఇస్తానని మాట ఇచ్చిన తరువాత ప్రాణం పోయినా నేనిక మాట తప్పనంటాడా మహాదాత. ఏమి దాతృత్వమేమి ధైర్యమిది. ఒక దానవుడిలోనే ఇంత దాతృత్వమింత, ధైర్య మింత, స్వార్ధ త్యాగ మింత ప్రతిజ్ఞాపాలన ముందంటే మానవులుగా జన్మించిన మనలో అవి లేనందు కెంత సిగ్గు పడాలి. వెంటనే అవి అలవరుచుకొని ఇప్పటికైనా బాగుపడండని మహాకవి చేసే ప్రబోధమేగా మనకిది.

" తండ్రులు మీరు మీకు ..... చిక్కక యుండంగావుడీ" శ్రీ కృష్ణుడు తపశ్చర్యకయి బదరికాశ్రమం వెళ్ళుతున్నాడు. తన పరోక్షంలో ద్వారకా పట్టణాని కేమి ముప్పు వాటిల్లుతుందో నని ఆయన భయం. ముఖ్యంగా పౌండ్రకుడని ఒకడున్నాడు. వాడెప్పుడెప్పుడు దూకుదామా అని చూస్తున్నాడు. కృష్ణుడు లేడని తెలిస్తే వాడికిక లగ్గల కెక్కినట్టే. అంచేత బలరామాదు లందరికీ ముందుగా చెప్పవలసిన జాగ్రత్తలన్నీ చెప్పి కడసారిగా గురువు గారైన ఉద్ధవాచార్యులను సమీపించి వారితో ఇలా విన్నపం చేస్తున్నాడు. మీరు మాకు తండ్రితో సమానులు. మీకు మేము చెప్పటానికి మేమెంత వాళ్ళం. ఒక వేళ చెప్పినా లోకులు బ్రువ్వదిట్టరా. బృహస్పతి అంతవాడు మీకు సరిపోలడు. కాబట్టి మీకు నీతులు బోధించటమేమిటి హాస్యాస్పదం. అయితే ఒక్కమాట. నేనులేనని తెలిస్తే ఆ పౌండ్రక వాసుదేవు డెత్తి రావచ్చు. వాడి దాడికి మనవాళ్ళు

గావించిన ఈ పరస్పర సంభావనకు మురిసిపోయిన ఆ దంపతులు చిరునవ్వుతో ఒకరి వైపొకరు చూచారంటాడు కవి. అందులోని చాతుర్యానికి మెచ్చారట. సత్య మెచ్చుట మలా ఉంచి కృష్ణుడు మెచ్చా డనటంలో ఒక ధ్వని ఉంది. గరుడుడి వ్యవహారం చూస్తుంటే తన అన్న గారు బలరాముడి విషయంలో తాను పాటించే వ్యవహార మాయన మనసుకు వచ్చి ఉంటుంది. సందేహం లేదు. అంతేకాదు. తరువాత కొద్దిసేపటిలో తాను అమరావతి చేరబోతున్నాడు. అక్కడ ఒక అన్న ఉన్నాడు తనకు దేవేంద్రుడు. తాను ఉపేంద్రుడు మాత్రమే. కనుక ఆ అన్న గారి పట్లతాను చూపవలసిన మర్యాద కూడా ముందుగా అయన మనసుకు తోచవచ్చు. ఇలా ఎన్నో లోతైన భావాలు కూడా ధ్వనిస్తున్నా యిందులో. చూడండి గరుత్మ దనూరుల సోదర మైత్రి నభినందిస్తూ నంది తిమ్మన వర్ణించిన ఈ వర్ణనలో అన్నదమ్ముల అన్యోన్యత అంటే ఎలా ఉండాలో మనబోటి లోకులకెలా ఒక గొప్ప ధార్మిక సందేశ మందజేస్తున్నాడో. ఇలా దర్శిస్తూ పోతే ఎంతైనా విశాలంగా గోచరిస్తుందీ అభ్యుదయ రంగం. పర్వత శిఖరాల లాగా అక్కడక్కడ మన కవి నేత్ర పర్వంగా సాక్షాత్కరిస్తాయి కళాదీక్షితులైన మహాకవుల మాటలలో.

30. పోతే ఈ అభ్యుదయ భూమికను కూడా దాటిపోయిన మరొక భూమిక ఉంది. అది తృతీయమైతే ఇది తురీయం. వేదాంతంలో తురీయావస్థలాంటి దిది. తురీయమక్కడ ఆఖరి దయినట్టే ఇక్కడా ఇది ఆఖరిదే. ఆఖరిదై అది మొదటి మూడు దశాలనూ వ్యాపించి ఉన్నట్టే ఇదీ మూడింటినీ వ్యాపించి ఉంది. కనుకనే దీని కభివ్యాపకమనే అన్వర్థ సంజ్ఞ ఏర్పడింది. అభిరుచి మొదలుకొని

సాగింది మన ప్రయాణం. అందులో మొదటి మజిలీ మనకు బాహ్య సౌందర్యమే చూపుతూ పోయింది. రెండవది బాహ్యం నుంచి మనలను క్రమంగా మానవుడి ఆంతర్యమైన భావ ప్రపంచంలోకి తీసుకొని పోయింది. అందులో పారవశ్యం చెంది పడిపోకుండా అంతకన్నా ఉన్నతమైన నైతిక శిఖరాన్ని చేర్చింది అభ్యుదయ మనే మూడవమజిలీ ప్రస్తుత మీ నాలుగవదా శిఖరాంచలాల మీదినుంచి ఇంకాపైకి లేపి సకల దిశావ్యాపకమైన అనంతాకాశంలోకి చేర్చి అక్కడ మనహృదయాని కొక అచ్యుతమైన స్థానాన్ని సమకూర్చు తున్నది. మొదటి మూడింటిలో మనం వరుసగా సాధించిన కుతూహలం - ఆవేగం - శమం - అనే అనుభూతులిక్కడ రాశీ భూతమైన ఒకొనొక విశ్వ జనీనమైన మహావిభూతిగా దర్శన మిస్తుంది. ధార్మిక స్థాయిని కూడా అతి క్రమించిన తాత్త్విక స్థాయి ఇది. ఇక్కడే కవి నిజమైన క్రాంత దర్శి అనిపించుకొనేది. ధార్మిక స్థాయిలోనే అలాంటి దర్శనం కొంత సమకూడుతుంది. అది ఇక్కడ అడుగుపెట్టే సరికి పరిపూర్ణ మవుతుంది. దేశ కాలాద్యవధులను దాటి చూచే కౌశలమే క్రాంత దర్శనం. దానితోనే కవి ఋషి కల్పుడవుతాడు. ఋషిత్వమంటే ఈ దర్శనమే. ఉదాత్త గంభీరమైన ఈ దృష్టికి సృష్టి రహస్యాలన్నీ కనుల ముందు పరిచినట్టు ప్రకాశిస్తాయి. భాసిస్తాయి. కనుకనే ఆలంకారికులు దీనిని శక్తి అని ప్రతిభ అని కూడా పేర్కొంటారు. ఈ క్రింది వర్ణన ఆకర్ణించండి ఎంత ఆశ్చర్యధుర్యమో.

‘ రవి బింబంబు పమింప ........ నిండుచో

వామనుడు పెరిగి త్రివిక్రముడవుతూ పోయే దృశ్యమిది. ఆయన మూర్తి ఇంతై అంతై ఎంతయిందో చెప్పవలసి వచ్చింది. ఏమని చెప్పాలి. ఎలా చెప్పాలి. ఎలా చెబితే మనస్సు కద్భుతమైన ఆ విగ్రహం సాక్షాత్కరిస్తుందో అలా చెప్పాలంటే సామాన్యం కాదు. అయినా మహాకవి దాని నెంత అనన్యాదృశంగా తనమాటల రంగులతో చిత్రించి చూపుతున్నాడో చూడండి. స్వామి వారు అంతంతకు పెరిగి పోతుంటే సూర్య మండలం ఆయనకు ఛత్రం గానూ శిరోరత్నంగానూ కంకణం గానూ కనిపిస్తూ చివరకు కాలికి పెట్టిన అందెగామారి ఆ తరువాత దానికి కూడా నోచుకో లేదంటాడు కవి. అంత మండలాన్ని ఛేదించుకొని ఆ దివ్యమంగళ విగ్రహం పైకి పోయేకొద్దీ మండలం దాని కన్నా క్రిందికి జారుతూ ఉంది. అప్పటికా విగ్రహమెంత పెరిగిందో దాని రూపరేఖలే పాటివో అంచనా వేస్తూపోతే భావుకుడి మనసు కెంత బ్రహ్మాను భూతి కలుగుతుందో తిలకించండి.

31. ఇలాంటిదే ఎఱ్ఱాప్రెగడ నృసింహ పురాణంలో ఒక పద్యముంది. అదీ ఇంత హృద్యమైన పద్యమే.

‘ భవ దురునాభి ........ శక్యమే’

వరగర్వితుడైన హిరణ్యకశిపుడి బాధలు పడలేక విష్ణువుతో మొర పెట్టుకోవటానికి దేవతలంతా పాలకడలికి బయలుదేరిపోయారు. అక్కడ శ్రీ మహా విష్ణువును దర్శించి ఆయన నిలా స్తోత్రం చేయసాగారు. మహానుభావా నీనాభి రంధ్రం నుంచి ఒక కమలం- ఆ కమలంలోని అనేక పరాగకణాలలో ఒక కణం - పాకానికి వస్తే దానిలో నుంచి ఒక బ్రహ్మ - ఆ బ్రహ్మ మనసులోని అనేక

సంకల్పాలలో ఒకటి సృష్టి కు న్ముఖమైతే దానిలో నుంచి స్థావర జంగమాత్మకమైన ఈ సృష్టి - దీనిలో కోటాన కోట్ల భూతజాలముంటే అందులో ఒక దేవయోనులూ - వారిలోనూ మాలాంటి ఒక - వ్యక్తి నీ మహిమ కొని యాడాలంటే ఎంతనగు బాటు పంచాంగమిది. అయినా స్తోత్రం చేస్తున్నామంటే ఇది మా ప్రజ్ఞగాదు మీ ప్రభావమేనని పలుకుతారు. ఎంత గంభీరోదాత్తమైన భావమో చూడండి ఇది. మొదటిది పరమాత్మ విశ్వతోముఖమైన రూపాన్ని మలిచి చూపితే రెండవది దానిపై చూపు నిలపలేక అలమటించే మానవుడి వాక్యాన్ని కొలిచి చూపుతున్నది.

32. 'పవనవేగ విశీర్ణ పాదపాగ్రంబుల - జడియకుండంగ బట్టు సామ జములు - పూజార్థ నియమిత పుష్పవాటికలపై - మధుకరంబులం జోపు మర్కటములు' హోరుమని వీచేగాలికి చెట్లుకదలటం - ఊగటం - విరిగిపడి పోవటం కూడా కద్దు. అలా పడకుండా ఏనుగలే పట్టి నిలుపుతున్నాయట. మరి పూలతోటలలోనే తిరుగుతుంటాయి ఎప్పుడూ తేనెటీగలు. పూలలో

స్రవించే మకరందం సేకరించటమే గదా వాటి ఉద్యోగం. మహర్షుల పూజకు కావలసిన ఆ పుష్పాలపయి అవి కాలుమోపి కలుషితం చేయటం ఇష్టం లేని మర్కటాలు ఆ మధుకరాలను కనిపెట్టి దూరంగా తరుముతున్నాయట. ఏమిటీ వర్ణన - ఎక్కడిది. సోమనాథుని హరివంశంలోనిది. బదరికాశ్రమ వాసులైన తాపసుల ఆశ్రమ పరిసరాలను వర్ణిస్తున్నాడు కవి. ఏనుగు లెక్కడైనా చెట్లను బ్రతకనిస్తాయా - వానరాలు పువ్వుల నుండనిస్తాయా. అలాంటి స్వభావమున్న అవే మరొక దాని దాడి జరగకుండా వాటిని

కాపాడుతున్నాయంటే వింతే, తన్మూలంగా మహర్షుల తపః ప్రభావమూ దాని మూలంగా అక్కడి పరిసరాల్లో బ్రతికే జంతుకోటికి కూడా నేర్పకుండానే అలవడిన శమ దమాది గుణ సంపత్తీ - తద్వారా రజః ప్రధానులైన మానవులు కూడా ఎలా సాత్త్విక గుణగణాలను అభ్యసించి బాగు పడాలనే మహోపదేశమూ - ఇలాంటి మహోన్నత భావాలనెలా రంగరించి మనకు కర్ణ రసాయనంగా అందిస్తున్నదో చూడండి ఈ వర్ణన.

33. "కలలం బోలెడి పుత్త్రమిత్ర వనితాగారాది ....... లక్ష్మీ పతీ"

ఇది శ్రీ కృష్ణుని ద్విపాత్రాభినయము చూచి అబ్బురపాటు చెందిన అక్రూరుని ఆ క్రందన. దేహి పుత్త్ర కళత్రాది సంసార యాత్రతోనే సతమత మవుతున్నాడు. పోనీ అది శాశ్వతమా అని చూస్తే కాదు. అంతా ఒక కలవంటిది. చూచినంతసేపే గాని మెలకువవస్తే ఏమీ లేదు. ముహూర్తమాత్రమైన ఆ సుఖం కోసం మృగతృష్ణా జలం కోసం పరువుతీసినట్టు తీస్తున్నాడు మానవుడు. ఏమిటీ జీవితం - ఏది దీనికి గమ్యం. నీ పదయుగం తక్క వేరొక్క పదమేది మానవులకు, మొత్తం మానవ జీవితమంతా ఆకళించి దాని నిస్సారతను మన ముందు పెట్టి గాఢసుప్తులమైన మనలను తట్టి లేపే ఈ మాటలలోని తీవ్రత చూడండి ఎంత సూటిగా వచ్చి మనసును తాకుతున్నదో.

'కంజాక్షునకు గాని కాయంబు .... భస్త్రి గాక'

వట్టి ఆడంబరాలకూ ఆత్యాశలకూ పోయి ఈ ఉన్న కొంచె పాటి జీవిత కాలాన్నీ వంచన చేసుకోకండి - ఉన్నంతలో తృప్తి పడి



Yallamraju Srinivasa Rao
www.advaitam.in

అసలీ సాధన సామగ్రి దేని కోసమో గుర్తించి ఆ పరమార్థాన్ని సాధించటమే జీవిత కర్తవ్యంగా భావించి ముందుకు సాగండి అని బోధించే ఈ వర్ణన చూడండి ఎంత ఉజ్జ్వలమైనదో. 'ఉదయ గ్రావము .... ప్రాచీదిశన్' ప్రశాంతమైన ఒక నిశాసమయం. ప్రపంచం వెన్నెలతో నిండి కన్నుల పండువుగా ఉంది. ఆకాశ మండపంలో ఒంటరిగా సంచరిస్తున్నాడు పూర్ణచంద్రుడు. ఇది మామూలు కవుల ఊహ. కాని ఈ కవి ఊహ అది గాదు. తూర్పుకొండే పానవట్టం. అక్కడ ఉదయించే చంద్రబింబమే శివలింగం. నింగికి పొంగే సముద్ర జలమే అభిషేకములు. గుహా తిమిరమే ధూపం - జ్వలించే వెన్నెలే దీపం - తారకలే పూజా పుష్పాలు - పూజాఫలం. ప్రపంచాన్ని వ్యాపించిన భౌతికమైన తమస్సే గాదు. ఆ విద్యకమైనది కూడా. దీనిని పోగొట్టడం కాదు గొప్ప. దానిని కూడా పోగొట్టుకొన్నప్పుడే. అలాంటి తామస రాజస ప్రవృత్తులను పూర్తిగా రూపుమాపి మానవ ప్రకృతిని శుద్ధ సాత్త్వికంగా మార్చినప్పుడే అది గొప్ప. ఇంత గొప్ప ప్రయత్నమూ మరొకటి లేదు. దానిని సాధించటం కన్నా సాహిత్యజగత్తులో సాధించవలసిన వేరొక్క కళా విజయమూ లేదు. కళా శిఖరాన్ని అధిరోహించిన మహాకవులంతా ఇలా సాధించి సిద్ధి పొందినవారే. జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరా అనే మాట అలాంటి వారి పట్ల నే సార్థకం.

34. 'అంధేం దూదయముల్ ........ సంసారముల్' వారి భక్తి మానవ జీవితానికే చరమలక్ష్యం. అది కరవైతే ఇక ఏవి ఉన్నా నిరర్థకమే. ఈ నిరర్థకత్వాన్ని ఎంత చక్కని ఉపమానాలతో స్ఫురింప చేస్తున్నాడో

చూడండి మహాకవి. ఈ ఉపమానాలన్నీ మనకు దైనందిన జీవితంలో నిత్యమూ ప్రత్యక్షమయ్యేవే. లౌకికమైన ఈ ద్రవ్యాలే ఒక లోకోత్తరమైన ఆదర్శంతో ముడిపెట్టి వర్ణించినప్పు డెంత గొప్పగా దర్శన మిస్తాయో చూడండి. మన మెంత అభిమానించినా ఈ సంసార సుఖాలు శాశ్వతం కావు. నశ్వరమే. పోతే అనశ్వరమైన దశ ఒక సాయుజ్యమే. కాబట్టి ఈ బుద్బుద ప్రాయమైన భోగాలకు ప్రాకులాడక శాశ్వతమైన ఆ మోక్ష సౌఖ్యాన్నే చూరలాడమని గొంతెత్తి చాటే ఈ ప్రబోధమెంత దీటైనదో సహృదయ హృదయైక వేద్యం. 'కమనీయ భూమి భాగములు లేకున్నవే పడియుండుటకు దూది పరుపులేల'. ఎప్పుడు భోగ భాగ్యాలనను భవించాలనే ప్రతివాడికీ అభిలాష. అ సౌకర్యంపాలు గావాలని ఎవ్వడూ పాలుపడదు. కాని ఆడంబర జీవనం కన్నా నిరాడంబరంగా బ్రతుకు సాగించటంలోనే నిజానికెంతో సుఖమున్నది. సంతృప్తి ఉన్నది. సౌకర్యానికి ప్రాకులాడటం ఒక ప్రయాస. అది ఫలించక పోతే ఒక పరితాపం. అలాంటి ఈతి బాధలిందులో లేవు. పైగా ప్రకృతి దత్తమైన పరికరాలివి. వీటిని సమకూర్చుకోవటంలో మానవుడికి ప్రయత్నమంటూ లేదు. అయినా తృప్తి లేక మానవుడు ప్రయాస పడటానికే సిద్ధమవుతాడు. ఎంత అవివేకులో గదా ఈ పంచజనులని ప్రగాఢమైన నిర్వేద భావం గోచరిస్తుంది ఇందులో.

35. ఇలా ఉదాహరిస్తూ పోతే ఇదీ ఒక మహా సముద్రమే. పారం చేరుకోలేము. మొత్తం మీద భూమికా చతుష్టయ విశిష్టమైన దీశివతత్త్వం. ఇదే సాహిత్య నిర్మాణాని కంతటికీ ప్రయోజనం. ఈ లక్ష్యాని కభిముఖంగానే సత్య సౌందర్యాలనే మిగతా రెండూ

తమ ప్రయాణం సాగించవలసి ఉంటుంది. కాకుంటే ఆ గమనం నిర్లక్ష్యమూ అ గమ్యమూ కాక తప్పదు. అప్పటికీ సత్య సౌందర్యములనేవి గమకమైతే శివ మనేది గమ్యం. రెంటికీ గమ్య గమక భావమనే గాఢమైన సంబంధముంది. మరొక మాటలో చెబితే శివ మనేది ఆవలి తీరం. సత్యం దాని కీవలి తీరం. రచనాగతమైన సౌందర్యమీ రెంటినీ కలిపే ఒకనొక అందమైన సేతుబంధం. సత్యం సౌందర్యం ద్వారా శివాన్ని సాధిస్తుంది. సత్య శివ సుందరముల కున్న ఇలాంటి ప్రగాఢమైన సంబంధమే నిజమైన ప్రబంధం. వాటి పరస్పర సాహిత్యమే సాహిత్యం. అది దృష్టిలో ఉంచుకొని కవి చేసిన సృష్టే కావ్యం. కనుకనే అది సహృదయ సంభావ్యం.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ధాత్రి కృతియ గాన - కృతి రచింపు మని కంఠోక్తిగా పెద్దన గారే చెప్పుకొన్నారు. ఈ మాటలలో రసవంతమైన కావ్య మెప్పటికీ నశించదని చెపుతూ తన రచన చిరస్థాయిగా ఉండగలదని భ్యంగ్యంతరంగా సూచిస్తున్నాడు మహాకవి.

పైగా కృతి అనే పదాన్ని పునరుక్తం చేయటంలో గూడా ఒక గాంభీర్య మిమిడి ఉన్నది. కావ్యం వేరు - కృతి వేరు. దాని కన్నా దీనికి కొంత లోతైన అర్ధమున్నట్టు కనిపిస్తుంది. కృతి అంటే పని లేదా పనితనం. ఇంగ్లీషులో కూడా Work అని Workman ship అని వ్యవహరిస్తారు. పారశీక సాహిత్యంలో గొప్ప గొప్ప కావ్యాలను 'శహకార్' అనే నామ ధేయంతో పిలుస్తారు. 'కార్' అంటే పని అని అర్థం. ఆంగ్ల సాహిత్యాని కంతా పెన్నిధి ఐన లాటినులో గూడా మాగ్నం ఓపస్ అని ఉత్తమ కావ్యాలను పేర్కొనటం వాడుక. ఓపస్ అనే మాటకు పని అనే భావం. ఇంతకూ ఒక కావ్యాన్ని పట్టుకొని పని అని పేర్కొనటమేమిటి ? అక్కడే ఉంది రహస్యం. కవి ఐన వాడొక కావ్యాన్ని రచించటం వరకే అయితే ప్రయోజనం లేదు. ఆ కావ్యంలో తన పనితనం Art ఎంత ఉందో అంతా పొందు పరచి చూపగలగాలి. అప్పుడే కావ్యం కేవలం కావ్యం గాక కృతి అవుతుంది, అలాంటి కావ్యాన్ని రచించిన కవి కూడా కృతి అవుతాడు.

పెద్దన అక్షరాలా ఇలాంటి కృతిని రచించిన సుకృతి. పెద్దన వలె కృతి జెప్పిన పెద్దనవలె - కాని వాని పెద్దనవలెనా - అని కొంటెగా చెప్పినా చౌడప్ప చక్కగానే చెప్పాడు. ఈ కృతిలో పెద్దన పనితన మంతా ఆకృతి కట్టిందని చెప్పవచ్చు. చౌడప్ప చెప్పినట్టు అదే పెద్దన్నను కవులందరిలో పెద్దన్ననుగా చేసిందని కూడా అనుకోవచ్చు. పెద్ద తన

# ఆంధ్ర కవితా పితామహ - అల్లసాని

అల్లసాని పెద్దనను గూర్చి ఎంతోమంది ఎంతో పెద్దగా చెబుతూ వచ్చారు. అయినా ఇంకా చెప్పవలసిందేమిటో మిగిలిపోయిందనే నాబుద్ధికి తోస్తుంది. మను చరిత్ర తప్ప పెద్దన గారి కలం నుంచి వెలువడిన రచన మరి ఒకటి ఏదీ లేదనే చాలా మంది అభిప్రాయం, కొంత మంది అభిప్రాయ మా ముక్త మాల్యద గూడా ఆయన రచనేనని. అయితే ఈ వాదం తర్వాత విమర్శకులు చేసిన సింహనాదానికి తట్టుకోలేక పుట్టింది పుట్టినట్టే అంతరించింది. కాని ఏనాటికైనా నిజం నిరూపించ గలిగితే ఇలాంటి సింహగర్జనలకు కూడా బెదరనక్కర లేదు. నిరూపించగలమా అనేదే ప్రశ్న. నా వరకు నాకు ఆముక్త మాల్యదలో పెద్దన గారిచేయి ముప్పాతిక కద్దనే గట్టి నమ్మకం. ఇది రాయలంటే ద్వేషంతో కాని పెద్దన అంటే అభిమానంతో కాని ఆడిన మాట గాదు. పెద్దన కవితా తత్త్వమేమిటో చక్కగా అవగాహన చేసుకున్న మీదట అంటూ ఉన్నమాట. సందర్భం వచ్చినప్పుడీ సత్యాన్ని సవిస్తరంగా మనవి చేస్తాను. ప్రస్తుతాని కందరమూ నిర్వి వాదంగా ఒప్పుకొనే మను చరిత్రను గూర్చే మాటాడుకొందాము.

మను చరిత్ర అనేది నిజంగా లోకంలో మను చరిత్రే. కతికవయః కతి కృతియః- కతిలుప్తాః- కతిచరంతి - కతి శిథిలాః- అని నీలకంఠ దీక్షితుడు కాబోలు అన్నట్టు జ్ఞాపకం. ఎందరు కవులు లేరు. ఎన్ని కావ్యాలు లేవు - ఐతే కాలావాహిని కెదురొడ్డి నిలువ గలిగిన వెన్ని. విలువ గలిగినదేదో అదే నిలువ గలిగినది. అలాంటి విలువ గడించుకొని మనుగడ గన్నదే మను చరిత్ర. సప్త సంతానములలో ప్రశస్తిగాంచి ఖిలముగా కుండునది

ధాత్రి కృతియ గాన - కృతి రచింపు మని కంఠోక్తిగా పెద్దన గారే చెప్పుకొన్నారు. ఈ మాటలలో రసవంతమైన కావ్య మెప్పటికీ నశించదని చెపుతూ తన రచన చిరస్థాయిగా ఉండగలదని భ్యంగ్యంతరంగా సూచిస్తున్నాడు మహాకవి.

పైగా కృతి అనే పదాన్ని పునరుక్తం చేయటంలో గూడా ఒక గాంభీర్య మిమిడి ఉన్నది. కావ్యం వేరు - కృతి వేరు. దాని కన్నా దీనికి కొంత లోతైన అర్థమున్నట్లు కనిపిస్తుంది. కృతి అంటే పని లేదా పనితనం. ఇంగ్లీషులో కూడా Work అని Workman ship అని వ్యవహరిస్తారు. పారశీక సాహిత్యంలో గొప్ప గొప్ప కావ్యాలను 'శహకార్' అనే నామ ధేయంతో పిలుస్తారు. 'కార్' అంటే పని అని అర్థం. ఆంగ్ల సాహిత్యాని కంతా పెన్నిధి ఐన లాటినులో గూడా మాగ్నం ఓపస్ అని ఉత్తమ కావ్యాలను పేర్కొనటం వాడుక. ఓపస్ అనే మాటకు పని అనే భావం. ఇంతకూ ఒక కావ్యాన్ని పట్టుకొని పని అని పేర్కొనటమేమిటి ? అక్కడే ఉంది రహస్యం. కవి ఐన వాడొక కావ్యాన్ని రచించటం వరకే అయితే ప్రయోజనం తేదు. ఆ కావ్యంలో తన పనితనం Art ఎంత ఉందో అంతా పొందు పరచి చూపగలగాలి. అప్పుడే కావ్యం కేవలం కావ్యం గాక కృతి అవుతుంది, అలాంటి కావ్యాన్ని రచించిన కవి కూడా కృతి అవుతాడు.

పెద్దన అక్షరాలా ఇలాంటి కృతిని రచించిన సుకృతి. పెద్దన వలె కృతి జెప్పిన పెద్దనవలె - కాని వాని పెద్దనవలెనా - అని కొంటెగా చెప్పినా చౌడప్ప చక్కగానే చెప్పాడు. ఈ కృతిలో పెద్దన పనితన మంతా ఆకృతి కట్టిందని చెప్పవచ్చు. చౌడప్ప చెప్పినట్టు అదే పెద్దన్నను కవులందరిలో పెద్దన్ననుగా చేసిందని కూడా అనుకోవచ్చు. పెద్ద తన

మనేది ఆత్మ విశ్వాసంతో తనకై తాను చాటుకొనే ధైర్యమైనా ఉండాలి లేదా తనంత ప్రజ్ఞావంతుడు తన తెలివి తేటలను గుర్తించి తనకు ప్రసాదించినదైనా కావాలి. ఇవి రెండూ ఒన గూడాయి మనపెద్దన గారికి. రాయల వారి నిండు కొలువులో పెద్దన బోలు సత్కవులు పృథ్విని లేరని నీ వెరుంగవే – పెద్దనకీ దలంచినను పేరిమి నాకిదు కృష్ణ రాణ్ణృపా అని ముక్త కంఠంతో తన ఘనతను నిర్భయంగా చాటుకున్నాడు. అలాగే రాయలు గూడా తాను సాహితీ సమరాంగణ సార్వభౌముడై కూడా కవితా సామ్రాజ్యాని కంతటికీ ఆయననే ఏకైక సామ్రాట్టుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. మరి ఆనాటి రాయల ఆస్థాన కవులు గూడా ఆయనకు జరుగుతూ ఉన్న మర్యాద నే మాత్రమూ కాదనలేక పోయారు. వారు కూడా ఆయన ఎలాంటి పండితుడో ఏ స్థాయి నందుకున్న కవో అద్భుతంగా గ్రహించి ఉంటారు. అది కూడా అక్కడక్కడ పెద్దన గారి మాటలలోనే మనకు ధ్వనిస్తుంది. తజ్జ్ఞ పరిషద్వి జ్ఞాత అని – ఊహ తెలియం గల అని ఒప్పు తప్పరయు రసజ్ఞులని – ఇలాంటి వాక్యాలన్నీ ఆయన నోట ఆపాతతః దొరలినా అవి అన్నీ మనకు ప్రబలమైన సాక్ష్యాలే సందేహం లేదు.

ఈ విధంగా పెద్దన గారి పెద్దతనం అప్రతిహతంగా సాగిపోయింది. అంతే కాదు. సర్వతో ముఖంగా సాగిన ఆ పెద్దరికాన్ని అంతటినీ మూట గట్టి అందించే మాటలాగా కనిపిస్తుంది శ్రీ కృష్ణ దేవరాయ లాయనకు ప్రసాదించిన "ఆంధ్ర కవితా పితామహ" అనే అద్వితీయమైన బిరుదం. అసలా పేరుతో పిలవటమంటే రాయల కెంత ప్రీతో పిలుపించు కోవటమంటే అల్లసాని వారి కంత భ్రాంతి. కనుకనే హితుడవు చతురవ చోనిధి – వతుల పురాణాగ మేతి హాసక థార్థ – స్మృతి యుతుడ వాంధ్ర

కవితా - పితామహుడ వెవ్వరీడు పేర్కొన నీకున్ - అని రాయలు తన్నా నామధేయంతో సంబోధించినట్టు వ్రాసుకొని మురిసిపోతాడు. ఆఖరుకు రాయల వారస్తమించిన తరువాత కూడా ఆంధ్ర కవితా పితామహ అల్లసాని పెద్దన అటంచుతన్ను నిత్యమూ ఎంతో ప్రేమతో పిలిచే రాయలతో దివి కేగ లేక బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబనగుచు అని పరితపిస్తాడు. ఇంతకూ ఏమిటీ ఆంధ్ర కవితా పితామహ అనే మాట కర్థం.

పితామహ అంటే తాత అని అర్థం. నిజమే. పెద్దన అంటే అందరి కంటే పెద్దవాడు గనుక తాత అని పేర్కొన్నా తప్పులేదు. ఐతే ఇది మనం సరదాగా చెప్పుకునే అర్థమనుకోండి. తాత అంటే ఈ చరాచర సృష్టి కంతటికీ తాత ఒక్కడే ఉన్నాడు. తాత అయినా ఆయనే ధాత అయినా ఆయనే. ఎవడాయన. బ్రహ్మ దేవుడు. బ్రహ్మ ప్రపంచాని కంతటికీ సృష్టి కర్త. అలాగే ఆంధ్ర కవితా ప్రపంచానికి సృస్టి కర్త ఎవడో వాడే ఆంధ్ర కవితా పితామహుడు.

ఐతే ఆంధ్ర కవితా పితామహు డేమిటి పెద్దన. పితామహుడు అంటే సృష్టికర్త అని కదా చెప్పారు. ఆంధ్ర కవితా ప్రపంచాన్ని సృష్టించాడా పెద్దన. లేదే. అది సృష్టి అయిన ఎన్నాళ్లుకో వచ్చాడు రంగంలోనికి. మనకు తెలిసినంత వరకూ భట్టు మూర్తి చెప్పినట్టు ఈ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచాన్ని సృజించిన వాడు నన్నయ భట్టారకుడు. అంచేతనే ఆయనను వాగను శాసను డన్నారు పెద్దలు. అంతేకాదు. కవి బ్రహ్మ అని మన మీనాడు కీర్తించే తిక్కన గారు గూడా ఆనాడేమన్నాడో తెలుసా. అందాది దొడంగి మూడు కృతు లాంధ్ర కవిత్వ విశార దుండు విద్యా దయి తుండొ నర్చె మహితాత్ముడు నన్నయ భట్టు దక్షతన్ అని చెబుతూ విద్యా దయి

తుండనే మాటలో స్పష్టంగా వర్ణించాడు నన్నయ్య భట్టే ఆంధ్ర కవిత్వానికి పితామహుడని. ఈ విధంగా కవి బ్రహ్మ అనిపించుకొన్న తిక్కనా మాత్యుడే పెద్దన కంటే పూర్వుడైనవాడే పితామహ బిరుదాన్ని త్యాగం చేస్తూ ఉంటే – పోయెరా బంగారమని దాన్ని రాయలం దివ్వటమేమిటి ? పెద్దన్న దాని నందు కోవటమేమిటి. పైగా ఎంతో గొప్పగా దాన్ని చెప్పుకోవట మేమిటి? ఇది ఏ మాత్రమూ యుక్తి యుక్తంగా లేదని తోస్తుంది. కాని కొంత లోతుకు దిగి చూస్తే గాని దాని చహరా ఏమిటో మనకు స్పష్టం కాదు.

కవిత్వ మనేది ఒక ప్రపంచమే. సందేహం లేదు. ప్రపంచానికెలా ఒక సృష్టి కర్త ఉన్నాడో దీనికీ అలాగే ఉన్నాడు. వాడు బ్రహ్మ అయితే వీడు కవి బ్రహ్మ. ‘ది అసలు సృష్టి అయితే ఇది విశ్వా మిత్ర సృష్టి. అయితే ప్రపంచంతో దీని నెప్పుడు పోల్చామో దాని ప్రక్రియ అంతా దీనిలోనూ కనిపించి తీరాలి. ఈ చరాచర ప్రపంచం ఒక్క సారి సృష్టి అయి అంతటితో నిలిచిపోదు. కొంత కాలం వ్యవహారం జరిగిన తరువాత లయ మైపోతుంది. లయమైన తరువాత కొంత కాలానికి మరలా సృష్టి అవుతుంది. ఇలా సృష్టీ – లయమూ – లయమూ – సృష్టీ – ఒక చక్రం లాగా అవిచ్ఛిన్న వేగంతో పరిభ్రమిస్తూనే పోతుంది. అంచేతనే దీనిని జగత్తని సంసారమని సార్థకంగానే వ్యవహరించారు మన పూర్వులు. ఐతే ఇలా లయమై మరలా సృష్టి జరిగేటప్పుడు సామగ్రి ఎక్కడిది అని ప్రశ్న వస్తుంది. ఎక్కడిదీ అనే ప్రశ్న లేదు. అంతకు పూర్వ మెక్కడిదో ఇప్పుడూ అక్కడిదే. పరమేష్ఠిలో శక్తి రూపంగా ఏదైతే ఉందో అదే వ్యక్త రూపంగా అవతరిస్తుంది. అవతరిస్తే ప్రపంచమన్నాము. అస్తమిస్తే శక్తి అన్నాము. ఇంతే తేడా. ఒకటి స్థూలం. మరొకటి సూక్ష్మం. సూక్ష్మమైన ఆ బీజ గర్భంలోనే ఇమిడి ఉంది ఈ

చరాచర సృష్టి అంతా. మరొక మాటలో చెబితే దీని విలువలు ఆదర్శాలు తదితరములైన అన్ని వ్యవహారాలు ఆ మూలతత్త్వంలోనే ఉంటాయన్న మాట. అవే మరల సృష్టి కాలంలో ప్రకారాంతరంగా వ్యక్త మౌతూ వస్తాయి. ఇంతకూ మనం గ్రహించ వలసిందే మంటే ప్రకార మంటున్నామే Mode or Model సృష్టిలో - అదే మారుతుంది కాని ఆ విలువలు మారవు. అంటే ధర్మాధర్మాలు - రాగ ద్వేషాలు. ప్రాణుల మనస్తత్వాలు, ప్రవర్తనలు ఇలాంటి నిసర్గ లక్షణాలు మాత్రమలాగే నిలిచిపోతాయని భావం. 'ధాతా యథా పూర్వమ కల్పయత్' అని వేదం చెబుతూ ఉన్నది. బ్రహ్మ దేవుడు ఇంతకు ముందు మాదిరే ఇప్పుడు కూడా సృష్టించాడట ఈ లోకాన్ని.

మరి ముందు మాదిరే సృష్టి చేస్తూ పోతే ఏమి సుఖం. అది పాత పంచాంగమే కదా క్రొత్త దనమేముంది అని ప్రశ్న వస్తుంది. ఉంది. క్రొత్త దనం కావలసినంత ఉంది. ప్రాతలోనే ఉంది క్రొత్త. ప్రాత సామగ్రి మాత్రమే. ఆ సామగ్రి నాధారం చేసి కొని చేసే రచన క్రొత్తది. సిమెంటు, రాయి, ఇటుక, సున్నము, ఇనుము, కొయ్య ఇలాంటి పరికరాలన్నీ అన్ని ఇండ్లకూ సమానమే. కాని ఒక ఇంటి కట్టుబడి లాగా వేరొకటి ఉండదు. దేని అందం దానిదే. దేని చందం దానిదే. రచన అనేది ఇది. సృష్టి సామగ్రి ఒక్కటే ఐనా రచనలో వైచిత్రి ఉంటుంది. ఆ వైచిత్రితోనే అది ఎప్పటికప్పుడు నవనవోన్మేషంగా ప్రకాశిస్తూ పోతుంది. అలా నూతనంగా భాసిస్తున్న దాని పొరలలో అంతర్వాహినిగా ప్రవహిస్తూ ఉన్న ఆయా సత్యాలు మాత్రం ప్రాచీనాలే. కారణం అవి సార్వకాలికాలు, సార్వత్రికాలు కావటమే.

చూడండి. కృత యుగంలో దేవ దానవుల యుద్ధాలు జరిగాయి. అవి పురాణాలలో బ్రహ్మాండంగా వర్ణించారు కవులు. అదే త్రేతా యుగంలో

రామ రావణ కథా రూపంగా మారింది. అదే ద్వాపరంలో కౌరవ, పాండవ చరిత్రగా రూపొందింది. కలిలో ఇక ఎన్నోన్నో అవతారా లెత్తుతూ కనిపిస్తుంది. కొన్ని మన సమకాలంలోనే మనం కండ్లతో చూస్తున్నాము. కొన్ని భవిష్యత్తులో ఇంకా దారుణమైన పరిణామాలను చూడబోతాము. ఇదంతా వివేచన చేస్తే మనకు తెలిసే దేమిటి ? దైవ శక్తులు అసుర శక్తులు ఇవి రెండూ మానవ మనస్తత్త్వం లోనే లీనమై ఉన్న రెండు గుణాలని వాటి రెండింటికీ సంఘర్షణ ఎప్పుడూ తప్పదని - అందులో సహజంగా అసుర సంపదే గెలుస్తూ పోతుందని - ఎంతో సంస్కార బలముంటే గాని దాని నణిచి పుచ్చి దైవ సంపదపైకి రాలేదని అలా పైకి రాగలిగిన నాడే మానవ జీవితానికి నిజమైన అభ్యుదయమని - ఈ ఒక్క ఆదర్శం గమనించండి. ఆదర్శంలో ఎలాంటి మార్పూ లేదు. మార్పు ఉంటే అది ఆదర్శమే కాదు. కృతం మొదలు కొని కలియుగం వరకు ఇదే వరస. ఇది మాత్రం సార్వ కాలికమే.

మరి సార్వ కాలికం కానిదేమిటి ? దాని రచన. అందులో ఉంది వైవిధ్యం. హిరణ్య కశిపుడున్నట్టుగా రావణుడు లేడు. రావణుని మాదిరి లేరు కౌరవులు. ఒకరి కథ నడిచినట్టు మరొకరి కథ నడవదు. ఒక కథలో జరిగినట్టు ఆయా సన్ని వేశాలు ఇంకొక కథలో జరగవు. ఎంతో కల్పనా కమామిషూ ఉంటుంది. అదే రచనలో వైచిత్రి అంటే. ఇది పరమేష్ఠి నిర్మితమైన ఈ ప్రపంచంలో ఉండటాన్ని చూచే పరమేష్ఠి లాంటి కవి గూడా కావ్య ప్రపంచంలో పాటిస్తూ పోతాడు. కనుక ప్రాతలో క్రొత్త క్రొత్తలో ప్రాత ఒక దానితో ఒకటి ఓత ప్రోతంగా అల్లుకొని కూచున్నాయి. ప్రాతలో క్రొత్త అంటే రచన. క్రొత్తలో ప్రాత అంటే ఆదర్శం. ఈ ఆదర్శాన్నే

సంప్రదాయమని ఆరచననే కల్పన అని ఆధునికులు వ్యవహరిస్తుంటారు. దీనినే పాశ్చాత్య విమర్శకులు Tradition అని Novelty అని పేర్కొంటున్నారు. రెండింటినీ మేళవించి ఒక సరసమైన పాకంలో అందిస్తూ సమకాల సాహిత్యంలో ఒక క్రొత్త మలుపును సృష్టించగల వాడే కవి బ్రహ్మ అనే మాటకు అర్హుడవుతాడు.

మొట్ట మొదట ఇలాంటి అర్హత తెలుగు కవులలో సాధించిన వాడు నన్నయ భట్టారకుడు. భారత కథ నెపంగా పురుషార్థాలు నాలుగింటినీ బోధించాడు లోకానికి. ప్రసన్న కథా కలితార్థయుక్తి అదే. అర్థమంటే పురుషార్థమే. అది కథ లోనే అంతర్గతంగా ప్రవహింప జేశానని ఆయన సూచన. అదే కావ్యాని కాదర్శం. పోతే కవి దాని కనుగుణంగా చేసిన రచన కథా కథనంలో ఆయన చూపిన చమత్కారం. "ఏయది హృద్యమ పూర్వం బేయది యెద్దాని వినిన ఎరుక సమగ్రంబై యుండు నఘ నిబర్హణ మేయది అని నాలుగు లక్షణాలు చెప్పాడు కథకు. అవి చక్కగా సమన్వయించి చూపటంలో ఉందాయన ప్రతిభ. దీన్ని బట్టే ఆయన 'విద్యా దయితుండ' ని ప్రశంస పొందాడు. పోతే ఇక తిక్కన గారు సరేసరి. సాక్షాత్తు గానే కవి బ్రహ్మ ఆయన. " తన కావించిన సృష్టి తక్కొరుల చేతంగాదునా" అని ప్రబంధ పరమేశ్వరుని చేతనే భేషని పించుకొన్నాడు. ఆదర్శమదే. నన్నయ గారిదే. "తా మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్" అనే వాక్యంలో పురుషార్థాలనే కావ్యార్థంగా వ్యక్తం చేశాడు. ఐతే తన ఆదర్శం ప్రాతదైనా "ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగా" తన కథను ఊర్జితం చేసి హృదయాహ్లాదిగా తీర్చిదిద్దాడు. అందులో ఉంది ఆయన ప్రౌఢి.

కాగా ఇక అల్లసాని వారిది కూడా ఇదే బాణి. పురుషార్థ బోధే

వ్యష్టి రూపంగా కనిపించే ఒక విగ్రహమని చూడరాదు. వ్యష్టి రూపుడైన యీ జీవుడి మనో భావాల మేరకే దించి చూడరాదు కూడా. అలా చూస్తూ పోతే ఆ మహాబల సంపత్తికి దూరమై పోతాము మనం. సమష్టి భావనే బలమిస్తుంది కాని వ్యష్టి భావన యివ్వదు. అంతకంతకు బలాన్ని కోలుపోతాడు మానవుడు. అలాంటి దుర్బల చిత్తంతో ఏది సంకల్పించినా అది నెరవేరదు. చేసినా అది ఫలించదు. అడుగడుగునా విఘ్నాలు అడ్డ తగులుతాయి. అప్పుడీ గణం మనపాలిటికి ప్రమథమై కూచుంటుంది. నిరంతరమూ మథించేదేదో అది ప్రమథం. ప్రమథ గణాలివేయీ భూత భౌతికాలు :- యీ దేహేంద్రియాలు. వ్యష్టి బలాన్నే బలమని నమ్ముకుంటే వచ్చే ప్రమాదమిది. విఘ్నేశ్వరుడు మన కార్యాలకు విఘ్న మాపాదిస్తాడని చెప్పేమాట కిదీ అర్థం. అలా కాక సమష్టి రూపమైన ఆ దేవతనే నమ్మి అందులోనే వ్యష్టిని లయం చేసుకొని ఆ భావనతో దర్శిస్తే ప్రమథం కాదప్పుడు గణం మనకు ప్రథమ మౌతుంది. గణాలకు మనం ప్రాథమ్యం వహించి గణపతి భావాన్ని పొందగలమని భావం. పొందాలంటే అలా పొందే బుద్ధి ఏర్పడాలి సాధకుడికి. బుద్ధి ఏర్పడితే అదే సిద్ధిని ప్రసాదిస్తుంది. "యద్భావ స్తద్భవతి" బుద్ధిని పట్టి సిద్ధి. వినాయకునికి బుద్ధి, సిద్ధి భార్యలనే మాటలోని ఆంతర్యమిదే.

గణపతి నిలాటి ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే అది సాక్షాత్తు భగవత్తత్త్వమే. కనుకనే సకల జనారాధ్యుడా దేవుడు. సర్వసిద్ధి ప్రదాయకు డయ్యాడు. దేవీ నవరాత్రాల లాగా గణపతి నవరాత్రాలు జరుపుకుంటున్నాము మనం. అక్కడ దేవి నవావరణ రూపిణి గనుక తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలతో ఆమెను సేవిస్తాము. మంచిదే. మరి గణపతి

రూపంగా నూతనమైన ఫక్కీలో రూపుదిద్దుకొని కనిపించడమే. భారతాది సృష్టి ప్రాచీనమైతే మను చరిత్రాది ప్రబంధ సృష్టి నవీనం. ఒక నవీన కావ్య రచనకు – అని పెద్దనగారు కావ్యారంభంలో ఆడిన మాటలో కూడా ఆంతర్యమిదే. మహాకవు లెప్పుడూ తమ కావ్య మధ్యంలోనే కావ్య కళా రహస్యాలను దాని మీద దీని మీద నెపం పెట్టి ద్యోతనం చేయటం తరుచుగా చూస్తుంటాము. కాళి దాసాది మహాకవుల విషయంలో ఇలాంటి వెన్నో కనిపిస్తాయి చమత్కారాలు. అదే పంథా అల్లసాని వారిది కూడా "మహాజనో యేన గతస్సపంథాః".

కలికాలజ దోష తుషారసంహతి అని నన్నయ గారి మాట. కలి అంటే జీవితానికి సంప్రాప్తమయ్యే అనర్థం. అది రూపు మాపేది ధర్మమనే ఆదర్శం. అర్థ కామాల నడుపులో పెట్టుకొని మోక్షం వైపు దారి చూపేది ధర్మం. అదే నన్నయ గారి లాగా పెద్దన కూడా మన జాతికి చేయదలచిన మహోపదేశం. దివ్య సందేశం. కావ్యా రంభంలో వాచా చెప్పిన ఈ మాట శ్రోత లెక్కడ మరచి పోతారో అని ఆయన భయం. అందుకే నేమో కావ్య మధ్యంలో మరలా ధ్వని రూపంగా గుర్తు చేస్తాడు మనకు. ఏమని ?

వరూధిని విరహ తాపమను భవిస్తుండగా భళ్ళున తెల్లవారు తుంది. దానికి సూచకంగా కుక్కుట మొకటి కూస్తున్నది. ఎలా ఉందా కుక్కుట ధ్వని.

సకలాశా గతి నర్మకోప విరతి శ్రౌత క్రియారం భణా
త్మక వర్గ త్రయికిన్ మదుచ్చరిత శబ్ద జ్ఞానమే మూలమిం
తకు బోలన్ వినుడంచు తెల్పుగతి చెంతన్ కొండపై పల్లెల౯
కృక వాకుల్ మొరసెన్ గృహోపరి త్రి భంగిన్ భుగ్న కంఠ ధ్వనిన్

ఇందులో సకలా శాగతి అనే మాట - తెల్ల వారింది వెంటనే లేచి ఆయా దిక్కులకు వెళ్ళే వారంతా వెళ్ళండి అని పురుషార్థాలలో అర్థానికి సూచకం. నర్మ కోప విరతి అనే మాట - ప్రేయసీ ప్రియులు మూతి బిగించుకొని పడుకోక ఒకరి నొకరు గాఢంగా కౌగిలించు కొండని కామ పురుషార్థానికి సూచకం. మరి శ్రౌత క్రియారం భణమనే మాట - ద్విజులైన వారందరూ వేదోక్తమైన కర్మలన్నీ యథావిధిగా అనుష్ఠించమనే ధర్మ పురుషార్థానికి సంకేతం. కుక్కుట ధ్వని మీద నెపం పెట్టి కవి చూపుతున్న కావ్య ధ్వని ఇది. పైగా వర్గత్రయి అని చెప్పటంలో కవి వివక్షితం ధర్మార్థ కామాలనే త్రివర్గ నిరూపణమేనని - త్రిభంగిన్ అనటంలో అది ధ్వని రూపంగా నా కావ్యంలో మీకు బయట పెట్టి చూపుతానని - కవి చేసే సూచనను మనం చక్కగా గ్రహించవచ్చు. వర్గత్రయీ అనే మాట వాచ్యంగా త్రివర్గాన్నే సూచిస్తున్నా వ్యంగ్యంగా అపవర్గమైన మోక్ష పురుషార్థాన్ని గూడా మనసుకు స్ఫురింప జేస్తున్నది. శబ్ద జ్ఞానమే మూల మనటంలో శబ్ద ప్రమాణమైన వేదం ద్వారానే ఇది మానవుడు అందుకోవలసి ఉందని కూడా ధ్వనిస్తున్నది. ఇది కుక్కుట ధ్వనా ? లేక కావ్య ధ్వనా ? రెండూ. కుక్కుట ధ్వనిలో కావ్య ధ్వని. మొదటిది బాహ్యార్థమైతే రెండవది తాత్పర్యార్థం.

ఇది మనకు కథా ముఖంగా బోధించటమే కవి ఆశయం. పెద్దన తీసుకున్న కథలు నాలుగే ఈకావ్యంలో. 'రసస మంచిత కథలన్' అని ఆయనే బహువచనం ప్రయోగించాడు కావ్యాదిలో. దీని వల్ల వస్త్వైక్యం దెబ్బ తిన్నదంటారు చాలా మంది మను చరిత్రలో. అది తెలిసీ తెలియక ఆడే మాట. కథా బాహుళ్యం వల్లనే వస్త్వైక్యం దెబ్బ తినేటట్లయితే కాళిదాసు రఘువంశం కూడా తినవలసి వస్తుంది. కాని రఘు వంశంలో అంతమంది

రాజుల కథలు చెప్పినా అందరిదీ కలిసి ఒకే కథ. అదేదో కాదు. పురుషార్థ ప్రబోధమే. ఆదర్శంలో ఉంది ఐక్యం. దాని కనుగుణంగా ఎన్ని కథలల్లినా అవి ఆదర్శానికి వ్యాఖ్యానమే. అప్పుడు కథలలోని అనే కత్వ మడ్డు తగలదు మన దృష్టికి. ఈ దృష్టితో చూస్తే బ్రహ్మాండమైన వస్త్వైక్యముంది రఘు వంశంలో. కనుకనే "రఘూ ణామన్వయం వక్ష్యే" అని ముందుగానే చాటి చెప్పాడు మహాకవి. దీని అర్ధమేమంటే అన్వయంలో జన్మించిన రాజుల కథ కాదు నేను చెప్పటం. వారందరికీ చెందిన అన్వయ స్వరూపాన్నే చెబుతున్నానని. దీనిని బట్టి అన్వయ జాతులెందరైనా అన్వయం ఒక్కటే. ఆ వంశ లక్షణాలే వంశీయు లందరిలో వ్యక్తమౌతున్నాయి. ఈ దృష్ట్యా కావ్య వస్తువులో ఐక్య మెంతైనా చూడండి కనిపిస్తుందని కాళిదాసు మనకు చేస్తున్న మౌనోపదేశం.

ఇదే అల్లసాని వారిది కూడా. అందుకే ఈపద్య మిలా వ్రాశాడాయన. అది ఎలాగా అని అడగండి. రఘువంశంలో లాగే నా కావ్యంలో గూడా పురుషార్థో పదేశమే నా వివక్షితం. కథలు నాలుగింటిలో నాలుగు పురుషార్థాలను క్రమంగా ప్రతిపాదించాను. ప్రవరుడి కథలో ధర్మం, గంధర్వుడి కథలో అర్ధం, స్వరోచి వృత్తాంతంలో కామం, స్వారోచిషుని ఉదంతంలో మోక్షం. మొదటిది ధర్మం చివరిది మోక్షం. రెండింటి మధ్యలో అర్ధ కామాలు. ఏమిటి దీని అంతరార్థం. ఆ ముష్మికమైన దృష్టులు రెండూ కలిసి ఐహికమైన జీవితాన్ని అదుపులో పెట్టాలి. ఆ ముష్మికాలు రెండింటిలో కూడా ధర్మమనేది కొంత వరకే. అది అభ్యు దయానికే. అంటే శ్రేయస్సుకే. నిశ్శ్రేయసమైన మోక్షానికి గాదు. మోక్షమే పరమ పురుషార్థం. దాని తోనే ముగుస్తుంది మానవుని జీవ యాత్ర. అది మానవులకు మూల పురుషుడైన

మనువు జీవితంలోనే మనం చూడవచ్చు. మనువే కదా మనుజులందరికీ మార్గ దర్శకుడు. అంచేత మీరు అది అలవరుచుకొని జీవితాన్ని సఫలం చేసుకోండి అని కవి లోకానికిచ్చే సందేశం.

కనుక నాలుగు కథలు వర్ణించినట్టు కనిపించినా – నాలుగు కథలూ కావవి. నాలుగు పాత్రలూ లేరు. అంతా కలిసి ఒకే ఒక పాత్ర. అది మానవుడు. కథలన్నీ కలిసి ఒకే ఒక కథ. అది అతని జీవితం. నాలుగు భూమికలే గాని అవి నాలుగు జీవితాలు కావు. ధర్మార్థ కామ మోక్షాలే ఆ భూమికలు. ఇందులో మొదటి మూడు చివరి దానిలో ఎలా పర్యవసానం చెందాలో అలా చూపటమే పెద్దన ఉద్దేశం. ఇలాంటి దృక్పథంతో మనం విమర్శించి చూస్తే వస్త్వైక్యమే కాదు. పాత్రైక్యం భావైక్యం కూడా కొట్ట వచ్చినట్టు కనిపిస్తుంది భావుకుడైన వాడి హృదయానికి. ఇదే అసలు ప్రబంధమంటే. ప్రకృష్టమైన బంధం. మహాభారతాది ఇతిహాసాలలో ఐతే చెల్లా చెదురుగా భాసిస్తాయి ఇవి. ఎక్కడ ఏదో వెతుక్కోవలసి వస్తుంది. అలా కాక సంక్షిప్తంగా రచించిన ఇలాంటి కావ్యాల్లో వెంట వెంటనే గోచరిస్తుం.. మన బుద్ధికి. కాబట్టి తన ఆదర్శాన్ని ఇంత అందంగా అద్భుతంగా చిత్రించి చూపటమే ప్రబంధ కవి ప్రాగల్భ్యం. అందుకే అన్నారు అల్లసాని వారి అల్లిక జిగి బిగి అని. బిగి వస్తు నిర్మాణంలో ఐతే – జిగి దాన్ని సర్వాంగ సుందరంగా తీర్చటంలో. ఇవి రెండూ ఆ కాలానికి క్రొత్తగా సాధించిచూపాడు గనుక ఆయన ఎప్పటికీ ఆంధ్ర కవితా పితామహుడే

★★★

# నవవిధ గణపతులు - ప్రతీక వాదం

" గణానాంత్వా గణపతిగ్ం హవామహే " అని ఋగ్వేద సూక్తి. గణాలన్నిటికి అధిపతి గణపతి. గణాలేమిటి. పంచభూతాలే గణం. పాంచ భౌతిక పదార్థాలు కూడా గణమే. వీటన్నిటినీ అదుపులో పెట్టుకొన్న దేవత గణపతి. విశ్వవ్యాపకమైన శక్తే దేవత అంటే. విశ్వ మీ భూత భౌతిక గణమే. కనుకనే జ్యేష్ఠ రాజమని కీర్తించిందా మంత్రం. అన్నిటికన్నా జ్యేష్ఠమూ అన్నిటికీ నియామకమూ అయిన మహాశక్తి కది తగిన మాటే. షాడ్గుణ్యంతో కూడినదే భగవత్తత్త్వం. అందులో బలమనేది ఒక గుణం. దాన్ని ప్రధానంగా తీసుకున్నది గాణపత్యమనే మతం. గణపతికి సంబంధించినది గాణపత్యం. గణపతి అప్పటికి బలానికి సంకేతమన్న మాట. బలమంటే మన మనుకునేది కాదు. స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ అని శ్వేతాశ్వతరం వర్ణించిన బలం. పరమాత్మ ఇచ్ఛా శక్తి అది. జ్ఞానానికీ క్రియకూ మధ్యవర్తిని. జ్ఞానం క్రియగా మారటమే సృష్టి. అలా మార్చే శక్తి బలం. కనుక చరాచర సృష్టికి మూల భూతమూ తన్నియామకమూ అయిన తత్త్వమే గణపతి. వాగీశాద్యా స్సు మనసః సర్వార్థానా ము పక్రమే - యంనత్వా కృతకృత్యాఃస్యుః - ముక్కోటి దేవతలూ బ్రహ్మదేవుడితో సహా ఆయనకు నమస్కరిస్తున్నా రంటే ఏమిటి అర్థం. పారమేశ్వరమైన ఇచ్ఛాశక్తే అన్ని శక్తులకూ అతీతమైనది గనుక అది దేవతలందరికీ పూజనీయం. సృష్టికే మూలభూతం గనుక సృష్టికర్తకు కూడా ఆరాధనీయం. దేవతలంటే శక్తి విశేషాలే గనుక ఆదిశక్తి అయిన గణపతి వారందరికీ ఆరాధ్యుడని చెప్పటంలో ఆశ్చర్యం లేదు. ఆదిశక్తి గనుకనే మిగతా శక్తులూ, వ్యక్తులూ

అన్నీ ఆయన కధీనమై మెలగవలసిందే. అంటే ఏమన్న మాట. ఆయా దేవతలు, భూతాలు గణమని భావిస్తే ఈ గణాలకు నియామకమైన మహాశక్తే గణపతి అని అంతరార్థం,

శక్తికన్నా బలమైనదే ముంది సృష్టిలో. శక్తి అంటేనే బలం. బలం వావ విజ్ఞా నాత్ భూయః :- అన్నది ఛాందోగ్యం. వాగాదులకంటే విజ్ఞానం గొప్పదైతే విజ్ఞానానికంటే మహత్తరమైనది బలమట. బలేనవై పృథివీ తిష్ఠతి - బలే నాంతరిక్షం :- బలేన ద్యౌః :- బలేన పర్వతాః :- బలేన దేవ మనుష్యాః :- బలేన పశవః :- బలేన వయాంసి :- బలేన తృణ వనస్పతయః - బలేన లోకః :- అని బలం తాలూకు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్న దుపనిషత్తు. స్థావర జంగమాత్మకమైన ప్రపంచమంతా ఒకానొక బలంతో ఇలా నిలిచి ఉందట. ఆ బలానికి సంకేతమైన గణపతి అప్పటికి విరాడ్రూపుడైన పరమాత్మే. అందుకే "శుక్లాంబరధరమ్ విష్ణుం" అని కీర్తించారా దేవతను. విష్ల వ్యాప్తావని వ్యుత్పత్తి. విష్ణువంటే సర్వజగ ద్వ్యాపి అయిన భగవదైశ్వర్యమే. అదే గణపతి.

సర్వవ్యాపి అన్నప్పుడీ బాహ్యజగత్తే కాదు. ఆంతర జగత్తు కూడా. బ్రహ్మాండమెలా వ్యాపించిందో అది పిండాండంలో కూడా ప్రతి అణువూ వ్యాపించి తీరాలి. అప్పటికి మన దే హేంద్రియ మనోబుద్ధ్యహంకారాలు కూడా అదే. భూత భౌతికాలు బాహ్యమైన గణమైతే దేహేంద్రియాలు ఆభ్యంతరమైన గణం. ఈ రెండింటి లోపల అన్నప్పుడది పరమాత్మ శక్తే. నిరాకారమైన ఆశక్తే సాకారమైతే విశ్వం. విశ్వరూపుడు గణపతి అయితే విశ్వమాయన రూపం. అయితే దాని నలాగే భావించాలి మనం. అదేదో

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

వ్యష్టి రూపంగా కనిపించే ఒక విగ్రహమని చూడరాదు. వ్యష్టి రూపుడైన యీ జీవుడి మనో భావాల మేరకే దించి చూడరాదు కూడా. అలా చూస్తూ పోతే ఆ మహాబల సంపత్తికి దూరమై పోతాము మనం. సమష్టి భావనే బలమిస్తుంది కాని వ్యష్టి భావన యివ్వదు. అంతకంతకు బలాన్ని కోలుపోతాడు మానవుడు. అలాంటి దుర్బల చిత్తంతో ఏది సంకల్పించినా అది నెరవేరదు. చేసినా అది ఫలించదు. అడుగడుగునా విఘ్నాలు అడ్డు తగులుతాయి. అప్పుడీ గణం మనపాలిటికి ప్రమథమై కూచుంటుంది. నిరంతరమూ మథించేదేదో అది ప్రమథం. ప్రమథ గణాలివేయీ భూత భౌతికాలు :- యీ దేహేంద్రియాలు. వ్యష్టి బలాన్నే బలమని నమ్ముకుంటే వచ్చే ప్రమాదమిది. విఘ్నేశ్వరుడు మన కార్యాలకు విఘ్న మాపాదిస్తాడని చెప్పేమాట కిదీ అర్థం. అలా కాక సమష్టి రూపమైన ఆ దేవతనే నమ్మి అందులోనే వ్యష్టిని లయం చేసుకొని ఆ భావనతో దర్శిస్తే ప్రమథం కాదప్పుడు గణం మనకు ప్రథమ మౌతుంది. గణాలకు మనం ప్రాథమ్యం వహించి గణపతి భావాన్ని పొందగలమని భావం. పొందాలంటే అలా పొందే బుద్ధి ఏర్పడాలి సాధకుడికి. బుద్ధి ఏర్పడితే అదే సిద్ధిని ప్రసాదిస్తుంది. "యద్భావ స్తద్భవతి" బుద్ధిని పట్టి సిద్ధి. వినాయకునికి బుద్ధి, సిద్ధి భార్యలనే మాటలోని ఆంతర్యమిదే.

గణపతి నిలాటి ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే అది సాక్షాత్తు భగవత్తత్త్వమే. కనుకనే సకల జనారాధ్యుడా దేవుడు. సర్వసిద్ధి ప్రదాయకు డయ్యాడు. దేవీ నవరాత్రాల లాగా గణపతి నవరాత్రాలు జరుపుకుంటున్నాము మనం. అక్కడ దేవి నవావరణ రూపిణి గనుక తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలతో ఆమెను సేవిస్తాము. మంచిదే. మరి గణపతి

కెక్కడివి తొమ్మిది రూపాలని ప్రశ్న. గణపతి పారమేశ్వరమైన శక్తి అని ఎప్పుడన్నామో ఆ తొమ్మిదే యీయనకు చెప్పినా చెప్పవచ్చు. భూమి రాపోనలో వాయుః ఖం మనో బుద్ధి రేవచ అహంకారః అని అపరాప్రకృతి ఎనిమిది విధాలు. ఇతస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరాం – సమష్టి జీవుడైన హిరణ్య గర్భుడు పరాప్రకృతి వెరసి తొమ్మిది ప్రకృతులు. ఇవే నవావరణలు. నవయోనులని గూడా పేర్కొంటారు తాంత్రికులు. బిందువు నుంచి భూపురం దాకా శ్రీ చక్రంలో విస్తరించి ఉన్నవి తొమ్మిదే. బాహ్యాభ్యంతర సృష్టి అంతా యీ తొమ్మిదింటిలోనే సమసిపోతుంది. ఇది గణమైతే దీనికి పతి ఆ మూల ప్రకృతే ఆ మహాశక్తే.

అయితే ఏమిటా తొమ్మిది రూపాలింతకు ? అసలు తొమ్మిదింటిలో ఒకటి మినహాయించి ఎనిమిదేనని పేర్కొంటారు గణపతి రూపాలు. అష్టలక్ష్ముల లాగా అష్టగణపతులనే పరిగణిస్తారు. పూనే దగ్గర అష్టగణపతి దేవాలయం కూడా వుంది. ఆ మాటకు వస్తే 32, 36, గణపతులను కూడా వర్ణిస్తారు. శైవాగమాలలో దేవీ భాగవతంలోనూ అంతమంది గణపతు లున్నప్పుడు తొమ్మిదింటిని పరిగణించటంలో అభ్యంతర మేముంది. ఎటువచ్చీ ఏ తొమ్మిదింటిని తీసుకుంటే ఇటు ముందు చెప్పిన నవ ప్రకృతులకు అటు మోక్ష సాధన మార్గానికి తోడ్పడుతుందో అవి తీసుకోవటమే సబబు. గణమనేది ప్రపంచమూ గణపతి విరాడ్రూపుడైన పరమాత్మకు ప్రతీకమని ఎప్పుడన్నామో అప్పుడే నవవిధ గణపతుల రూపాలూ ఆ గమ్యాన్ని చేర్చే సోపానపరం పరగా మనం వ్యాఖ్యానించవచ్చు.

ఇందులో మొట్టమొదటి భూమిక బాల గణపతి. బలమే బాల అన్నారు భాష్యకారులు. పరమాత్మ శక్తికే బలమని పేరు. బాలా

త్రిపురసుందరి అంటే అమ్మవారే కదా. బాల గణపతి రూపంగా కూడా అదే భాసిస్తున్నది. రెండవది నృత్య లేదా నాట్య గణపతి. ఆ బాల తన లోకోత్తర ప్రభావంతో ఈ విశ్వమంతా వ్యాపించి నాట్యం చేస్తున్నది. ప్రమోదభరతుంది లప్రమథ దత్తతాళావళీ. వినోదిని వినాయకే డమరుడిండి మధ్వానిని, అని పండితరాయల వర్ణన. వినాయకుడి తాండవమేదో కాదు. సర్వజగద్వ్యాపన వ్యాపారమే. మూడవది వీర గణపతి లేదా విద్యా గణపతి. 'విద్యయా విందతే వీర్య' మని చాటుతున్న దుపనిషత్తు. కేవల మాత్మ జ్ఞానమే అది. మరేది కాదు. నాలుగవది లక్ష్మీ గణపతి. విద్యా వీర్య మెప్పుడేర్పడిందో అదే లక్ష్మి సాధకుడికి. పారమేశ్వరమైన విభూతే లక్ష్మి. అది పరమాత్మను లక్షింపజేస్తూ ఆయనకు లక్షణమౌతుంది. బ్రహ్మజ్ఞానం చేతనే సమకూరుతు ందది. సర్వ ప్రపంచమూ జ్ఞాన వైభవమేననే దృష్టి. అయిదవది సిద్ధి గణపతి జ్ఞానైశ్వర్యాలు రెండూ పిలిస్తే పలకటమే చివరకు మనమాసించే సిద్ధి. ఆరవది అర్క గణపతి లేదా శ్వేతార్క గణపతి. అర్కమంటే జిల్లేడు. శ్వేతార్కం తెల్ల జిల్లేడు. ఒక వంద సంవత్సరాలు గడిస్తే దాని వేరు గణపతి రూపం ధరించి కనపడుతుందట. ఆట కాదది అనుభవసిద్ధమే. ఇక్కడ సంకేత మేమంటే సాధకుడికి కలిగే ఆ సిద్ధి శ్వేతమూ అర్కమూ. శ్వేతమంటే తెల్లని స్వచ్ఛమైన; అర్కమంటే సూర్య ప్రకాశంలాగా వెలిగిపోయే చైతన్యమని అర్థం. పోతే ఏడవది ఊర్ధ్వ గణపతి. అలాంటి జ్ఞాన ప్రకాశం నామ రూపాత్మకమైన తమోరూపమైన యీ సృష్టికి విలక్షణంగా దీని నతిక్రమించి భాసిస్తుంది కనుక ఊర్ధ్వం. ఎనిమిదివది సాక్షి గణపతి. అలా భాసించటమే గాక మరలా యీ సృష్టికంతా సాక్షిగా నిలిచి దీన్ని భాసింపజేస్తుంది కూడా. అప్పుడే దీని కస్తిత్వం. పోతే ఇక తొమ్మిదవది ఆఖరిది మహా గణపతి. ఈ గణాని కంతటికీ విలక్షణమూ సాక్షి భూతమే

గాక అధిష్ఠాన రూపంగా దీనిలోని ప్రతి అణువునూ వ్యాపించింది కూడా అదే. విశ్వాతీతమూ, విశ్వమయమూ కూడానని భావం. అప్పుడే అది పరిపూర్ణమైన తత్త్వం.

మొత్తం మీద "బాల" నుంచి "మహా" వరకు వ్యాపించి వున్నది. గణపతి తత్త్వం. అణోరణీయాన్ బాల అయితే; మహతో మహీయాన్ అనునది మహాగణపతి. కాగా మధ్యలో ఉన్న ఏడు భూమికలు ఆ రెండు కొసలను కలిపే ఒక గొప్ప సేతుబంధం. అవి క్రమంగా మానవుడికి ఉత్సాహ, వీర్య, విభూతి, సిద్ధి, ప్రకాశౌన్నత్య సర్వ సాక్షిత్వాలనే గుణాల నందజేసి జీవితలక్ష్యమైన అమృతత్త్వాని కర్హుణ్ణి జేస్తాయి. ఆ దేవతకేది లక్షణమో యీ సాధకుడికది ప్రయత్న సాధ్యం. ప్రయత్నం చివరకు ఫలిస్తే నిజమైన గాణపత్యం లభిస్తుంది మానవుడికి. ఇది గణేశ చతుర్థినాడు బుద్ధి జీవులమైన మన మందరమూ భావించవలసిన గణపతితత్త్వం. నవవిధ గణపతుల మూర్తి కల్పనలో దాగిఉన్న ప్రతీకత్వం.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# వినాయకుని గాణా పత్యము

శ్లో॥ అంతరాయ తిమిరోపశాంతయే
శాంతపావన మచింత్య వైభవమ్
తం నరం వపుషి కుంజరమ్ ముఖే
మన్మహే కిమపి తుందిలం మహః ॥

దేవతలలో ఇద్దరే ఇద్దరు కనిపిస్తారు విచిత్రమైన రూపాలలో. నరసింహుడొకడు నరకుంజరుడొకడు. నరసింహుడు శ్రీ మహా విష్ణువైతే – నరకుంజరుడు మహాగణపతి. ఇద్దరూ దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోస మవతరించిన వారే. హిరణ్యకశిపుణ్ణి వధించి ప్రహ్లాదుణ్ణి కాపాడటానికి నరసింహావతారమైతే – మానవులను బాధించే విఘ్నాలనే దుష్ట శక్తులను పారదోలి వారి కార్యాలను నిర్విఘ్నంగా సాగించటానికే వినాయకుడి అవతారం. వినయమంటే శిక్షణమని అర్థం. శిక్షణ చేసే వాడెవడో వాడు వినాయకుడు. దుష్టశక్తులను శిక్షించే వాడని భావం. అవి ఏవోకావా శక్తులు. భూత ప్రేతాది ప్రమథగణాలే. నిత్యమూ మానవ జీవితాన్ని మథించే స్వభావమున్నది గనుక వాటికా పేరువచ్చింది. మానవుడే సత్కార్యం తలపెట్టినా అవి దాడి చేస్తుంటాయి. అది వాటి స్వభావం. అలా చేస్తుంటే వాటి బారి నుంచి తప్పించు కోవాలని చూస్తాడు సాధకుడు. అందుకే సంధ్యా వందనాదులైన కర్మ లాచరించేటప్పుడు "ఉత్తిష్ఠంతు భూత పిశాచాః " అని మనం సంకల్పం చెప్పుకోటం.

ఇలాంటి అసురగణా లన్నిటినీ అదుపులో పెట్టి సాధకులైన మానవులకు కార్య సిద్ధిని ప్రసాదించటానికే వినాయక స్వామిని సృష్టించారా



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఆదిమ దంపతులు. అది కేవలమూ జడమైన శక్తి సాధించలేదు. అందుకే కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీ గణేశ్వరా. ఆయన కామేశ్వరుడు. ఆవిడ కామేశ్వరి. ఇరువురికీ ఇచ్ఛ కలిగి యీవిడ ఆయన ముఖాన్ని ఆలోకిస్తూ ఆ ఆలోకన ప్రభావంతో కల్పించిందట గణేశ్వరుణ్ణి, ఆలోకమంటే దర్శనమే కాదు. దీప్తి కూడా. అదే అమ్మవారి దర్శన క్రియగా మారి గణపతి తయారయ్యాడు. జ్ఞాన, క్రియా, శక్తులు రెండూ సంగమించిన పవిత్ర తీర్థమే ఆయన మూర్తి. అదే జగజ్జననీ జనకు లాయనలో కల్పించిన శ్రీ. దానితో శ్రీ మహాగణపతి అయ్యాడాయన. అది చూచి వరించారా బ్రహ్మచారి నిద్దరుకన్యలు. ఒకటి బుద్ధి మరొకటి సిద్ధి. బుద్ధి జ్ఞానానికి సిద్ధి క్రియాశక్తికి కేవలం ప్రతీకలే. అవి ఆ మహానుభావుడి వశంలో ఉంటాయి కాబట్టి భార్యలుగా భావించారు మన పెద్దలాయనకు.

మొత్తానికి వినాయకుడు గణేశ్వరు డయ్యాడు. ఈ గాణా పత్య మాయనకు పురాణదంపతులే ప్రసాదించారు. తల్లి దండ్రులలో తండ్రి జ్ఞాన రూపమైన బుద్ధినిస్తే – తల్లి క్రియారూపమైన సిద్ధి నిచ్చింది. ఈ జ్ఞాన క్రియాశక్తుల బలంతో ప్రమథ గణాల సదుపులో పెట్టుకొని గణపతి అయ్యాడు. వినయం చేసి వాటిని వినాయకు డయ్యాడు. వినాయకుడి జన్మ వృత్తాంతం పురాణాలు చెపుతుంటే చాలా చిత్రంగా తోస్తుంది. పార్వతీదేవి స్నానానికి వెళుతూ ఎవరూలోనికి రాకుండా చూడమని వినాయకుణ్ణి గుమ్మంలో కాపలా ఉంచిందట. అప్పుడే పరమేశ్వరుడు ఎక్కడి నుంచో బొట్టు పెట్టినట్టు అక్కడికి బయలుదేరి వస్తాడు. లోపలికి రాబోతుంటే బాలుడడ్డు పడతాడు. అందుకు కోపించి శివుడా బాలుని తల ఖండిస్తాడు. తరువాత అది తెలిసి పార్వతి దుఃఖిస్తే చూడలేక ఒక ఏనుగు తల తెప్పించి కళేబరాని కతికిస్తే లేచి కూచుంటా డాబాలకుడు.



Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

అప్పటినుంచీ గజముఖుడని పేరు వచ్చింది గణపతి కని చెపుతారు పౌరాణికులు.

ఏమిటీ కథలోని అంతరార్థం. శివుడు సర్వజ్ఞుడు. పరిపూర్ణమైన జ్ఞానానికి సంకేతం. అలాంటి జ్ఞానశక్తి నద్దుకున్నాడు వినాయకుడు. జ్ఞాన మక్కర లేదంటే ఇక మనకు మిగిలేదేమిటి ? గజముఖమే. గజ మజ్ఞానానికి చిహ్నం. రజస్తమో గుణాలు తప్ప శుద్ధసత్త్వాని కక్కడచోటు లేదు. తన్మూలంగా గణంతో సాంగత్య మేర్పడి గణపతి అయ్యాడు వినాయకుడు. గణమంటే ప్రమథ గణమని చెప్పాము. అది ఏదోగాదీ చరాచరప్రపంచమే. నిరంతరమూ మానవుడి తను మనఃప్రాణాలను మథించేది ఇదే. భూతప్రేత పిశాచాలివే. నామరూపాలే మనపాలిటికి. ఆధ్యాత్మికాది సంసార తాపాలన్నీ దీని మూలంగానే ప్రాప్తిస్తున్నాయి మనకు. మేమిచ్చిన జ్ఞానక్రియా శక్తుల బలంతో వీటిని వశం చేసుకొని గణపతివై కార్యసిద్ధి పడయమని మేము పంపితే చివరకు నీవా శ్రీ కోలుపోయి గణంతో చేతులు కలిపి బలహీనుడవై పోయావా అని వాపోయారా శివశక్తులు.

తల్లిదండ్రుల వాత్సల్యానికి దూరమై ఈ తనయుడు మూలాధారమైన పృథివీ తత్త్వం దాకా పడిపోయాడు. పార్థివమైన రూపమే తన రూపమని భావించాడు. ఒక మూషికంలాగా చాపల్యానికి గురిఅయి భౌమమైన ఆలోచనలతోనే కడుపు నింపుకుంటూ ఊర్ధ్వముఖంగా చూడవలసిన తన చూపు నధోముఖం చేసుకొని రాజస, తామస గుణాలనే గణాలతోనే అనుక్షణమూ కాలక్షేపం చేయసాగాడు. దీనితో సవిఘ్నంగా గాక నిర్విఘ్నంగా ఎలా సాగుతుంది మానవుడి జీవయాత్ర. పాంచ భౌతికమైన గణంతో చేతులు కలిపిన నేరానికి తజ్జన్యమైన తాపత్రయ మనుభవించ వలసిందే. తప్పదు. అది తప్పాలంటే గణపతి నిజమైన గణపతే కావాలి. అంటే ఈ



Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitedanta.in

భూత గణానికి తా న ధీనుడు కాను. అధిపతిననే సత్యాన్ని గుర్తు చేసుకోవాలి. చేసుకొంటే తన తల్లిదండ్రుల లాగా తానూ సర్వజ్ఞుడు సర్వక్రియా సమర్థుడు అనే సత్యం కూడా అనుభవానికి రాగలదు. ఆ వచ్చినపుడే అతణ్ణి బుద్ధీ వరిస్తుంది సిద్ధీ వరిస్తుంది. మామూలు బుద్ధి కాదది – మామూలు సిద్ధికాదు. మహాబుద్ధి మహాసిద్ధి. తద్వారా గణపతి కూడా మహాగణపతి అవుతాడు.

అయితే అది భాద్రపదం, శుక్లపక్షం. భద్రమైన పదం భాద్ర పదం. శ్రేయస్కరమైన స్థానం. జీవిత గమ్యమైన మోక్షమే అది. కృష్ణమైన ధూమ మార్గం కాదది. శుక్లమైన తేజోరూపం. అందులోనూ చతుర్థి, జాగ్రత్, స్వప్న సుషుప్తులనే మూడవ స్థలనూ దాటిపోయిన తురీయావస్థ. నిర్వికల్ప సమాధి. అందులో కూచున్న మహాగణపతిని చూచి ఇక ఏ చంద్రుడూ పరిహసించ లేడు. అసలు చంద్రుడే లేడిక్కడ. మనసే కదా చంద్రుడంటే. మనసనేది లయమైన అమనస్కదశ సమాధి. అలాంటపుడు మనో రూపుడైన చంద్రు డెక్కడున్నాడు నవ్వటానికి. చంద్రుడే లేనపుడు నీలాపనింద లెక్కడున్నాయి కంగారు పడటానికి. ఉన్నాయి అంటే అవి ఆ సమాధి స్థితి నోచుకోలేని లౌకికులకైనా ఉండాలి లేదా అది సిద్ధించినా అందులో నుంచి జారిపడే యోగభ్రష్టులకైనా ఉండాలి. సకల భూత గణవాసనలకూ స్వస్తి చెప్పి పూర్ణ జ్ఞాన బలంతో వాటిని వినయంచేసి అసలైన గాణాపత్యం సాధించిన మహాగణపతికి లేవు.

" గణానాంత్వా గణపతిగ్ం హవామహే " ఇలాంటి మహాత్ముడే మానవలో కాని కంతా ఆచార్య పురుషుడు." ఆచార్యదేవో భవ" అన్నారు. అలాంటి దేవతనే ఆవాహనం చేయాలి మనం. ఆసనం సమర్పించాలి. ఎక్కడ ? మన హృదయాలలో. అర్పించాలా యనకు. ఏమిటి ? పత్ర పుష్ప ఫలాలను. అంటే శరీర మనః ప్రాణాలను. ధ్యానం చేయాలి. ఎలాగా.

" శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయే
సర్వ విఘ్నోపశాంతయే

శుక్లమైన అంబరం పరిశుద్ధ జ్ఞానమే. అది అంబరంలాగా సర్వ వ్యాపకం. విష్ణు వంటే వ్యాపకమైన తత్త్వమే. దాన్నే ఒక వస్త్రంలాగా ధరించాడా దేవత. మరలా దాన్ని మనకు ప్రసాదించాలంటే శశివర్ణుడౌతా డాయన. శశి అంటే చంద్రుడు, చంద్రుడంటే మనసనే చెప్పాము. మనో భూమికకు దిగి వచ్చి బోధిస్తాడు మనకు ఆచార్యుడు. బోధించే స్తోమత ఏమిటాయనకు. చతుర్భుజం. ధర్మ, జ్ఞాన, వైరాగ్యైశ్వర్యాలనే సిద్ధి చతుష్టయ ముందాయనకు. అవి నిత్యమూ భుజించే అంటే అనుభవించే మహనీయుడు. కనుకనే ప్రసన్న వదనం. తనకు ప్రసన్నమైన శివశక్తి సామరస్య రూపమైన ఏ జ్ఞానముందో దాన్ని మనకు వదనం - బోధించగలడు. ఆ బోధ నందు కుంటే అదే మనకు సర్వవిఘ్నో పశాంతయే సకల విఘ్నాలను సాధన మార్గంలో కలగకుండా తొలగజేస్తుంది. దానితో ప్రాపంచికమైన గణములో చిక్కుపడిన ఈ మానవుడే గణపతిగా మారి - గణపతి వినాయకుడై మహాగణపతి గా మారి - చివరకు పితృ పైతామహమైన మోక్ష సామ్రాజ్యానికే పాత్రుడవుతాడు. ఇదీ మహాగణపతి మనకు చేసే అగణితమైన మహోపదేశం.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitam.in

# యోగ మంటే ఏమిటి

యోగమనే మాట చాలా తరుచుగా మనం వినే మాటలలో ఒకటి. ఎంత తరుచుగా ఈ శబ్దం మన చెవిలో పడుతుంటుందో దాని అర్ధమంత అరుదుగా మనుసుకు వస్తుంటుంది. ఖచ్చితంగా ఇదమిత్థమని నిర్ణయించలేక పోతున్నాము. మీ యోగక్షేమాలు బాగున్నాయా అని అడుగు తుంటాము. వాడికి మంచి యోగం పట్టిందంటాము. వీడి యోగం బాగా లేదంటాము. ఇలాంటి లోక వ్యవహారం దగ్గరి నుంచి యోగాభ్యాసం యోగసిద్ధి అనే శాస్త్ర వ్యవహారం వరకూ ఎంతైనా ఉంది దీని క్షేత్రం. ఎక్కడ ఏ అర్థంలో వాడు తుంటామో ఈ శబ్ధాన్ని మనకే తెలియదు. ఆ మాటకు వస్తే ప్రామాణికమైన గ్రంథాలలోనే అంతుపట్టని వ్యవహారమిది.

భగవద్గీతలో పద్దెనిమిది అధ్యాయాలకూ, పద్దెనిమిది యోగాలని పేరు పెట్టాడు వ్యాస భగవానుడు. చిత్రమేమంటే విషయాలెక్కడి కక్కడ మారుతున్నా అన్నింటినీ యోగమనే పేర్కొంటాడాయన. విషాదమూ యోగమే - కర్మా యోగమే - జ్ఞాన విజ్ఞానాలూ యోగమే. అది ఎలా సంభవం. అంతేకాదు. మధ్యలో అక్కడక్కడా యోగ శబ్దానికి నిర్వచనం కూడా ఇస్తూ వచ్చాడు మహర్షి. " యోగః కర్మసు కౌశలమ్ " - పనులు చేయటంలో చాతుర్యమే యోగమంటా డొకచోట. " సమత్వమ్ యోగ ఉచ్యతే " సుఖదుఃఖాది ద్వంద్వాలను తేడా లేకుండా చూడటమే యోగమంటాడు మరొకచోట. "యోగక్షేమం వహామ్యహమ్ " యోగక్షేమాలు రెండూ ఇస్తానంటా డింకొక చోట. "దుఃఖసంయోగ వియోగం యోగ సంజ్ఞతమ్" దుఃఖయోగం లేక పోవటమే యోగమని చమత్కారంగా వర్ణిస్తాడొక చోట. పోతే " జ్ఞాన యోగ వ్యవస్థితిః " అని వ్యాస భగవానుడు



Vallabhaneni Srinivasa Rao www.advaitavedanta.in

ప్రయోగిస్తే దానికి భగవత్పాదు లర్థం వ్రాస్తూ జ్ఞానమంటే శాస్త్రజన్యమైన జ్ఞానమనీ, యోగమంటే అది స్వానుభవానికి తెచ్చుకోటమని వివరిస్తారు.

భగవద్గీత సంగతే ఇలా ఉంటే ఇక యోగ శాస్త్రమే ప్రత్యేకంగా రచించిన పతంజలి మహర్షి సంగతి చెప్పేదేముంది. షడ్దర్శనాలలో కపిలుని సాంఖ్యమొక దర్శనం. పతంజలి యోగ మొక దర్శనం. సాంఖ్యం నిరీశ్వర Atheistic మయితే యోగం సేశ్వరం. Theistic చాలా ప్రామాణికమైనది. పాతం జల యోగదర్శనం. తరువాత వచ్చిన యోగ వాఙ్మయాని కంతటికీ మూలభూతమైనది. అందులో మొట్టమొదటనే యోగమంటే ఏమిటో లక్షణం చెప్పాడాయన." యోగశ్చిత్త వృత్తి నిరోధః " అని సూత్రం, మనసులో కలిగే భావాలన్నింటినీ అరికట్టి పారేయటమే యోగమట. అది నెరవేరాలంటే యమ నియమాదుల దగ్గరి నుంచీ ధారణా, ధ్యాన సమాధుల వరకూ అష్టాంగ యోగమనే పేరుతో ఎనిమిది భూమికలు వర్ణించి చెప్పాడాయన.

ఇంత మంది పెద్దలిన్ని మార్గాలలో వర్ణిస్తూపోయే సరికి యోగమనే మాట కసలైన అర్థమేమిటా అని మనకిప్పుడు సందేహం. అన్నీ అర్థాలేనని చెప్పటానికి లేదు. అవి పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. వైరుధ్యమున్నంత వరకూ సమన్వయ మేర్పడదు. సమన్వయం లేకుంటే నిశ్చయ జ్ఞానానికి నోచుకోలేము. నిశ్చయ జ్ఞానం లేకపోతే సాధన లేదు. సిద్ధిలేదు. అంచేత అన్నింటినీ కలిపి ముడిపెట్టి చూపే సమన్వయ సూత్రమేదైనా ఉందా అని విచారించా లిప్పుడు.

ఏ శబ్దమైనా ఉన్నదున్నట్టు మనకర్థం కావాలంటే అది ఏ మూల ధాతువు నుండి వచ్చిందో దాన్నిపట్టుకోవాలి మనం. యోగమనే శబ్దం యుజ్' అనే ధాతువు నుంచి వ్యుత్పన్నమయింది. యుజ్ అంటే కలియటమని అర్థం. అప్పటికి యోగమంటే కలయిక అన్నమాట. రెండు పదార్థా లున్నపుడే కలయిక అనేది సంభవం. అందులో రెండూ అపరిపూర్ణమైతే కలిసి

ప్రయోజనం లేదు. రెండూ పరిపూర్ణమైతే కలియ నక్కరలేదు. పోతే ఒకటి అపరిపూర్ణమై, మరొకటి పరిపూర్ణ మయినప్పుడే కలయిక కర్థముంటుంది. " పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావశిష్యతే " అన్నట్టు దానిలాగా ఇది పూర్ణమై మానవుడికి పూర్ణమైన తత్త్వం అనుభవానికి వస్తుంది. అదే జీవిత సమస్యలన్నింటికీ ఏకైకమైన పరిష్కారం.

కాగా ప్రస్తుత మా అపరిపూర్ణ మేమిటి. అది అందుకోవలసిన ఆ పరిపూర్ణమైన తత్త్వ మేమిటని ప్రశ్న. అపరిపూర్ణమేదో గాదు. మానవుడి మనస్సు. ఈ మనస్సుకు గోచరించే ప్రపంచమూ అపరిపూర్ణమే. అంతేకాదు. వీటి కతీతమని భావించే ఈశ్వరుడూ అపరిపూర్ణుడే. కారణం. ఇవన్నీ విశేష రూపాలు Particulars. విశేషమెప్పుడూ పరిచ్ఛిన్నం Limited. వాటిని వ్యాపించిన సామాన్యమే Universal పరిపూర్ణం. ఒక విశేషం నుంచి మరొక విశేషం రాదు. సామాన్యంలో నుంచే అన్ని విశేషాలూ ఏర్పడతుంటాయి. దానితోనే నిండి ఉంటాయి. అందులోనే మరలా లయమయి పోతాయి. కనుక సామాన్యం కంటే విశేషాలు వేరు కావు. సామాన్యమే మన దృష్టికి విశేషరూపంగా భాసిస్తుంటుంది. సువర్ణాభరణాది దృష్టాంతాలలో ఇది మనం చక్కగా అర్థం చేసుకోవచ్చు. ఇంతకూ సామాన్యమే వస్తువు Reality. విశేషాలన్నీ దాని ఆభాసే Appearances కాబట్టి అపరిపూర్ణ మేదీ కాదు. అంతా పరిపూర్ణమే.

ప్రస్తుత మీ జీవజగదీశ్వరులనే మూడూ విశేషాలు గాబట్టి వాటి పాటి కవి అపరిపూర్ణం. ఎలాగంటే జీవుడంటే అది చిద్విశేషం. Particular Phase of consciousness దానికి గోచరించే జగత్తు సద్విశేషం. పోతే ఈశ్వరుడు గోడమీది పిల్లి. చిద్విశేషమైతే జీవుడి పక్షం. సద్విశేషమైతే జగత్తు పక్షం. ఇలా మూడూ విశేషాలైతే ఇక వీటన్నిటినీ వ్యాపించిన సామాన్య మేమిటి. 'అహమస్మి' నేనున్నాననే స్ఫురణే అది. నేను ఫలానా అనుకోవటం



Yalamanchili Brahmasri Rao www.advaitavedanta.in

కాదు. కాబట్టి చిద్విశేషం కాదిది. చిత్సామాన్యం. అలాగే ఫలానాగా ఉండడం కాదు కాబట్టి సద్విశేషం కాదు. సత్సామాన్యం, మూడింటిని వ్యాపించిన సామాన్యం గాబట్టి దీనికి మహా సామాన్యమని పేరు పెట్టారు శాస్త్రజ్ఞులు. దీనికే ఆత్మ అని కూడా నామాంతరం. సచ్చిద్రూపమిది. ఇందులోనే జీవ జగదీశ్వరులనే విశేషాలు మూడూ తరంగ బుద్బుద ఫేనాలు సముద్రంలో మాదిరి చేరి ఏకమై పోతాయి. కాబట్టి ఇక అపరిపూర్ణమనే గంధం కూడా లేదు. అంతా గలిసి ఏకైకమైన పరిపూర్ణతత్త్వం.

ఇది మనకు లభిస్తే చాలు. అదే మనకు పట్టే యోగం. సామాన్య విశేషాలు రెండూ కలిసి ఏకమైన దశ కాబట్టి అదే సమత్వం. ఈ దృష్టితో ఏ పని సాగించినా అది బంధకం కాదు కాబట్టి అదే కర్మసు కౌశలం. ఇందులో ఇక విశేషాల తాలూకు వృత్తులన్నీ వాటి పాటికవే తొలగిపోతాయి. కాబట్టి చిత్తవృత్తి నిరోధమూ ఇదే. ఆఖరుకిది పరోక్షంగా గ్రహిస్తే శాస్త్రజ్ఞానం. అపరోక్షంగా మారితే స్వానుభవం. ఇలాంటి పూర్ణమైన ఆత్మానుభవంలో ఆనాత్మ రూపమైన అనర్థం లేదు కాబట్టి ఇదే పురుషార్థం కూడా.

★★★

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# శివలీలా వైభవము

బ్రహ్మ - విష్ణు - శివ ఈ ముగ్గురు దేవతలనూ త్రిమూర్తులని పేర్కొంటాయి మన పురాణాలు. మూర్తి అంటే ఆకారం. నిరాకారమైన పరమాత్మ తత్త్వ మొక్కటే. అది మూడు ఆకారాలను ధరించి ముగ్గురు దేవత లయింది. సృష్టి చేయవలసి వచ్చి బ్రహ్మ అయింది. స్థితిని కాపాడవలసి విష్ణు వయింది. అలాగే దీని నంతటినీ లయం చేయవలసి శివుడయింది. అప్పటికి లయానికి సంకేతమే శివ తత్త్వం. నామరూప క్రియాత్మకంగా భాసించే చరాచర పదార్థాలన్నీ లయమయితే ఇక మిగిలే దేమిటి ? ఏది లయం చేసుకొన్నదో అది. ఇందులో లయమైనది శవమైతే లయకర్త ఇక శివం కాక తప్పదు. " న భూమి ర్నతోయం నతేజో నవాయుః" అని సృష్టి అంతా నశించినా సృష్టి కాధారమైన ఏ మూలతత్త్వ ముందో అది నశించదు. నశిస్తే శవం నశించకుంటే శివం. నశించే దానికి సాక్షి గనుక అది శివమే ఎప్పటికీ.

ఇలాంటి సాక్షి నీలో నాలో కూడ ఉన్నదిప్పుడు. అదే మన ఈ శరీరాన్ని దీ[illegible]చుట్టూ పరచుకొని ఉన్న ఈ ప్రపంచాన్ని నిత్యమూ గమనిస్తున్న మన జ్ఞానం. దీనికే 'చిత్' అని పేరు వేదాంతంలో. తానుండి గదా దేనినైనా గమనించ వలసింది. ఈ ఉండటానికే 'సత్' అని పేరు. అయితే ఈ మూడు మూరల జానెడు శరీరానికే పరిమితమై కనిపిస్తున్నవీ రెండూ మనకిప్పుడు. మనః ప్రాణేంద్రియాత్మకమైన ఈ సంఘాతానికి గణమని వ్యవహారం. గణానికి పతినని భావిస్తున్నాము కాబట్టి గణపతులము మనమంతా. ఇవి ప్రమధ గణాలు. నిత్యమూ మధిస్తూ మనలనీ సంసారం నుంచి పైకెదిగి చూడనీయటం లేదు. ఎదిగి చూస్తే కాని పరిమితమైన ఈ సచ్చిత్తులు పరిపూర్ణంగా దర్శనమివ్వవు. పరిపూర్ణమైన 'సత్ చిత్'ల సమాహారమే శివ

స్వరూపం. అవి నామరూపా లన్నింటినీ లయం చేసుకొని నిరాకారంగానే శేషించిన భావాలు గనుక లింగరూపం. రూపంగాని రూపమిది. శివలింగాని కిప్పుడు రూపమేముంది. శివతత్త్వాని కాది మధ్యాంతాలు లేవని చెప్పటానికే దాన్ని లింగరూపంగా భావన చేశారు మన పెద్దలు. లింగ మండాకారం. దానికేది మొదలు ఏది తుద అని నిర్ణయించలేము. భగవత్తత్త్వ మిలాంటిదే కదా. నిరాకార మైనప్పుడే ఆద్యంత రహిత మౌతుంది. అప్పుడే అది శివ మౌతుంది.

అలా కాక సాకారమని భావించినా శివమే అది. అప్పుడది అమూర్తమైన లింగం కాదు. మూర్తమైన శివ విగ్రహం. అష్టమూర్తి అదే. ఏమిటా అష్టమూర్తులు పృధి వ్యాదులైన పంచభూతాలు బాహ్యమైన రూపమైతే – మనో బుధ్యహంకారాలు మూడూ ఆంతరమైన జీవభావం. ఈ జీవ జగత్తులు రెండూ కలిసి అష్టమూర్తులు. ఇవి ఆ పరమాత్మ విగ్రహంలోనే లీనమై అందులో ఏకమై ఉన్నాయని భావం. ఆయన భస్మానులేపనం పృధివికి – గంగాజటా జూటం జలానికి – ఫాలనేత్రం తేజస్సుకు – నాగభూషణత్వం వాయువుకు – దిగంబరత్వం ఆకాశానికి సంకేతమైతే – చంద్రశేఖరత్వం మనస్సుకు – వృషభ వాహనం బుద్ధికి – గజచర్మధారణ మహంకారానికి చిహ్నాలు. మరి త్రిశూల ధారణం త్రిగుణాలు తన కధీనమై యున్నాయని తాను త్రిగుణా తీతుడని చెప్పటమే. పోతే అమ్మవారు శరీరాన్నే పంచుకొని ఉందంటే ఏమిటర్థం. చిద్రూపం శివతత్త్వమైతే – సద్రూపం శక్తి తత్త్వం. సచ్చిత్తు ల వినాభూతమైనవని చూపటమే అది. దానికి రూపకల్పనమే ఆయన అర్ధనారీశ్వరత్వం. ఇది పూర్ణరూపంలో శివశక్తులైతే – అపూర్ణ రూపంలో జీవతత్త్వం. మనలో అపూర్ణ రూపంగా ఉన్న శివశక్తులే మనః ప్రాణాలు. మనసు జ్ఞానశక్తి –

ప్రాణం క్రియాశక్తి. జ్ఞానమే చిత్తు ప్రాణమే సత్తు. ఇవి రెండే జీవుడనే గణపతి. దీనికి ద్యోతకంగానే శివాలయంలో శివలింగమూ పానవట్టమూ నిర్మించారు మన ప్రాచీనులు. పానవట్టం మీద లింగ ముందంటే మన దేహమనే దేవాలయంలో కూడ ప్రాణం మీద ఆధారపడే మనస్సుందని సంకేతం. ఇవి ఈ దేహం మేరకే పరిమితం చేసుకొని చూస్తున్నామిప్పుడు. ఇలాంటి చూపు ఉన్నంతవరకు మరణం తప్పదు మనకు. అంటే శవమైపోతాడే కాని మానవుడు శివమైన అమృతత్వాన్ని అందుకోలేడు. మరి వీడే పరిమితమైన ఈ గాణపత్యానికి స్వస్తి చెప్పి చూడ గలిగితే అవి రెండూ సచ్చి ద్రూపంగా పరిపూర్ణమై కనిపిస్తాయి. అప్పుడు అవి రెండు గావు అర్ధనారీశ్వరంగా ఒక్కటే తత్త్వం. శివశక్త్యైక్య రూపం. నామరూపాత్మకమైన ఈ విఘ్నయంత్రాన్ని ఛేదించి పోగలిగిన మహా గణేశునికే అది సిద్ధిస్తుంది. మహాబుద్ధితో దర్శించి అలాంటి మహా సిద్ధిని పొందాలి ఈ జీవుడనే గణేశుడు.

అది మనకు సాధన వల్ల సిద్ధించేదైతే ఆయనకు నిత్య సిద్ధం. తనకు భిన్నమైన సంసారాన్నంతా లయం చేసుకున్నది గనుక అది సచ్చి ద్రూపమే గాక ఆనంద రూపం గూడా. ఆనంద పారవశ్యంతో చేసేదే తాండవం. ఆనంద తాండవం. శివమైనదా తాండవం. శివ తాండవం. ఎక్కడ చూపుతాడా తాండవం. శ్మశానంలో. అంతా లయమైతే అది మహాశ్మశానం. కాశీకి మహాశ్మశానమని పేరు. అంతా లయమైనా తాను ప్రకాశిస్తూనే ఉన్నాడు. కాబట్టి అదే కాశీ కూడ అయింది. కాశి అంటే ప్రకాశించటమే. ఏమి చాటుతున్నది మనకీ సంకేతం. మీలోనూ ఉన్నదీ కాశి. మీ జ్ఞాన ప్రకాశం. మీలోనూ ఉన్నదా శ్మశానం. ప్రతిక్షణమూ పుడుతూ గిడుతూ ఉన్న మీరు చూచే ఈ ఉపాధి వర్గం. అది మీ శరీరమే కావచ్చు.

బాహ్యమైన విశ్వ శరీరమే కావచ్చు. అన్నీ నశ్వరమే. అవి నశ్వరమని భావిస్తూ మీ జ్ఞానంలో లయం చేసుకొని మీ శక్తిని మీరు మరలా వశం చేసుకొని ఎదిగి నన్ను చూడగలిగితే మీరు కోలుపోయిన సచ్చి ద్రూపాన్ని మరలా మీరు పరిపూర్ణంగా పొందగలరు. దానితో పాటు పరిపూర్ణమైన ఆనందాన్ని కూడా బడయగలరని ఆయన ఆనందతాండవం మనకు నిశ్శబ్దంగా బోధిస్తున్నది. ఆయన అట్టహాసం మనకు సశబ్దంగా చాటి చెపుతున్నది.

ఇది చెవిన పడనంతవరకూ గజాసురులమే మనం. గజ మహంకారానికి సూచకం. అహంకారమే జీవ లక్షణం. ఇది శవలక్షణమే కాని శివలక్షణం కాదు. దీన్ని తొలగించు కొనే సాధన చేయాలి మానవుడు. అది వీడికి సాధ్యం కాక పోతే కరుణాళుడైన ఆయనే తొలగిస్తాడు. అప్పుడ సురసంపద నశించి దైవ సంపదతో ఆ శివ తత్త్వం దర్శన మిస్తుంది. ఇదే గజాసుర సంహారం. మనలో ఉన్న గజాసురుడు పోతే మనకున్నది ఇక నందికేశ్వరుడే. నంది అంటే వృషభం ద్వారపాలకుడది. మోక్ష ద్వారాన్ని కాస్తున్నది. వృషభం ధర్మానికి సంకేతం. అర్థ కామాల లాగానే ధర్మం కూడా లయ స్వరూపమైన మోక్షానికి ప్రతి బంధకం. మోక్ష ద్వారాని కడ్డు తగులుతున్నదది. దానికి కాలం తోడ్పడుతున్నది. సమస్తాన్ని హింసించేది కనుక అది సింహం. రెండూ కలిసి నివసిస్తున్నాయి కైలాసంలో. అంటే సహస్రార రూపమైన మన బుద్ధిలో. వాటి అడ్డు తొలగించుకొని ముందుకు సాగిపోవాలి మానవుడి బుద్ధి. దానికి గొప్ప ధైర్య సాహసాలు కావాలి. అలాంటి జీవుడెవడో వాడు మార్కండేయుడు. "మనుష్యాణాం సహస్రేషు" అన్నట్టు కోటికొక డుంటాడు అలాంటి పట్టుదలగల సాధకుడు. పట్టుదల మాత్రమే ఉంటే ప్రయోజనం లేదు. పట్టుకోటానికొక ఆలంబన ముండాలి.

అది శివలింగమా కాదు, శివాకారవృత్తే అసలైన శివలింగం. " లీనం గమయతీతి లింగం" అది అఖండమైన జ్ఞానం.

మార్కండేయుడు శివలింగాన్ని పోయి వాటేసు కొన్నాడంటే ఏమిటీ కథ ? ఏమి చెబుతుంది మనకు ? మార్కండేయుడు మృకండు మహర్షి కుమారుడు. పరమేశ్వర వరప్రసాద సంభూతుడు. కాని 16 ఏండ్ల వయస్సుకే కాలధర్మం చెందవలసి ఉందా కుఱ్ఱవాడు. దానికి ప్రతీకారం చేయాలని పోయి శివలింగాన్ని పట్టుకున్నాడు. యముడు వచ్చి కాలపాశం మెడకు తగిలించాడు తీసుకుపోవాలని. కాని శివలింగం వాటేసుకున్నాడు గనుక శివుడు ప్రత్యక్షమై కాలుణ్ణి పారదోలి అజరామరుణ్ణి చేశాడా బాలుణ్ణి.

పదహారేండ్లేవో కావు. షోడశ కళాత్మకమీ ప్రపంచమే. దీనితో సంబంధం కాలం వల్లనే. అది తెగేది మనకు కాలం వల్లనే. అదే మృత్యువు. అదే కాలపాశం. కాలమనే పాశం. దాన్ని తప్పించుకొనే సాధనమే శివలింగా లింగనం. శివమైన తత్త్వాన్ని ప్రకాశింపజేసే భావనే శివలింగం. దాన్ని నిరంతరం గట్టిగా పట్టుకొని కూచుంటే మృత్యుభయం లేదు మానవుడికి. అమృతత్వాన్నే ప్రసాదిస్తుంది.

అమృతమనేది ఎక్కడ ఉంది. అది సంసారంలోనే ఉంది. విషం లాంటి మృత్యువూ ఉంది ఇందులో. అమృతంలాంటి జీవితమూ ఉంది. మన జీవిత సాగరాన్ని మథిస్తే చాలు. రెండూ ప్రత్యక్ష మౌతాయి మనకు. ఒకటి మనకు ప్రతికూలం మరొకటి మనకు అనుకూలం. అనుకూలమే వాంఛనీయమైనా అది ప్రతికూలం పని చేస్తున్న వరకూ పూర్తిగా లభించదు. దానికి జవాబు చెబితేనే పూర్ణ సుఖానుభవం. ఏమిటది ? ఎలాగా ? హాలాహలం లాంటి కాలాన్ని కబళించి కాలాతీతమైన శివతత్త్వమే నా

స్వరూపమని గుర్తు చేసుకోవటమే పరిష్కారం. ఇదే సముద్రమథన వృత్తాంతంలోని సంకేతం. శివుడు హాలాహలాన్ని భక్షించి మృత్యుంజయు డయ్యాడంటే ఏమిటీ భావం ? అందరూ అన్నీ విలువైన వస్తువులు పోగు చేసుకొంటే ఆయన భయానకమైన విషాన్నే భక్షించాడు. నీవీ ప్రాపంచికమైన వస్తు వాహనాలెంత నీ కనుకూలమని దగ్గర ఉంచుకున్నా సుఖంలేదు. మృత్యువును జయించే రహస్యం నీకు బోధపడితేనే జీవితానికి విజయమని చాటటమే కదా దాని తాత్పర్యం.

నిజమైన విజయం నశ్వరమైన సంసార సుఖాలు పోగుచేసుకొని అనుభవించటంలో లేదు. అవి ఎలానశ్వరమో వాటి అనుభవమూ నశ్వరమే. కనుక భోగం కాదు కోరవలసింది మానవుడు త్యాగం. తేనత్యక్తేన భుంజీథాః అని చాటుతున్న దుపనిషత్తు. త్యజిస్తూ భుజించాలట మనం. త్యజించ వలసిం దేమిటి ? భుజించే దేమిటి క్షణ భంగురమైన ప్రాపంచిక విషయాలను త్యజించాలి. శాశ్వతమైన పారమార్థిక సుఖాన్ని భుజించాలి. ఇక్కడ త్యాగబుద్ధి ఉంటే కాని అక్కడ భోగానుభవం ప్రాప్తించదు, అందుకే విష్ణువు భోగానికైతే శివుడు త్యాగానికి ప్రాతినిధ్యం వహించాడు. భోగత్యాగాలు రెండూ వేరుకావు. పైకి వేరుగా కనిపిస్తాయి కాని ఆంతర్యంలో రెండూ ఒకటే. నీకు భిన్నమనే భావాన్ని త్యజిస్తే ప్రతి ఒక్కటి నీస్వరూప విభూతేనని అనుభవానికి వస్తుంది. అప్పుడీ త్యాగమే భోగ మనిపించు కుంటుంది, శివ కేశవుల కప్పుడు భేదమే లేదు. పరమాత్మ ప్రపంచంగా కనపడటమే స్థితిరూపమైన విష్ణుతత్త్వం. అది తన కభిన్నంగా భావించి అందులో లయం చేసుకోటమే శివతత్త్వం. ఈ భేదాభేదరూపమైన దొకే ఒక పరమాత్మ చైతన్యం.

అష్టమూర్త్యాత్మకమైనా అదే. అమూర్తమైనా అదే. స్వరూపంగా భావిస్తే అమూర్తం. విభూతిగా దర్శిస్తే అష్టమూర్త్యాత్మకం. ఇలా రెండు భూమికలలో విభక్తమై భాసించటమే లీల. శివమైన లీల. గనుక శివలీల. దాన్ని దర్శించి శివసాయుజ్యాన్ని పొందగలగటమే మానవ జీవిత లక్ష్యం. ఐతే అది క్రొత్తగా సాధించేది కూడా కాదు. మొదటి నుంచీ మనకు స్వభావ సిద్ధమనే చాటి చెప్పారు పెద్దలు. కంఠచామీకర న్యాయంగా మరచిపోయిన మన శివ స్వరూపాన్నే మరలా మనం గుర్తు చేసుకుంటున్నాము. అంతమాత్రమే. మరచి పోవటాని కేమిటి కారణం ? ప్రాపంచికమైన మానవుడి కామం. అది ఆ శివతత్త్వానికి దూరం చేస్తున్నది మనలను. దానికి మారుగా ఈ ప్రమథ గణానికి ఆధిపత్యమిచ్చి శివత్వానికి మారుగా శవత్వాన్ని ఆపాదించింది. కనుక ఈ కామ పిశాచాన్ని దగ్ధం చేసి ప్రపంచంగా కాక దీన్ని మన చైతన్య విభూతిగా దర్శించాలి. ఆ దర్శనమే మోక్షం. శివుడు తన నేత్రాగ్నిలో కాముణ్ణి దహించివేసి తదీయభస్మం విభూతిగా తన శరీరంలో అలదుకున్నాడని వర్ణించిన పౌరాణికమైన గాథ ఈ గొప్ప రహస్యాన్నే మనకు చాటి చెపుతున్నది. ఇలా భావన చేసిన మానవుడు కామదహనం చేసి తానూ కామేశ్వరుడై కామేశ్వరి అయిన తనశక్తిని తనకు వశం చేసుకొని పశుత్వం నుంచి విముక్తుడై పశుపతిత్వాన్ని అందుకోగలడు. పాశుపతమైన ఈ దీక్ష మనకుంటేచాలు. పశుపతి అనుగ్రహమెప్పుడూ మనకు లభిస్తుంది. తిరోధాన, అనుగ్రహాలు రెండూ ఆయన చేతిలో ఉన్నాయి. తిరోధానంతో శివుడే జీవుడయ్యాడు. అనుగ్రహంతో మరలా జీవుడైన తానే శివుడై భాసించాడు. ఇదే శివ లీలా వైభవం.

★★★

Yalamanchili Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

# జననము - మరణము

మానవుడు పుట్టినప్పటి నుంచీ అతని కెదురైన సమస్య ఇదే. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆలోచిస్తూనే ఉన్నాడు దీన్ని. ఆలోచించేవాడీ సృష్టిలో ఒక్క మానవుడే. మనస్సున్న వాడు గదా మానవుడంటే. మనసుకుండే లక్షణం ఆలోచించటమే. ఎన్నో ఆలోచించాడు - అన్వేషించాడు - పరిష్కరించాడు మానవుడు. అయితే అన్నీ ఒక ఎత్తు. ఇది ఒక ఎత్తు. ఆలోచనకే అందనిదీ సమస్య. ఉపనిషత్తులే ఏకరువు పెడుతున్నాయి. నచికేతుడనే కుర్రవాడు యమలోకానికి వెళ్ళి యముణ్ణే నిలదీసి అడిగాడట - పుట్టుకేమిటి చావేమిటి చెప్పమని. కఠోపనిషత్తులో చర్చించిన విషయమంతా ఇదే. ఇది చాల దన్నట్టు భారతంలో సనత్సుజాతీయ మంతా దీన్నే చిలువలు పలువలు పెట్టి వర్ణించింది. అసలు ఛాందోగ్యంలో బృహదారణ్యకంలో మృత్యు విచారమెంతో దూరం చర్చించబడింది. ఆ మాటకు వస్తే భగవద్గీత ఈ సమస్యను పరిష్కరించటానికే గదా అవతరించింది.

ఇంతకూ ఎందరెన్ని విధాల విచారిస్తూ వచ్చినా సమస్య సమస్యే ఇప్పటికీ. మానవుడీ జన్మించట మేమిటి. మరణించటమేమిటి. జనన మరణాలయినా మనకు కనిపిస్తున్నాయి. చూస్తున్నాము. కాని మరణించిన తరువాత ఏమి జరుగుతున్నదో - మనమేమయి పోతామో అసలే అంతు పట్టటం లేదు. మరి ఇంతేనా ఇది - దీనికి పరిష్కారమే లేదా అంటే నూటికి తొంభై తొమ్మిది మతాలు చేతులెత్తాయి. కాని ఒకే మతం మాత్ర మలాకాక ధైర్యంగా ఎదుర్కొని తేల్చివేసిందీ విషయం. అదేదో గాదు. అద్వైత

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

మతం, అద్వైతు లొక్కరే దీన్ని చాలా చమత్కారంగా పరిష్కరించ గలిగారు. వారు చేసిన పరిష్కారమేమంటే ఒక దృష్టిలో ఈ నాలుగూ ఉన్నాయి. మరొక దృష్టిలో ఏదీ లేదు. మొదటిది భేదదృష్టి అయితే రెండవది అభేద దృష్టి, ఆత్మా అనాత్మ అని చూస్తే అది భేద దృష్టి, నేననే జ్ఞాన మొకటి - దానికి గోచరించే జ్ఞేయ మొకటి - ఇవే ఆత్మానాత్మలు. నీవు జగత్తను. జీవులను. ఆఖరుకు ఈశ్వరుడను. ఇదంతా జ్ఞానానికి గోచరిస్తున్నదే. కనుక అనాత్మ క్రిందికే వస్తుంది. కాగా వీటన్నిటినీ గమనించే జ్ఞానమే ఆత్మ అంటే.

ఈ ఆత్మానాత్మ భేదం చూస్తున్నంతవరకూ నీవూ ఉన్నావు. నీ సమస్యలూ ఉంటాయి. జననమరణా లేమిటని నీవడుగుతున్నా వంటేనే అవి నాకంటే వేరుగా ఉన్నాయని భావించే అడుగుతున్నావు. భావించావు గనుక వేరుగానే కనపడుతుంటాయి. కనపడే కొద్దీవాటికి పరిష్కార మేమిటా అని నీ అన్వేషణ. అన్వేషణ చేసే దెప్పుడూ నీ మనస్సే. అది నీ కొకడికే కాదు. ఎంతో మందికుంది. ఒక డూహించినట్టు వేరొక డూహించడు. ఒకడికే ఒకప్పుడున్న ఆలోచన ఒకప్పుడు లేదు. అసలూహించే శక్తి కూడా దానికి పరిమితమే. పరిపూర్ణం కాదు. కనుకనే కొందరు మరణానంతర మేదీ లేదు పొమ్మంటే - కొందరు లోకాంతరాలు జన్మాంతరా లున్నాయంటే - మరి కొందరు లోకాంతరాలున్నవే గాని జన్మాంతరాలు లేవంటే - కొందరీ మానవుడి కంతకంత కుత్కృష్టమైన జన్మలే వస్తాయి గాని నికృష్టమైనవి రావంటే - అలా కాదు చేసుకొన్న పుణ్య పాపాది కర్మల తారతమ్యాన్ని బట్టి పైకే గాక క్రింది స్థాయికి కూడా దిగజార వచ్చునంటే - ఇలా రకరకాల అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. మన పురాణేతి

హాసాలలో స్వర్గ నరకాది లోకాలను - వాటిని చేరే అర్చిరాది మార్గాలను - ఆయాలోకాలలో కలిగే అనుభవాలను - తదనంతరం మరలా ఈ కర్మ భూమిలో ఏ ఏ జన్మలెత్తాలో అవి - వన్నె చిన్నెలు పెట్టి వర్ణించారంటే అదంతా ఈ భేద దృష్టిని బట్టి చేసిన వర్ణనే. పరిష్కారమే. ఇదే యథార్థమని భావించామో మనకర్మ కాండ అంతా మన కనివార్యమే అవుతుంది. జాతాశౌచం దగ్గరి నుంచి మృతాశౌచం వరకు అంతా పాటించ వలసిందే. శరీరమే పోతుంది గాని జీవుడు పోడు. వాడీ దేహాన్ని వదిలేసి తన కర్మ కనుగుణమైన లోకాలకు ప్రయాణం కడతాడని - మరలా ఒక దేహం ధరించే లోపు అతనికి మనం చేయవలసిన క్రతువులన్నీ ఇహంలో చేసితీరాలని - చేస్తే వాటి ఫలితమా జీవికి చెందుతుందని - ఇలాటి అనుష్ఠాన మంతా పాటించక తప్పదు.

పోతే భేద దృష్టితో కాక రెండవదైన అభేద దృష్టితోనే చూడగలిగితే ఈ చెప్పుకున్నదంతా ఏదీలేదు. అంతా వట్టి అబద్ధమని తేలిపోతుంది. కారణమేమంటే ఈ అభేద దృష్టికి అంతా ఆత్మ స్వరూపమే. అనాత్మ ప్రపంచమంటూ దానికి వేరుగా మరొకటి ఏదీ లేదు. అంతా నేనని భావిస్తే ఇహ పరాలు లేవు. తోటి జీవులు లేరు. వీటికి నియామకుడని భావించే ఈశ్వరుడు లేడు. ఆత్మ చైతన్యంలోనే అన్నీ సమసి పోతాయి. అలాంటప్పుడిక జననమేమిటి, మరణమేమిటి. ఎక్కడ ఉన్నాయవి. అవీ నా స్వరూపమే. ఒక వేళ నాకు చెందిన వనుకున్నా పరవాలేదు. అవి దశలే అవుతాయి. గాని నేను గాను. దశలు మారినా దశానాథుడు మారడు. ఇంతెందుకు. ఒక చెరువులో నీరు కదలకుండా నిశ్చలంగా ఉంటుంది. అందులో ఒక రాయి వేశావంటే కదలిక ఏర్పడుతుంది. కొంతసేపు అలాగే ఉండి అది

మరలా నిశ్చలమైన స్థితికి వస్తుంది. ఇప్పుడా నీరు కదలటం కదలక పోవటమనేవి నీరు కావు. నీటి దశలు. అవి వస్తున్నా పోతున్నా నీటికి హాని లేదు. వాటి వల్ల తరిగి పోదది పెరిగి పోదు.

అలాగే ప్రస్తుతమీ జననమరణా లనేవి కూడా జీవుడికి కలిగే దశలే గాని జీవ స్వరూపం కావు. స్వరూపం చైతన్యమే గదా జీవుడికి. అది రాదు పోదు. నిత్య సిద్ధమది. పుట్టినప్పటి నుంచి గిట్టే దాకా అది అలాగే అనుస్యూతంగా వస్తూనే ఉంది. ఎలాటి మార్పూ లేదు. నా శరీరం చలిస్తున్నది. ప్రాణం చలిస్తున్నది. చక్షురాది ఇంద్రియాలు చలిస్తున్నాయి. మనసులో భావాలు వస్తూ పోతున్నాయి. కాని వీటి రాకపోకలు నిత్యమూ గమనిస్తూ ఉన్నదా నేననే స్ఫూర్తి. తాను మారకుండా ఈ మార్పులను గుర్తిస్తున్నదది. కనుక జనన మరణాలు వీటికే గాని దానికి లేవు. దీనిని బట్టి రేపు మరణం కూడా ఈ శరీరాది ఉపాధులకే గాని నిరుపాధికమైన నా స్వరూపానికి లేదని అర్థం చేసుకోవచ్చు. దృష్టాన్ని బట్టే అదృష్టాన్ని నిర్ణయించ మన్నారు పెద్దలు. దృష్టం శరీరాదుల రాకపోకలు. వీటిని గమనించే చైతన్యం కూటస్థంగా నిలిచి ఉండడం. అంచేత జననమైనా మరణమైనా నా ఈ కలాపానికే గాని నాకు గాదు. జననమరణా లంటే చలనమే గదా. చలనమే మార్పు. మార్పులను గమనించే దెలా మారగలదు, మారకుంటే అది ఎలా మరణించగలదు.

అందుకే నిజానికి పూర్వమూ ఉన్నాము మనం. మరణానంతరమూ ఉంటాము. నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః - అని చాటుతున్నది. భగవద్గీత. లేనిది రాదెప్పుడూ. ఉన్నది పోదు. మహా అయితే అవ్యక్తం వ్యక్తమయి కనిపిస్తున్నది. వ్యక్తమే మరలా అవ్యక్తమై పోతున్నది. ఆకాశంలో

సూర్యమండల మిప్పుడు ప్రకాశిస్తున్నది. అది సాయంకాల మయ్యే సరికి అస్తమిస్తుంది. కంటికి కనపడకుండా పోతున్నది. అది మనం మరణమనుకొంటే ఎలాగా. మనకు కనిపించకున్నా మరొక దేశవాసులకు గోచరిస్తుంటుంది. తెల్లవారితే మరలా మనకే దృగ్గోచర మవుతుంది. అప్పుడది క్రొత్తగా ఉదయించిం దనుకొంటే ఎలాగా. ఉదయాస్తమయా లనగూడదు వీటిని. వ్యక్తావ్యక్తా లనాలి. అవ్యక్తంగా ఉందది మొదట. అదే వ్యక్తమయి గోచరించింది. మరలా అవ్యక్తంగా మారిపోతున్నది. మూడు దశలలో ఉండటమేమో ఉంది. ఎప్పుడూ లేకుండా పోలేదు. అయితే ఆద్యంతాలలో కనపడకుండా ఉంది. అదే అవ్యక్తం. మధ్యలో కనపడుతూ ఉంది. అదే వ్యక్తం. అవ్యక్తాదీని భూతాని - వ్యక్తమధ్యాని భారత - అవ్యక్త నిధనాన్యేవ - అని భగవద్గీత చాటిన మాటలలోని అంతరార్థమిదే.

ఇదుగో ఈ వ్యక్తావ్యక్తాలనే జనన మరణాలని మనం వ్యవహరిస్తున్నాము. ఒక జీవి జన్మించాడంటే వాడంతకుముందు ఎక్కడా లేక అప్పటికప్పుడు ఆవిర్భవించాడని కాదు. అలాగే మరణించా డంటున్నా మంటే ఎక్కడా లేకుండా సర్వనాశనమై పోతున్నాడని కాదు. అంతకు ముందు అసలే లేని ఆ జీవి ఎలా వచ్చాడు. ఉన్నాడప్పుడూ. అయితే అతి సూక్ష్మంగా ఉన్నాడు. అలాగే పోయాడంటే మరలా ఆ సూక్ష్మావస్థలోనే ఉన్నాడను కోవాలి మనం. అంతేగాని అసలే లేకపోవడం కాదు. జీవాపేతం వావ కిలేదం మ్రియతే - నజీవో మ్రియతే అని ఉపనిషద్వాణి, జీవుడు నిష్క్రమిస్తే శరీరం మరణిస్తున్నదే గాని జీవుడు కాదట మరణించటం.

జీవుడే మరణించడం లేదంటే ఇక ఆత్మ ఎలా మరణించగలదు. మనస్సు ప్రాణమనే ఉపాధులతో చేయి కలిపిన చైతన్యమే జీవుడంటే.

చేయి కలిపిన నేరానికవి తొలగిపోతే ఇదీ వాటితో పోవలసి వస్తున్నది. అవి లోకాంతరాలకు వెళ్ళుతుంటే తానూ వెళ్ళవలసి వస్తున్నది. అవి మరలా ఒక స్థూల శరీరంలో వచ్చి ప్రవేశిస్తే తాను ప్రవేశించ వలసి వస్తున్నది. కారణం వాటి ద్వారా తాను చేసుకొన్న పుణ్యపాపాది కర్మలే. ఒక కర్మచేశావంటే దానికి తగిన ప్రతిఫలం ఉండి తీరుతుంది. అది నేను చేశాను - నా కోసమని చెప్పి దానిని జీవుడు అభిమానించాడు. కాబట్టి తప్పకుండా అది వీడి మెడకు చుట్టుకొంటుంది. అభిమానించిన నేరానికి ఎక్కడో ఒక చోట ఏదో ఒక ఉపాధిలో చేరి దానినీ మనః ప్రాణాల ద్వారానే అనుభవించి తీరాలి. ఆ అనుభవించటానికి ఈ ఉపాధిలోకి రావడమే జీవుడి జన్మ. చేసిన కర్మలో ప్రారబ్ధం తీరే వరకు అనుభవిస్తూ కూచోటమే జీవనం. అది తీరటమే మరణం. అది తీరినా మరలా సంచిత కర్మ ఫలాన్ని అనుభవింటానికే లోకాంతర గమనం. దానిలో నుంచి మరలా ప్రారబ్ధమైన కర్మ ఫలాన్ని చవిచూడటానికే జన్మాంతరం. ఇలా ఒక విష వలయమిది జీవుడి పాలిటికి.

ఇలాటి జీవుణ్ణి మనస్సులో పెట్టుకుని చెప్పినప్పుడు కూడా జనన మరణాలు లేవు వాస్తవానికి. కర్మ చేయటానికి ఫల మనుభవించటానికి జీవుడుండ వలసిందే గదా. చేయటానికి శరీరంలో ప్రవేశిస్తాడు. అనుభవించటానికి కొంత కాలమందులో జీవిస్తాడు. అనుభవం తీరగానే మరలా ఒక అనుభవం కోసం ఈ శరీరాన్ని విడిచి వెళ్ళుతాడు. కాబట్టి ప్రవేశించక ముందూ వెనుకా అతడు ఉండక తప్పదు. కాబట్టి జనన మరణా లతనికి చెప్పరాదు. అప్పటికి మనం చెప్పుకొనే జనన మరణాలు జీవుడివి గావు జీవుడి ఉపాధివి. అయినా ఉపాధితో తాదాత్మ్యం చెందిన

చైతన్యం గనుక ఈ స్థూల శరీరం పట్టు వదిలినా మరొక సూక్ష్మ శరీరం దానికి తగులుకొని ఉంటుంది. మనః ప్రాణాలే ఈ సూక్ష్మ శరీరం. రక్త మాంస చర్మాస్థి మయమైన స్థూలం లాగా ఇది కంటికి గోచరం కాదు గనుక దీన్ని సూక్ష్మమన్నారు. జీవుడి అస్తిత్వాన్ని ఇది మనకు పట్టి ఇస్తుంది కాబట్టి లింగమని కూడా పేర్కొన్నారు. స్థూలం రేపు పడిపోగానే ఇది బయటికి వస్తుంది. దీనితో పాటు దీని నభిమానించే జీవుడు కూడా బయటికి వస్తాడు.

ఉత్క్రమణ మంటే ఇదే. మనసు దారి చూపుతుంటే ప్రాణం కదలి పోతుంటుంది. అది జీవుణ్ణి ఆయా లోకాలకు తీసుకెళ్ళుతుంది. కర్మణా పితృలోకః కేవల కర్మాచరణులు ధూమ మార్గంలో పితృలోకం చేరితే విద్యయా దేవలోకః ఆయా దేవతల నుపాసించిన వారు జ్యోతిర్మార్గంలో ఆయా దేవలోకాలు చేరుతారు. రెండూ గాక నిషిద్ధ కర్మలు చేసిన వారైతే సరాసరి యమలోకానికి పోయి రౌరవాది నరకా లనుభవిస్తారు. దేవలోకాలలో వారికి భోగ శరీరమైతే - నరకంలో యాతనా శరీర మొకటి సంక్రమిస్తుంది వారికి. వారికా అనుభవాలన్నీ పూర్తి అయి మరలా జన్మ ఎత్తేవరకూ వారికీ ఈ కర్మభూమిలో ఉండే మనకూ కానరాని సంబంధ మొకటి ఉంటుంది. అది మనః ప్రాణాల వల్ల ఏర్పడింది. కనుక ఆ వంశంలో వారి రక్తం పంచుకొని పుట్టిన మనమంతా వారికి ఋణపడి ఉన్నాము. మనః ప్రాణాల వల్ల వారికి క్షుత్పిపాస లేర్పడుతాయి కాబట్టి అవి నివారించటానికి పిండప్రదానమూ జలతర్పణమూ చేయవలసి ఉంది మనం. స్థూల దేహం లేక వాయు రూపంగా నగ్నమై ఉంటారు. కాబట్టి వస్త్ర దానం కూడా చేయాలని మన భావన.

ఇదంతా ధర్మ పురుషార్థం క్రిందికి వస్తుంది. చైతన్యం మనః ప్రాణాలనే ఉపాధులమేరకు ఉందనేంతవరకు అది ధర్మక్షేత్రం. ధర్మమంటే పట్టుకొని కూచున్నదని అర్థం. కర్మ కర్మ ఫలం అనుభవం పట్టుకొనే ఉంటాయి మనలను. అవి ఉన్నంతవరకూ జీవ భావం తప్పదు. జీవ భావం ఉన్నంతవరకూ జనన మరణాలు జీవుడికి చెప్పరాదు. జీవుడే మరణిస్తే లోకాంతరాలకు వెళ్ళవలసిన వాడెవడు. సుఖదుఃఖాలు అనుభవించ వలసిన వాడెవడు. మరలా జన్మించ వలసిన వాడెవడు. యోని మన్యే ప్రపద్యంతే – శరీరత్వాయ దేహినః – స్థాణుమన్యే ప్రపద్యంతే యధా కర్మ యధా శ్రుతం అని శాస్త్రమే ఘోషిస్తున్నది. కాబట్టి ప్రారబ్ధం తీరగానే శరీరం పోవలసిందే గాని శరీర ధారి అయిన జీవుడు పోడు. ఇది కాకుంటే మరొకటి ధరించి ఉంటాడు. ఏ శరీరమూ లేనప్పుడే జీవ భావం తొలగి పోయేది. శరీరమంటే అది స్థూలమే గాదు సూక్ష్మం కూడా అని చెప్పాము. స్థూలం పోయినా సూక్ష్మముంటుంది. సూక్ష్మం కూడా పోవాలంటే దానికి నిమిత్తమైన కారణ శరీర మొకటుంది. అది పోవాలి. అదేదో గాదు. మానవుడి అజ్ఞానమే. జ్ఞానం లేకపోవటమే అజ్ఞానం. ఆత్మానాత్మలు రెండూ ఆత్మ స్వరూపమే అని భావించటమే జ్ఞానం. ఇది లేనందువల్లనే ఆత్మ అనాత్మ అనే భేద దృష్టి ఏర్పడింది. అదే జీవభావానికి జనన మరణాదులకు దారితీస్తున్నది.

పోతే ఇప్పుడీ భేద దృష్టికి స్వస్తి చెప్పి అంతా ఆత్మేనని అభేద దృష్టి నలవరుచుకో గలిగితే అది జ్ఞానం. అజ్ఞానా వస్థలో జీవుడు జనన మరణాలు అన్నీ ఉంటే – జ్ఞానావస్థలో ఏ ఒక్కటీ లేదు. అక్కడ శరీరమనః ప్రాణాలనే ఉపాధులతో సంబంధముంది కాబట్టి వాటి వల్ల కలిగే జనన మననాదులు

కూడా ఉన్నాయి. పరమార్థంలో కాకపోయినా వ్యావహారికంగా నైనా ఉండితీరుతాయి. మరి ఇక్కడ ఆ ఉపాధులు కూడా స్వరూపంగానే భాసిస్తాయి కాబట్టి తన్నిమిత్తమైన జనన మరణాదుల ఊసే లేదు. అవి కూడా ఆత్మ స్వరూపమే . దీనికే అశరీర మమృతమని పేరు పెట్టింది శాస్త్రం. అశరీర మన్నప్పుడిక మరణం లేదు. నతస్య ప్రాణా ఉత్క్రామంతి. వాడి ప్రాణాలు ఉత్క్రమణ చెందవు. సముద్రంలో తరంగాలలాగా వాడి చైతన్య సాగరంలోనే అణిగి పోతాయట. మరణ మనేది అందరికీ సంభవిస్తున్నట్టు కనిపిస్తుంది మనకు. అయితే అది ఒక్కొక్కరి కొక్కొక్క విధం. చివరకు ప్రయాణమనేది అందరికీ సమానమే. ఉపాధి ఉన్నప్పుడు అది పోవలసిందే గదా. అయితే అది ఒక హనుమాన్ జంక్షను లాంటిది. నాలుగు దారులున్నాయి అక్కడ.

అందరూ ఒక దారిలో కాక నలుగురూ నాలుగు దారులలో ప్రయాణమై పోతారు. అతి నికృష్టంగా బ్రతికి పోయిన వారు యమలోకానికి. సత్కర్మలు చేసిన వారు పితృలోకానికి. ఆయా దేవతోపాసకులు దేవలోకాలకు. పోతే సగుణబ్రహ్మోపాసకులు నేరుగా సత్యలోకానికి. ఈ నాలుగవ వారు మాత్రం వెనక్కు రారు మరలా. బ్రహ్మదేవుడితో పాటు నిర్గుణ జ్ఞానాన్ని అభ్యసించి క్రమంగా ముక్తులయిపోతారు. దీన్నే క్రమముక్తి అని పేర్కొంటారు. మిగతా ముగ్గురికి మాత్రం పునరావృత్తి తప్పదు.

పోతే ఈ నలుగురు గాక ఇంకొక రున్నారు. వారే జ్ఞానులు. వారు తమ ఆత్మ చైతన్యాన్నే సర్వత్రా దర్శిస్తుంటారు. సర్వమూ అదేనని చూస్తుంటారు. వారికి జీవుడైనా నేనే. జగత్తయినా నేనే. ఈశ్వరుడైనా నేనే. అంతా నేనే. నాదంటూ లేదూ వారికి. అలాంటప్పుడు మరణ మేముంది.

జనన మేముంది. కదలికనేది ఉంటే గదా అవి రెండూ. కదలికంటే ఒకటి వదిలేసి వేరొకటి పట్టుకోవడం. అంతా స్వరూపమే అయినప్పుడు ఒకటి వదిలేయటమే లేదు. సముద్రంలో తరంగాల లాగా సర్వమూ వారి చైతన్యం లోనే కరిగి పోతాయి. కనుకనే వారి ప్రాణాలు ఉత్క్రమణ చెందవని చెప్పటం. స్థితే గాని గతి లేదు జ్ఞానుల విషయంలో.

అయితే జ్ఞానులు కూడా నలుగురితో పాటు మరణిస్తారని చెప్పారే. ఆ మాటకర్థ మేమిటి. అది జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి మనం. మరణించట మనేది వాస్తవమే కాని ఆ మరణించేది జ్ఞాని కాదు. అతని ఉపాధి. ఉపాధి అంటే శరీర మనః ప్రాణ కర్తృత్వ భోక్తృత్వాది సంఘాతం. ఇదెక్కడిది. ఇది ఆ జ్ఞాని చైతన్యం తాలూకు ఆభాస. చైతన్యం వెలుగైతే ఇది ఆ వెలుగు చిమ్మిన నీడ. నీడకు వేరే అస్తిత్వం లేదు. వెలుగు ప్రసరిస్తే అది వెలుగే అయిపోతుంది. ప్రసరించనంత వరకే అది దానికి విజాతీయంగా కనిపిస్తుంది. జ్ఞాని జీవితాంతమూ తన చైతన్య జ్యోతినే తన స్వరూపమని భావిస్తూ దానికేది గోచరిస్తున్నా అది ఆ జ్యోతిశ్చక్రంలో ఒక కిరణం లాగా దర్శిస్తుంటాడు. కాబట్టి అంతా జ్యోతిస్సే. తమస్సు లేదా దృష్టికి. అంటే ఆత్మే గాని అనాత్మ స్పర్శే లేదని అర్థం. లోకుల దృష్టికే వాడూ వాడి శరీరమూ వేరుగా కనిపిస్తాయి. వాడి దృష్టికంతా స్వరూపమే. ఇంతెందుకు. ఒక మహాసాగరాని కెదురుగా నిల్చొని చూస్తుంటే ఎలా కనిపిస్తుంది. జలంగానే కాక తరంగాలుగా బుద్బుదాలుగా ఫేనంగా తుషారంగా భిన్న భిన్నంగా గోచరిస్తుంది. కాని అది చూచే మనబోటి వారి దృష్టికే. మరి దాని దృష్టికో. ఇవి ఏవీలేవు. అన్నీ కలిసి ఏకంగా జలమే.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

ఒకవేళ భిన్నమని చూచినా వాటికి ప్రత్యేకమైన ఉనికి లేదుగదా భయమేమి. మనస్వప్నమే మనకిక్కడ మంచి నిదర్శనం. స్వప్నంలో చిత్రవిచిత్రమైన ప్రపంచం కనిపిస్తుంది మనకు. ఎక్కడ ఉందది. ఏమిటది. ఎక్కడా లేదు. ఏమీ గాదు. అంతా మన స్వరూపమే. స్వరూపమే తెలియక చూస్తే జ్ఞానమే జ్ఞేయమై కనిపిస్తుంది. భిన్నంగా భాసిస్తుంది. సుఖదుఃఖాలను ఆపాదిస్తుంది. అదే తెలిసి చూస్తే జ్ఞేయమంతా జ్ఞానంగా మారి అఖండమైన ఆత్మానుభవాన్ని ప్రసాదిస్తుంది. ప్రస్తుత మీ జనన మరణాది భావాలన్నీ జ్ఞాన దృష్టికి ఒక స్వప్నంలాగా ఆ భాస. స్వతంత్రమైన ఉనికి లేదు దానికి. మన ఉనికే దాని ఉనికి. పోతే అజ్ఞాని దృష్టికి జననమూ ఉంది మరణమూ ఉంది. అంతా ఉంది. శాస్త్రంకూడా ఈ అజ్ఞాని దృష్టిని అనుసరించే ధర్మాధర్మాలు లోకాంతరాలు జన్మంతరాలు సుఖదుఃఖాది అనుభవాలు అన్నీ వర్ణించింది. అదే జ్ఞాని దృష్టి ననుసరించి ఏది లేదని మరలా త్రోసి పుచ్చింది. దృష్టిలో కాని భేదం సృష్టిలో లేదు. ఇది చక్కగా గ్రహించి సాధకుడైన వాడు శాస్త్రాచార్య సహాయంతో శ్రవణ మననాదులు చేసి సర్వమూ ఆత్మాకారంగా దర్శించి జనన మరణాల కతీతుడైతే అనాసక్తుడు- ముక్తుడు- ధన్యుడు- త్రిలోక మాన్యుడు కాగలడు.

★★★



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# మానవ జన్మ – దాని విశిష్టత

మనం పుట్టినప్పటి నుంచి చూస్తున్నా మీ ప్రపంచాన్ని. ఇది ఎంత విచిత్రమైనదో అంత విశాలమైనది. అచేతనాలని పరిగణించ బడే రాళ్ళు రప్పలు మొదలు కొని చేతనాలన్నింటిలో గొప్పవాడని పట్టం కట్టుకున్న మానవుడి దాకా అంతా ప్రపంచమే. రాళ్ళు, రప్పలు మొదలైన అచేతన పదార్థాలకు అసలు ప్రాణమే లేదు. చెట్లకు, చేమలకు ప్రాణ ముంది కాని జ్ఞానం లేదు. పశు పక్ష్యాదులైన తిర్యక్కులకు ప్రాణము జ్ఞానము రెండూ ఉన్నాయి. కాని ఆ జ్ఞానం వాసనా జ్ఞానమే. వివేక జ్ఞానం కాదు. వివేక జ్ఞానమున్నది మానవుడొక్కడికే. ఇంతే కాదు. కాష్ఠ లోష్టాదుల మాదిరి మానవుడికి జడమైన శరీరమూ ఉంది. ఓషధి వనస్పతుల మాదిరి ప్రాణమూ ఉంది. పశు పక్ష్యాదుల మాదిరి వాసనా జ్ఞానమూ ఉంది. అన్నింటికన్నా అదనంగా వివేక జ్ఞానమూ ఉంది.

ఈ విధంగా అన్ని లక్షణాలూ ఒక్క మానవుడిలో ఒనగూడి ఉండటం మూలాన్నే తడికి పురుషుడనే పేరు సార్థకమైంది. పురుషుడంటే పూర్ణుడని అర్థం. పూర్ణత్వం మానవు డొక్కడిలోనే ఉంది. మిగతా సృష్టిలో ఎందు లోనూ లేదు. ఎందు చేతనంటే మిగతా సృష్టిలో ఒక్కొక్క దానిలో ఒకటి రెండు మూడు లక్షణాలు మాత్రమే అయితే మానవ సృష్టిలో ఉండవలసిన అన్ని లక్షణాలూ మనకు ప్రత్యక్ష మౌతున్నాయి. ఇదే పూర్ణత్వమనే మాట కర్థం.

పూర్ణత్వాని కపూర్ణత్వ మెప్పుడూ తక్కువే. అపూర్ణములైన వస్తువులన్నీ పూర్ణత్వాన్ని అందుకొనే మార్గంలో ఏర్పడ్డ అనేకములైన మజిలీలు. అందులో మొదటి మజిలీ మృత్తి కా పాషాణాదులు. రెండవ మజిలీ వృక్షల తా

గుల్మాదులు. మూడవది పశుపక్షి సరీసృపాదులు. మొత్తం మీద అన్నీ కలిసి మానవుణ్ణే తమలో అధికుడిగా భావించి అతనికే ఈ సృష్టి సామ్రాజ్యాన్ని కట్టబెట్టాయా అనిపిస్తుంది. చేతనా చేతనాలన్నిటి మీద చాలా వరకు మానవుడు తన అధికారం చెలాయించటంలోనే ఈ అంశం మనకు దాఖలా అవుతుంది. అంతేకాదు. ఒక సార్వభౌముడికి సామంత రాజులందరూ కప్పాలు చెల్లించినట్లు చరాచర సృష్టి అంతా మానవుడికే తన సర్వస్వాన్ని ధారపోస్తునట్టు కూడా కనిపిస్తుంది.

చూడండి! నిర్జీవమైన భూమి అమూల్యమైన తన ఖనిజ సంపదనంతా బయటపెడుతూ ఉందంటే తన కోసమా? కాదు మానవుడి కోసమే. అట్లాగే చెట్లు కాయలు కాస్తున్నాయి పండ్లు పండుతున్నాయి అంటే అదంతా మానవుడి భుక్తి కోసమే. ఇక జంతు జాలము మాట చెప్పనే అక్కర లేదు. పాడి ఆవు మొదలు పట్టపేనుగు వరకు ఏదో విధంగా మానవుడి కుపయోగపడని జంతు వంటూ లేదు. ఇలా ప్రతి ఒక్కటి సృష్టిలో ఈ మానవుడికి దాసోహ మంటున్నదంటే అతడిలో ఏదో ఒక విశిష్టత ఉండితీరాలి. ఏమిటా విశిష్టత. మిగతా గుణాలన్నీ పశుపక్ష్యాదులకు అతనికి సాధారణమే. పోతే వాటికంటే అధికంగా కనిపించే జ్ఞానమనే దొక్కటే అతనికుండే విశిష్టత.

ఈ జ్ఞానం కూడా వాసనా రూపమైతే మరలా ప్రయోజనం లేదు. అది జంతువులకూ ఉంది. వివేచనాత్మకమైన జ్ఞానం కావాలి. వాసనా జ్ఞానమని వివేచనా జ్ఞానమని అప్పటికి జ్ఞానం రెండు విధాలు. కేవలమూ ఆకలి దప్పులు రాగద్వేషాల దాకా పరిమితమైన జ్ఞానమే అయితే అది వాసనా జ్ఞానం. అంతకు మించి పూర్వా పరాలను కలియబోసి కొని ఇది

కర్తవ్యం, ఇది అ కర్తవ్యం అనే విమర్శనాత్మకమైన జ్ఞానమైతే అది వివేక జ్ఞానం. దీనినే ఆలోచనా మననమని గూడా పేర్కొంటారు.

ఈ మననమనే శక్తి కలవాడే మనువు. ఆ మను సంతతిలో జన్మించిన వాళ్ళం గనుక మనమంతా మనుజులమని మనుష్యులమని, మానవులమని అనిపించు కుంటున్నాము. మననం చేయటాని కొక ప్రత్యేకమైన ఉపకరణం కూడా ఉంది మనకు. అదే మనస్సు. మనస్సు, మానవుడు, మనువు అనే మూడు మాటలు గమనించండి. అన్నింటిలోనూ 'మన' అనే అక్షరాలు రెండు అనుగతంగా వస్తాయి. మన అనే ధాతువుకు సంస్కృతంలో ఆలోచన చేయటమనే అర్థం. మొత్తం మీద ఆలోచనాశక్తియే మానవుడికి ఉన్న విశిష్టతకు ఏకైక కారణమని భావించవచ్చు.

ఐతే ఈ ఆలోచనా శక్తి యుక్తా యుక్త వివేచనా త్మక మని చెప్పాము. వాసనాత్మకమైన జ్ఞానంలో ఈ వివేచనకు చోటు లేదు. కనుకనే పశుపక్ష్యాదులైన ప్రాణులూ జీవిస్తున్నాయి. మనమూ జీవిస్తున్నాము. కాని అవి జీవించటానికి మనం జీవించటానికి ఎంతో తేడా ఉంది. వాటి జీవితం వాసనా ప్రేరితమైనది. మనదలా కాదు. ఒక పెద్ద పులి కేదైనా ఒక జంతువు కనిపిస్తేచాలు. మీద పడి కరిచి చంపుతుంది. ఒక కుక్క మరి ఒక కుక్కను చూస్తే చాలు వెంటబడి తరుముతుంది. ఒక ఎనుబోతు రోడ్డు మధ్య నిలుచొని మనుషులు పోతున్నా బండ్లుపోతున్నా కొంచెమైనా ప్రక్కకు తొలగదు. ఒక గబ్బిలం మూసివేసిన అద్దాల తలుపులు తెరచిఉన్నాయని భావించి మయ సభలో దుర్యోధనుడి లాగా మాటి మాటికి తల పగుల గొట్టు కుంటుంది. ఇలాంటి వ్యవహారం మానవుడిలో కనపడదు. కనపడకూడదు. ఎందుకంటే మానవుడీ వాసనా భూమికను దాటి వివేక

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

భూమికలో అడుగుపెట్టిన వాడు. అతడికి మంచి ఏమిటో చెడ్డ ఏమిటో విభజించి చూచే జ్ఞానముంది. దానితో ఇది కర్తవ్యమిది అకర్తవ్యమని స్పష్టంగా గ్రహించగలడు. కర్తవ్య జ్ఞాన మెప్పుడున్నదో అప్పుడా కర్తవ్యాన్ని జీవితాంతమూ పాటించవలసిన బాధ్యత గూడా ఏర్పడింది మానవుడికి.

దీనికే ధర్మమనిపేరు. దీనికి విరుద్ధంగా నడిస్తే అది అధర్మం. ధర్మా ధర్మాలు రెండూ మనకు శాస్త్రం బోధిస్తున్నది. శాస్త్రమంటే శాసించేది అని అర్థం. అది విధి నిషేధాత్మకం. ఇది నీకు హితం దీని నాచరించమని చెప్పేది విధి. ఇది నీకు హితం కాదు ఆచరించవద్దని చెప్పేది నిషేధం. దీని వల్ల మానవుడు కేవలం తన బుద్ధిని బట్టే కాక శాస్త్రో పదేశాన్ని బట్టి కూడా హితా హితాలు నిర్ణయించుకొని జీవితంలో హితమైన మార్గాన్నే అనుసరిస్తాడు. హితానికే అర్థమని పేరు. అర్థమంటే జీవితంలో ప్రతి మానవుడు కోరదగినది. పురుషుడు కోరేది కాబట్టి దానినే పురుషార్థమన్నారు పెద్దలు. పురుషుడైన ప్రతివాడు సాధించవలసింది పురుషార్థం. అలా సాధించ గలిగినప్పుడే - కనీసం అలాంటి దొకటి ఉన్నదని గ్రహించి దానికోసం యత్నించినప్పుడే - పురుషుడని , మానవుడని పేరు మనకు సార్థక మౌతుంది. లేకపోతే మనం మానవులమే కాదు. పురుషుల మంతకన్నా కాదు. కేవల మాకలి దప్పులు. కామక్రోధాదులు మొదలైన వాసనల ప్రోద్బలంతోనే బ్రతుకుతూపోయే రెండు కాళ్ళ జంతువులం.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in

# పురుషార్థములు - వాని వివరణ

మానవుడు తన మానవత్వాన్ని నిలబెట్టుకోవాలంటే జీవితానికంతా లక్ష్య భూతమైన పురుషార్థాన్ని సాధించక తప్పదని చెప్పాము. ఐతే ఈ పురుషార్థమంటే ఏమిటి? అది ఎన్ని విధాలు? అనే ప్రశ్న వస్తుంది. జీవితాని కనుకూలమైన దర్థం. ప్రతికూలమైన దనర్థం. అనర్థాన్ని పరిహరిస్తూ అర్థాన్ని పాటిస్తూ పోవటమే పురుషార్థ సాధన.

ఇలాంటి పురుషార్థాలు మానవ జీవితాని కంతా కలిసి నాలుగే నాలుగున్నాయి. ఒకటి ధర్మం మరొకటి అర్థం. మరొకటి కామం ఇంకొకటి మోక్షం. చతుర్విధ పురుషార్థాలంటే ఇవే. జీవిత సర్వస్వం వీటి లోనే ఇమిడి ఉంది. అందులోనూ ఈ నాలుగింటినే పరిగణించటంలో - వాటిని గూడా ఈ క్రమంలోనే పరిగణించటంలో కూడా ఒక చక్కని ఉపపత్తి ఉంది. ప్రతి వాడూ తన ధర్మాన్ని ఆచరిస్తేనే కాని అర్థమనేది లభించదు. అర్థమంటే జీవితం సుఖంగా సాగటానికి కావలసిన అన్ని వస్తువులు, అన్ని సౌకర్యాలు. అవి లభించిన తరువాత మానవుడి కామం లేదా వాంఛలన్నీ తీరిపోతాయి. ఐతే ఎంత సాఫల్య మిలా గలిగినా జీవితంలో అది సాంతమే అనంతం కాదు. అనంతమైన సౌఖ్యాన్ని చూరగొనాలనే కదా మానవుడి అభిలాష. అది ధర్మార్థ కామములనే మూడింటిలోనూ మనకు కానరాదు. దానికి సంబంధించిన పురుషార్థం నాలుగవది ఐన మోక్ష మొక్కటే. మోక్షం మానవుడికి నిత్యమైన సౌఖ్యాన్ని ప్రసాదిస్తుంది. కనుకనే అది పరమ పురుషార్థమని పేర్కొన బడుతున్నది. మొత్తము మీద నాలుగు కలిసి జీవితాన్ని అంతటినీ ఆపోశనం పడుతున్నాయి. ఆయా వ్యాపారములు చేయటం - తన్మూలంగా అభిమతార్థాల నన్నిటిని పోగు చేయటం - అలా ఒనగూడిన

వాటి నన్నిటిని తనవి దీర సుభవించటమూ అలాంటి సుఖానుభూతిని శాశ్వతం చేసుకోవటం - ఇంత కన్న జీవితమూ జీవిత ధ్యేయమూ మరేమున్నది. కర్మాచరణతో ప్రారంభమై నిత్య సుఖప్రాప్తితో సమాప్త మవుతున్నది. మొదటిది సుఖం కోసం చేసే ప్రయత్నమైతే రెండవది దానికి ఫలభూతమైన సుఖానుభవం. సుఖాను భవమే గదా సమస్త పురుషార్థ సారం.

★★★

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# ఐహికము - ఆముష్మికము

ధర్మార్ధ కామ మోక్షాలనే నాలుగింటిలో అర్ధ కామాలనే రెండింటికీ ఐహికమని పేరు. ఈ రెండు పురుషార్ధాలు ఆ బాల గోపాలం లోకంలో అందరికీ ప్రసిద్ధమే. ఒక మిఠాయి పొట్లం చేతికి తీసుకొని తింటూ తృప్తి పొందాలని ఒక బాలుడి కెలా ఉంటుందో - అలా ఒక రాజ్యాన్ని పాలిస్తూ దర్జాగా బ్రతకాలని ఒక గోపాలుడికీ ఉంటుంది. అందుచేతనే ఆ బాల గోపాలమని పేర్కొనటం. ప్రతి ఒక్కడికీ జీవితంలో తనకు కావలసిన పరికరాలన్ని సమకూర్చుకొని జీవితాంతం సుఖంగా గడపాలనే ఉంటుంది కాని కష్టాల పాలు కావాలని ఎవరికీ ఉండదు. అప్పటికప్పుడు పుట్టిన శిశువు కూడా నాలుక మీద వేసిన పదార్ధాన్ని చప్పరిస్తుంది. పిచ్చి వాడు కూడా చేతికి చిక్కిన పదార్ధాన్ని వదులు కోలేడు. చావబోయే శతవృద్ధు కూడా ప్రాణాలు నిలబెట్టుకోటానికి మందులు మాకుల కోసం ప్రాకు లాడుతాడు. అర్ధకామాల మీద ఇంత గాఢంగా ఉంది మానవుని దృష్టి.

ఈ మాత్రమే ఐతే ఇది జంతు జాలానికి కూడా ఉంది కదా. ఇక ఈ రెండింటికి పురుషార్ధాలని పేరు పెట్టి సుఖమేమిటి అని అడగవచ్చు. అర్ధ కామాలు జంతువులకూ ఉన్న మాట వాస్తవమే. కాని జంతువులకు కేవలం భౌతికంగానే ఉంటాయి అవి. మానవులకు భౌతికంగానే కాక మానసికంగానూ హార్దికంగానూ కూడా వాటిని మనం చూడవచ్చు. మానసికమైన అర్ధమే శాస్త్ర విజ్ఞానం. హార్దికమైనదే కళా విజ్ఞానం.

ఆనాటి ఋగ్వేదాది శాస్త్రాల దగ్గర నుంచి ఈనాటి అణు శాస్త్రం వరకు అంతా శాస్త్ర ప్రపంచమే. అలాగే వంట చేయటం మొదలుకొని కవిత్వం చెప్పి మెప్పించే దాకా అంతా కళా సందోహమే. ప్రాపంచికమైన వస్తువుల గుణ దోషాలను పరిశీలించి వాటి స్వరూపాన్ని నిర్ణయించటమే శాస్త్రం చేసే పని. హృదయంలో సుప్తంగా ఉండే వాసనలను మేలు కొలిపి ఒకానొక అ లౌకికమైన ఆనందాన్ని ప్రసాదించటమే కళాకార్యం. ఒకటి పదార్థ విజ్ఞానాన్ని అందిస్తే మరొకటి వాసనా జన్యమైన ఆహ్లాదాన్ని అందజేస్తుంది. ఈనాడు మూడు లక్షల మైళ్ళ దూరంలో ఉన్న చంద్ర మండలం మీదికి వెళ్ళి వచ్చాడంటే తనకు బాహ్యంగా ఉన్న ఒక పదార్థ తత్త్వాన్ని శోధించి తెలుసుకొన్నా డన్న మాట మానవుడు. అలాగే ఒక, కమ్మని సంగీతం విని సంతోషించా డంటే తద్వారా తన ఆంతర్యంలో దాగి ఉన్న వాసనా తరంగాలనే అనుభవిస్తున్నాడనే అర్థం.

మొత్తం మీద బాహ్యంగా కనిపించే భూత రాశి ఆభ్యంతరంగా ఉండే వాసనా రాశి వీటి రెండిటినీ దాటి పోలేదు ఏశాస్త్రమైనా ఏ కళైనా. ఇవి రెండూ ఈ శరీరమున్నంత వరకే మన అనుభవానికి వచ్చేది. శరీరం ఎంతో కాలం మన ఆధీనంలో ఉండదు. చూస్తూ చూస్తుండగానే ఎప్పుడో మనకు చెప్పకుండానే తప్పించుకు పోతుంది. దానితో పాటు హృదయము మనసు పడిపోక తప్పదు. అవీ పోతాయి. దీనితో మనం చేసిన శాస్త్ర, కళా పరిశ్రమ అంతా కృష్ణా ర్పణమే. పాంచ భౌతికంగా చేసిన కృషి కాబట్టి పంచ భూతాలకే అప్పగించి పోవలసి వస్తుంది. చూడండి ! చంద్ర మండలం పోయి వచ్చిన మానవుడు కూడా చివర కేమై పోయాడు.

భూమండలం మీదనే తన ప్రాణాలు కోలుపోయాడు. కాబట్టి భౌతికమైన దేదీ నిలవదు. శరీర మున్నంత వరకే దాని అనుభవం. శరీరం పోయినా అనుభవించే అవకాశం వాటికి లేదు. ఆకలి దప్పుల లాంటి కేవల శారీరకమైన భావాలకూ లేదు. మనో హృదయ సంబంధమైన వైజ్ఞానిక భావాలకూ లేదు. కేవల శారీరకాలు మరీ ప్రాకృతము లైతే వైజ్ఞానిక భావాలు కొంచెం సున్నితమైనవి. అంత మాత్రమే తేడా. రెండూ అర్థ కామాల కోటిలోనివే. రెండూ ఈ స్థూలదేహంతో నశించవలసినవే.

పోతే ఇక నశించని వంటూ ఏమైనా ఉన్నవా అని ప్రశ్న. అవి ఆముష్మికమైన ధర్మ మోక్షాలేనని మన ప్రాచీనులిచ్చిన సమాధానం. వీటికి ఆముష్మిక పుని పేరు. మరణానంతరం అనుభవానికి వచ్చే దొకటైతే అసలు మరణమే లేదని అనుభవానికి వచ్చే దింకొకటి. అందులో మొదటిది ధర్మం, రెండవది మోక్షం. ధ్రియతే ధారయతే ఇతి ధర్మః తాను నిలిచి మానవుణ్ణి నిలబెట్టే దేదో అదే ధర్మం. దీనిని బట్టి చూస్తే అర్థకామాల మాదిరి ధర్మమనే పురుషార్థం నశించేది కాదని తెలుస్తూ ఉన్నది.

ధర్మం మాత్రమే నశించేది కాదని చెప్పటాని కేమిటి ప్రమాణం. ఇది దేహ పాతానికి పూర్వం కాక తర్వాత జరిగే కార్యక్రమానికి సంబంధించి ఉంది. దేహ పాతానంతరం దేహమే లేదు. దేహమే లేక పోతే ఇంద్రియాలు లేవు. మనసూ లేదు. అవి రెండూ లేకుంటే ప్రత్యక్ష - అనుమానాలనే రెండు ప్రమాణాలు ఎగిరిపోయాయి. ఇక మనకు ధర్మం బోధించే లోకాంతర జ్ఞానం కాని జన్మాంతర జ్ఞానం కాని ఎలా కలుగుతుంది ? కలగకుంటే అవి ఉన్నాయనే నమ్మకమేమిటి ? కనుకనే మొదటి నుంచి నాస్తిక వాదం

లోకంలో ఏర్పడటాని కవకాశం వచ్చింది. ప్రత్యక్షా నుమానాల కతీతంగా ఏదీలేదని వాదించే వారే నాస్తికులు. ఆవాదాన్ని మనం త్రోసి పుచ్చాలంటే ముందు మరి ఒక ప్రమాణాన్ని ఆశ్రయించి తీరాలి. ఏమిటది. అదే శబ్దమనే ప్రమాణం. ప్రమాణం లేకుండా ఏది చెప్పినా అది కేవల విశ్వాసం క్రిందికే వస్తుంది. విశ్వాసమనేది హేతుబద్ధం కాదు కాబట్టి దాన్ని మనం స్వీకరిస్తే స్వీకరించవచ్చు. లేకుంటే లేదు. అదే ప్రమాణ పూర్వకమైతే తప్పకుండా స్వీకరించవలసి ఉంటుంది. అలా ప్రామాణికాలు కావటం మూలాన్నే ఐహికమైన అర్ధకామాలు అందరికీ శిరోధార్య మౌతున్నాయి. ప్రస్తుతం ధర్మానికి కూడా శబ్దమనే ప్రమాణ మొకటి ఉంది కాబట్టి మనం అంగీకరించ వలసిందే.

శబ్దమంటే ఏమిటి. మాటే శబ్దం. మాట వల్ల జ్ఞానం కలిగే మాట వాస్తవమే. ఐతే ఎవడంటే వాడు చెపితే దానికి ప్రామాణ్యం లేదు. ఫలానా చోట ఫలానా సందర్భాన్ని నేను చూచానని ఒకడు చెపుతాడు. వాడు కుఱ్ఱవాడైతే నమ్మలేము. మతి స్తిమితం లేని వాడైతే నమ్మలేము. అన్ని విధాలా విశ్వస నీయుడైన వాడే చెప్పాలా మాట. అలాటి విశ్వాస పాత్రుడే ఆప్తుడు. అతడు చెప్పినమాట ఆప్తవాక్యం. కాబట్టి శబ్దమంటే ఆప్త వాక్యమని అర్థం.

అంతే కాదు. అది మరలా నిన్న, నేడు ఒకరిద్దరు మాత్రమే చెప్పిందయితే దానికంత ప్రాబల్యం ఏర్పడదు. పదుగురాడు మాట అయి ఉండాలి. అనాది కాలం నుంచి అనుస్యూతంగా వస్తూ ఉండాలి. అలా ఒకే మాట అనేక మంది ఏక కంఠంగా చెపుతున్నారంటే దానికి తప్పకుండా

విలువ ఉంటుంది. కనుక ఆప్తవాక్యమే కాక ఈ శబ్దం ఆగమం కూడా అవుతున్నది. ఆగమమంటే రావటమని అర్థం. ఎప్పటి నుంచో ఈ మాట ఆనోటా ఈనోటా పడి మన దాకా వచ్చి చేరుతూ ఉంది కాబట్టి దీని నాగమమని పేర్కొన్నారు.

అయితే ఇది ఎప్పటినుంచి అయినా రావచ్చు. మొదట ఎప్పుడో ఒకప్పుడు పుట్టి ఉండాలి గదా అది ఎలా పుట్టింది. నిగమంగా పుట్టిందని జవాబు. నిగమమంటే నిశ్చయం. అతి ప్రాచీన కాలంలో కొంతమంది మేధావంతులకు కలిగిన మనో నిశ్చయమే ని గమం. అదే ఆగమ రూపంగా ప్రసరించి మనదాకా వచ్చింది.

కాని నిగమమంటే నిశ్చయమని చెప్పాము. నిశ్చయమనేది ఎవరికి కలిగినా మానసికంగానే కలుగుతుంది. మానసికం రెండు విధాలు. అనుభవ పూర్వకంగా కలిగేది మానసికమే. కేవలం ఊహగా కలిగేదీ మానసికమే. ఇందులో అనుభవ జన్యమైతేనే అది ప్రామాణికం. కల్పనా గమ్యమైతే కాదు. మరి ఇది ఎలాంటి నిశ్చయమని ప్రశ్న వస్తుంది. అనుభవ జన్యమేనని సమాధానం. కనుకనే నిగమమని మాత్రమే గాక దీనికి దర్శనమని గూడా పేరు వచ్చింది. దర్శనమంటే చూడటం. తపస్సం పన్నులైన మన మహర్షులు సాక్షాత్తుగా చూచిన తర్వాతనే వాటిని సత్యాలుగా నిగమనం చేశారు. అవే ఆగమాలుగా మన వరకు వచ్చాయి. అది మనకు ఆప్త వాక్యమైన శబ్దమైంది. శబ్దమెప్పుడూ చెవులకు విన పడుతుంది. కాబట్టి దీనికి శ్రుతి అని గూడ మరి ఒక పేరు వచ్చింది. ఈ శ్రుతి మరలా మన కామహర్షుల జ్ఞానాన్నే అందజేస్తుంది. కాబట్టి అదే వేదమని కూడా పేర్కొన బడుతున్నది. “విదజ్ఞానే”

Brahmasri Vallabhajosyula Srinivasa Rao
www.advaitavedanta.in

వేదమంటే జ్ఞానమనే అర్థం - ఇంతకూ ఒకప్పుడు పెద్దలు దర్శించిన సత్యమే ఇప్పుడు మనకు శబ్దంగా వినిపిస్తున్నది. వారి దర్శనం నిగమమై - నిగమ మాగమమై - ఆగమం శబ్దమై - శబ్దం శ్రుతియై, శ్రుతి - వేదమై, ఆవేద మిప్పుడు మనకు ప్రమాణ భూతమైప శాస్త్రమై నిలిచింది. ఇప్పుడది అక్షర రూపంగా కనిపిస్తున్నా అక్షరాలలో బంధించబడిన అనుభవ జ్ఞానమే అది అని మనం గ్రహిస్తే చాలు. దాని ప్రామాణ్యానికి తిరుగులేదు - ఇలాంటి శాస్త్ర ప్రమాణం ఐహికం కాదు. ఆముష్మికం. ఆముష్మికమైన ధర్మాన్ని మనకది చాటి చెపుతున్నది.

ధర్మ మనే మాటకు కర్మ అని అర్థం. కర్మ అంటే పని. ప్రతి పనీ మనసుతోనో వాక్కుతోనో శరీరంతోనో మూడింటిలో ఏదో ఒక దానితో జరుగుతూ ఉంటుంది. పశు పక్ష్యాదులకు మనో వాక్కులంత బలంగా లేవు. పోతే వాటికున్న దొక్క శరీరమే. దానితో అవి పనులు చేస్తూనే ఉంటాయి. ఐతే ఆ చేసే పనులు బుద్ధి పూర్వం కాదు కాబట్టి వాటిని కర్మలని గాక చేష్టలని చెపుతారు పెద్దలు. పోతే బుద్ధి పూర్వకంగా చేసే వాడొక మానవుడే. కాబట్టి వాడి పనులన్నిటికి కర్మలని పేరు పెట్టారు. ఈ కర్మలలో మరలా కర్తవ్యమని - అ కర్తవ్యమని రెండు జాతులున్నాయి. ఏది తనకూ లోకానికీ హితమో అది కర్తవ్యం. ఏది కాదో అది అ కర్తవ్యం. అందులో కర్తవ్యమైన కర్మకే ధర్మమని పేరు. దానికి భిన్నంగా అ కర్తవ్యమైన దాని కధర్మమని పేరు. యుక్తాయుక్త వివేచనా శీలుడైన మానవు డధర్మాన్ని పరిహరించి ధర్మాన్ని మాత్రమే ఆచరిస్తూపోవాలి.

ధర్మాన్ని ఆచరించాలంటే ఏది ధర్మమో ఏది కాదో గ్రహించే జ్ఞానముండాలి మొదట. అలాటి జ్ఞానం మానవుడి బుద్ధికి కొంత సహజంగా కలుగుతుంది. కాని అది చాలదు. దేశకాల నిమిత్త దశా విశేషాలను బట్టి ధర్మా ధర్మాలు చిత్ర విచిత్రంగా మారిపోతుంటాయి. ఒక దేశానికి ధర్మమైనది మరొక దేశానికి కాదు. ఒక కాలానికైనది మరొక కాలానికి వర్తించదు. ఇంతెందుకు. నీకు ధర్మంగానే కనిపించవచ్చు. అది నీ పొరుగు వాడికి కేవల మధర్మంగా తోచవచ్చు. కాబట్టి అల్పజ్ఞుడైన మానవుడు తన బుద్ధితో మాత్రమే నిర్ణయించ వలసినవి కావీ ధర్మా ధర్మాలు. " తస్మాత్ శాస్త్రం" అన్నట్టు శాస్త్ర ప్రమాణమే మనకు మార్గదర్శకం.

శాస్త్రం అతీంద్రియ జ్ఞాన సంపన్నులైన ఋషి పుంగవుల అనుభవాల సంపుటమని కదా చెప్పాము. అలాటి సర్వతో ముఖమైన శాస్త్రం చెప్పలేని అంశమంటూ ఉండబోదు. శాస్త్ర మంటే శ్రుతులు, స్మృతులు, ఇతిహాసాలు, పురాణాలు మొదలైన వాఙ్మయ ప్రపంచం. ధర్మాన్ని దర్శిస్తే అవి శ్రుతులైనాయి. పెద్దలైన వారు ఆచరిస్తూ వస్తే అవి స్మృతులైనాయి. దాన్నే దృష్టాంత పూర్వంగా వివరిస్తూ పోతే పురాణేతి హాసాలైనాయి. మొత్తం మీద అన్నీ మనకు బోధించేది ధర్మమే.

ఈ బోధ కూడా విధి ముఖంగా నిషేధ ముఖంగా రెండు ముఖాలుగా చేస్తుంది శాస్త్రం. ఇది ధర్మం దీనిని నీవాచరించి బాగుపడమని చెప్పటం విధి. ఇది అధర్మం దీని నాచరించ గూడదని హెచ్చరించటం నిషేధం. దీనిని బట్టే వేదాల దగ్గర నుంచి మన వాఙ్మయమంతా విధి నిషేధాత్మకంగానే విభక్తమై కూచుంది. "రా మాది వ ద్వర్తితవ్యం న రావణాదివత్" రాముడి

మాదిరి ప్రవర్తించు రావణుని మాదిరి కాదు. అని బోధించటం కన్న శాస్త్రానికి వేరే ప్రమేయమే ముంది. కేవల ధర్మాన్ని చెప్పినా లాభం లేదు. కేవల మధర్మాన్ని చెప్పినా సుఖం లేదు. రెంటినీ కలిపి చెప్పినప్పుడే ఆ ప్రమేయం సిద్ధించేది. ఇందులో అధర్మ జ్ఞానం అనర్థాన్ని పరిహరించటానికి దారి చేస్తే ధర్మ జ్ఞానం అర్థప్రాప్తికి తోడుపడుతుంది. అనర్థ రహితమైన అర్థమే కదా అసలైన పురుషార్థం. కనుక వివేక శాలి అయిన పురుషుడు శాస్త్ర ప్రమాణాన్ని బట్టి అధర్మాన్ని వర్జిస్తూ ధర్మాన్ని మాత్రమే పాటిస్తూ పోవాలి. ధర్మం వలన కలిగే ఫలం చివరకు జీవితాభ్యుదయం. జీవితమంటే ఐహికమేకాదు. ఆముష్మికం కూడా. దానికే అభ్యుదయమని పేరు. అది లోకాంతర జన్మాంతరాల్లో అనుభవానికి వస్తుందని శాస్త్రం చెబుతున్నది మనకు. ఇప్పుడే అది దృష్టం కాదు కనుక అదృష్టమని అపూర్వమని నామకరణం చేశారు.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# పరమ పురుషార్థము - మోక్షము

ఆ ముష్మికంలో ధర్మ పురుషార్థాన్ని ఇంతవరకూ విచారించాము. పోతే ఇక మిగిలింది నాలుగవది ఐన మోక్ష పురుషార్థం. ఇది అన్నిటి కన్నా చివరది. కనుక చరమమని - ఉత్తమమైనది గనుక పరమమని పేరు వచ్చింది. ధర్మం జనన - మరణాలనే రెండింటిని అలాగే ఉంచి జన్మాంతరాలు, అందులో మరల సుఖ దుఃఖానుభవాలు - వీటిని గురించే ఏకరువు పెడుతుంది. అంచేత సమస్య పూర్తిగా పరిష్కారం కావాలంటే మోక్ష పురుషార్థమే చివరకు శరణ్యం. మోక్షమంటేనే పరిష్కారం. అది ఈ జీవభావం పోనంతవరకు లభించేది కాదు. తన స్వరూపాన్ని ఉన్నదున్నట్టు గ్రహిస్తే కాని జీవభావం పోదు. తన స్వరూపాన్ని గుర్తించ గలిగినప్పుడే భగవత్తత్త్వం గూడ గుర్తించగలదు. బ్రహ్మ జ్ఞానానికి ఆత్మ జ్ఞానమనేది కుంచికలాగా పని చేస్తుందని పెద్దలమాట.

అసలు నీ కన్నా సన్నిహితమైన పదార్థం ఈ సృష్టిలో వేరొకటి లేదు. అలాంటి నిన్నే నీవు తెలుసుకోకపోతే మరి ఏది తెలుసుకోగలవు. నన్ను తెలుసుకొనే ఉన్నాను గదా అని నీవనవచ్చు. నీవు తెలుసు కుంటున్నానని చెబుతూ ఉన్నది ఈ తలా మొలా చేతులూ కాళ్ళూ మాంసమూ చర్మమూ - ఇంతకన్నా మరేది కాదు. పోతే నీ లోపల నీవు గుర్తిస్తూ ఉన్నది ఎంత వరకంటే ఆకలి వేస్తే అన్నం తినటం కోపం వస్తే విరుచుకు పడటం కామం చెలరేగితే పెండ్లి పేరంటాలు చేసుకోవటం ఇలాంటి వ్యవహారమే.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇంత మాత్రమే అయితే నీకున్న ఘనత ఏమిటి ? నీ సోదరులైన జంతువు లకు కూడా ఉన్నాయి గదా ఈ లక్షణాలు. వాటి కన్నా ఎక్కువ అనిపించు కోవాలంటే నీ తత్త్వాన్ని ఇదమిత్థమని గుర్తించాలి నీవు. నేనెవడనూ నా స్వరూపమేమి ? ఎక్కడ నుంచి వచ్చాను ? ఎక్కడికి వెళతాను. ఇక్కడకు వచ్చి ఈ సత్రంలో నివసించటంలో గల ఆంతర్యమేమిటి అసలు ఎవరు పంపారిక్కడికి ? పంపిన వాడి ఉద్దేశమేమిటి? బంధ మోక్షాలనే మాటల కర్థమేమిటి అని విచారణ సాగించాలి మానవుడు.

అసలింతకూ పశు మృగాదుల గుణాలు కూడా ఎందుకు నీలో జత చేసి సృష్టించాడో ఆపరమాత్మ నీవు బాగా అర్థం చేసుకోవలసి ఉంది. అవి అహర్నిశలు నిన్ను తమకు బానిసను చేసుకొని నీ మీద దౌడు చేయటమా ? లేక నీవే వాటిని లొంగ దీసుకొని నీ సాధన మార్గంలో వాటిని పరికరాలుగా వాడుకోటమా ఏమిటి దీని తాత్పర్యం ? అది నీవు తేల్చుకోవలసిన మొదటి విషయం. నీ వీ సత్రంలో వచ్చి కాపురముండేదే నాలుగు రోజులు. తరువాత నీవెంతో చేయవలసి ఉంది ప్రయాణం. అలాంటప్పుడు వాటికి నీవు కాదు దాస్యం చేయవలసింది. వాటి చేతనే నీవు పనులు చేయించు కొనవలసి ఉంది. అది ఎలాగా అని అడగవచ్చు.

మానవుడు తన స్వరూపాన్ని తాను గుర్తించటమే కదా జీవిత లక్ష్యం. మానవుడికున్నవి రెండే రెండు పదార్థాలు. ఒకటి ఈ శరీరం. మరి ఒకటి ఇందులో దాగి ఉన్న ఒక విలువైన నిక్షేపం. దానికే ఆత్మ అని పేరు పెట్టారు. శరీరం లాగా అది పైకి కనిపించదు. మనో నేత్రంతో మాత్రమే దర్శించగలం. వాస్తవంలో అదే నీవనే పదార్థం. పోతే దానికి విలక్షణంగా కనిపించే దంతా ఇక దాని పరివారమే. ఆత్మ స్వరూపాన్ని

అర్థం చేసుకోవాలంటే అందరికీ సాధ్యమయ్యేది కాదు. ప్రజ్ఞావంతుడైన వాడు ఉపాయంతో దాన్ని పట్టుకోవలసి ఉంది. నీవు ఒక గదిలో ఒంటరిగా కూర్చొని కనులు రెండు మూసుకొని లోపల ఏ ఆలోచనా పెట్టుకోకుండా తుదకు నీకొక శరీరముందని గూడా మానస్సుకు తెచ్చుకోక శరీరం వెలపల ఏదో ఉందనే భావం కూడా తాత్కాలికంగా దూరం చేసుకొని కూచుంటే చాలు. తప్పకుండా ఆ సమయంలో నీకు నీ స్వరూప మేమిటో గోచరించి తీరుతుంది. ఈ స్ఫురణే అసలైన నీ స్వరూపం. మిగతా మనః ప్రాణ శరీరేం ద్రియాదులన్నీ దాని ఉపాధులు. ఈ సాధన ద్వారా మానవుడికి తన ఆత్మ స్వరూపమే గాక మోక్ష స్వరూపం కూడా అర్థమౌతుంది. శరీర స్పృహ లేకున్నా నేనున్నాననే అవస్థే కదా మోక్షమంటే.

శరీరమనేది ఆత్మకు సంబంధించిన ఒక రాజ్యం. ఈ రాజ్యంలో ఆత్మ రాజైతే దాని కెంతో మంది సైనికులున్నారు. అది ఈ ప్రపంచంలోని కసలు వచ్చిందంటే మరల తన స్వస్థానికి పోయి చేరటానికే వచ్చింది. అంచేత దాని కర్తవ్య మెప్పటికీ అయా భూమికల నారోహించి పైకి పోవటమే. బ్రహ్మ జ్ఞానాన్ని ఆర్జిస్తూ పోవటమే ఆరోహణ. ఆజ్ఞానం బ్రహ్మ వివర్తమైన ఈ విశాల ప్రపంచాన్ని తిలకిస్తే గాని కలగదు. ప్రపంచంలోని లోతు పాతులన్ని గ్రహించాలంటే మానవుడు తన పంచేంద్రియాల ద్వారా తప్ప గ్రహించలేడు. పంచేంద్రియాల కాధార మీ శరీరమే. దానిని బట్టి ఆత్మ జ్ఞానమనేది మనం వలవేసి పట్టవలసిన ఒక పెద్ద చేప. ఇంద్రియాలు దానిని పట్టుకొనే వల. శరీరం ఆ వలను మోసుకొని పోయే జాలరి.

ఏతావతా శరీరంతో ఆత్మకు సంబంధం ఇందు మూలంగా ఏర్పడింది. ఈ శరీరం కూడా పృథివి, జలము, తేజస్సు, వాయువు – ఈ

Brahmasri Yalamarti Srinivasa Rao
www.advaitavedanta.in

నాలిగింటి సమాహారం. అంచేతనే చాల సున్నితమైనది, ఎప్పుడు ఏ ప్రమాదానికి గురి అయినా కావచ్చు. అంచేత తన్ని వారణార్థం తన కున్న పరివారాన్నే తాను చక్కగా ఉపయోగించుకో గలిగి ఉండాలి. ఒక మహా రా జెలాగైతే పరిపాలనా భారమంతా చాలా వరకు యుగంధరుడి లాంటి ఆమాత్యుడికి అప్పజెపుతాడో అలాగే జీవుడనే పాదుషా కూడా తన రాజ్య పాలన బుద్ధి అనే అమాత్యుడికే అప్పజెప్పటం మంచిది. అది కామ క్రోధాదులైన నౌకరుల నందరిని అదుపులో పెట్టి అవసరమైన చాకిరీ చేయించు కోగలదు. బుద్ధికి వాటిని వశం చేయాలే గాని బుద్ధిని వాటి కధీనం చేయరాదు. "బుద్ధింతు సారథిం" అన్నారు. బుద్ధే శరీరమనే రథానికి సారథి. ఇంద్రియాలనే అశ్వాలు ఈ సారధికి లోబడి సరియైన మార్గంలో పయనించినప్పుడే మోక్షమార్గంలో మన ప్రయాణం నిర్విఘ్నంగా సాగిపోతుంది. కనుక ఇంద్రియాలు బుద్ధికి దాసులైతే, బుద్ధి ఆత్మకు పరిచర్య చేయవలసి ఉంది. అది ఒక కరదీపిక లాంటిది. దీన్ని దీపిక లాగే ఉపయోగించుకొని గమ్యం చేరమని చెప్పటానికే ఈశ్వరుడీ సామగ్రిని మనకు సరఫరా చేశాడు. దీని కంతటికీ ధ్యేయం భగవత్సాన్నిధ్యమే.

ఇంతకూ ఆముష్మికాన్ని తనకు స్వస్థానంగాను, ఐహికాన్ని ఒక సత్రంగాను శరీరాన్ని ఒక వాహనంగాను, ఇంద్రియాలను పరిచారకులు గాను, బుద్ధిని తన కమాత్యుడి గాను చేసుకోవాలి మానవుడు. అప్పుడే ఇహం మీది నుంచి పరానికి మళ్ళుతుంది మానవుడి దృష్టి, మానవుడు సృష్టిలో ఎంతో విశిష్టుడైనా ఆ విశిష్టతను అతడు కాపాడుకొన్నప్పుడే. లేకుంటే అతడిలో గుప్తంగా ఉన్న పశు, మృగ లక్షణాలు పైకి వచ్చి సాధన మార్గం నుంచి ప్రక్కకు తప్పిస్తాయి. మనలో ఉన్న పశు మృగ లక్షణాలన్నారే అవి

ఎక్కడ ఉన్నాయని అడగ నక్కరలేదు. ఉపేక్షిస్తే ఆగుణాలే పైకి వచ్చి మనకు దర్శన మిస్తాయి, అవి మనలో ఉన్నా వాటి కంటే అదనంగా విచారణా శక్తిని ఇచ్చి సృష్టించాడా ఈశ్వరుడు. ఎవరికేది అతిశయంగా ఇచ్చి ఉంటాడో అదే దానికి పరిపూర్ణత. అందు కోసమే అది ఏర్పడి ఉంటుంది. దీనికొక ఉదాహరణ ఇస్తాను వినండి. గుర్రం గాడిద కన్నా ఉత్కృష్టమైనది. ఎందుకంటే గాడిద బరువులు మోయటానికే సృష్టి అయింది. గుర్రమలా కాదు. అది పరుగెత్త గలదు. బండికి కడితే లాగ గలదు. ఆట నేర్పితే ఆడగలదు. యుద్ధ రంగంలో సైనికుడికి తోడ్పడగలదు. ఇంతేకాక గాడిద లాగా బరువు కూడా మోయగలదు. ఎప్పుడైనా ముందు చెప్పిన విశేష గుణాలు దానిలో లోపించాయో. అప్పుడది కేవలం బరువు మోసే గాడిద స్థాయికే దిగజారుతుంది, అది దాని వ్యక్తిత్వానికే ఒక గొడ్డలి పెట్టు. అలాగే ఆహార నిద్రాభయమైథు నాదులనే జంతు లక్షణాలు మానవుడిలో ఉంటే ఉండవచ్చు. వాటికంటే విశేషంగా ఆలోచనా గుణ మొకటుంది. దానికి పనిచెప్పినప్పుడే అతడు మానవుడని పించుకోగలడు. లేకుంటే మెత్తబడ్డ గుర్రంలాగా తానూ సంసార భారం మోయుటానికే తప్ప మరి దేనికీ పనికిరాడు.

ఇంతకూ మానవుడంటే బుద్ధి జీవుడని అర్థం. ఈ బుద్ధి అనేదే పశు పక్ష్యాదుల కంటె అతనికి అదనంగా ఉన్న లక్షణం. అది లేనిది గనుకనే మిగతా జీవ జాలమంతా జ్ఞానానికి నోచుకోలేదు. బుద్ధికి చెందినదే జ్ఞానం. ఈ జ్ఞానంలో కూడా రెండతస్తులున్నాయి. మొదటిది లోకులందరికి అవగాహనకు వచ్చేది. రెండవది కొందరికి మాత్రమే అనుభవానికి వచ్చేది. మనం లోకంలో నేర్చే సమస్త విద్యలు, కళలు, వృత్తులు మొదటి శ్రేణికి

www.advaitavedanta.in

చెందినవి. పుస్తకాలలో ఉండే విషయాలన్నీ గ్రహించగలం. గణిత వైద్య జ్యోతి షాదులేమిటి. వేద శాస్త్ర పురాణాలేమిటి. అన్నీ గ్రహించగలం. పరమాణువుకన్న చిన్నదైనా మానవుడి మనస్సులో ఎంత విజ్ఞానమైనా ఇముడ్చుకునే శక్తి ఉంది. ఎన్ని ప్రపంచాలైనా అందులో ఇమిడిపోతాయి. అది ఒక పుష్పక విమానం. ఒకసారి సంకల్పించిం దంటే పాతాళం నుంచి పరమేష్ఠి లోకం దాకా పరుగెత్త కలదు. తూర్పు నుంచి పడమర దాకా చుట్ట బెట్టుకొని రాగలదు. మర్త్యమైన ఈ జగత్తులో ఉండి కూడా అమర్త్యత్వాన్ని గూర్చి ఆలోచించగలదు. సాగర గర్భంలో దాగి ఉన్న తిమింగిలాన్ని గూడా గాలం వేసి పైకి లాగ గలదు. అంతరిక్షంలో పారిపోయే పక్షిని గూడా భూమి మీద పడగొట్టగలదు. మరి సింహ శరభ శార్దూలాది ఘాతుక మృగాలను గూడా ఉపాయంతో పట్టుకొని స్వారి చేయగలదు. ఇదంతా జ్ఞాన ప్రభావమే. ఈ విద్యలన్ని మానవుడు సాధించ గలిగినవే.

ఇవన్నీ మానవుడికి లభించేది పంచేంద్రియాల ద్వారానే. పాంచ భౌతికమైన జగత్తు నంతా గ్రహించటానికి పంచేంద్రియాలే దారులు. పోతే ఈ ఐదూగాక ఆరవ మార్గం ఒకటి ఉంది మానవుడి అంతరంగంలో. అది ఆదివ్య జగత్తులోకి తెరచుకొని ఉన్న ఒక అద్భుతమైన ద్వారం. అవి భౌతిక జగత్తువైపు అయితే ఇది అ భౌతికం వైపు తిరిగి ఉంటుంది. నూటికి తొంబది మందికి ఇది అంతుపట్టదు. జ్ఞాన శక్తిలో ఇది రెండవ అంతస్తు. దీని ద్వారా ప్రయాణం చేసి చేరవలసిన గమ్యం ఒక్కటే. అది బ్రహ్మాత్మ భావం. దానికే మోక్షమని మరి ఒక నామధేయం. ఇది ప్రత్యక్ష, అనుమానాలనే రెండు ప్రమాణాలకు అగోచరమైన దశ. అలాంటప్పుడు ఇది ఒకటి ఉందో లేదో అనే సందేహం కలగటం సహజమే. ఏ ఒకరి

అనుభవమో అందుకు ప్రమాణ మంటే లోకం నమ్మకపోవచ్చు. అందుకేనేమో పండిత పామరుల ఇద్దరి అనుభవంలోను ఉన్న ఒకా నొక అవస్థను దీనికి నిదర్శనంగా పేర్కొన్నారు మన పెద్దలు. అదే నిద్రావస్థ. సుషుప్తి అని కూడా వ్యవహరిస్తారు. ఇంద్రియ ద్వారాలన్నీ మూతబడి పోతాయి అప్పుడు. మనకు తెలియకుండానే ఆరవ ఇంద్రియం అయిన మనస్సు ఈ భౌతికానికి దూరం అవుతూ అభౌతికమైన మరొక దానికి దగ్గర పడుతుంటుంది. వృత్తి రహితమై మనస్సు ఒక అద్దంలాగా పరిశుద్ధమయ్యే అవకాశముంది అక్కడ. అప్పుడే అది తన స్వరూపమైన బ్రహ్మ చైతన్యంలో అప్రయత్నంగా పోయి తలదాచు కుంటుంది. ఐతే వృత్తులు లేకున్నా వాసనలనేవి వదలిపోవు. దానితో తాత్కాలికంగా మోక్ష సుఖాన్ని అనుభవించినా అది నిలబడదు. ప్రారబ్ధం కొద్ది వాసనలు మరల వృత్తులుగా మారి జాగ్రదవస్థ లోనికి తెచ్చి పడవేస్తాయి. అది మ[illegible] బంధమే.

అంచేత సుషుప్తిని మోక్షానికి దగ్గర దశ అనుకోవలసిందే గాని మోక్షమేనని చెప్పరాదు. మోక్షమే అయితే మరల జాగ్రత్ లోనికి రాకూడదు. ఎంత వరకంటే ప్రతి దినమూ సర్వులకూ వస్తూ పోతూ ఉన్న ఈ దశను లోతుకు దిగి పరిశీలించటమే మన కర్తవ్యం. పరిశీలిస్తే దృశ్య ప్రపంచం కనిపించకుండా పోవటమే కాదు మోక్షం. దృక్కు నిలవటం దృక్కు నిలవటమే గాదు. అది నేనేనని భావించటం. భావించకుండా ప్రాపంచికమైన ఆయా వాసనలు మనస్సుకు అడ్డు తగులుతున్నాయి. అవి క్షాళితమై పోవాలి. అవి కూడా నా స్వరూపమేననే దృష్టితో దర్శించటమే సాధన. ఆత్మాకార వృత్తే ఆదర్శించే మార్గం. దీనికే బ్రహ్మ విద్య లేదా పరా విద్య అని పేరు. ఇంతకు ముందు వర్ణించింది అపర ఐతే ఇది పర. అది ప్రపంచాభి

ముఖమైతే ఇది పరమాత్మాభి ముఖం. దానికి ప్రపంచమే వేద్యం. దీనికి వేద్యం పరమాత్మ. అక్కడ విద్యకు భిన్నమైనది వేద్యం. ఇక్కడ అలా కాదు అభిన్నమైనది. విద్యా వేద్యం ఒక్కటే. ఈ వేద్యం దేశ కాల వస్తువులన్నింటిని వ్యాపించినది గనుక తదా కార వృత్తి అయిన విద్యతో దీన్ని గ్రహిస్తే చాలు. ఇక ఏ సాధనా అక్కర లేదు. దేశ కాలాదులన్నీ స్వరూపంగానే అనుభవానికి వస్తాయి కాబట్టి లోకాంతర జన్మాంతర దేహాంతర ప్రసక్తి లేదు. అది లేకుంటే ఇక సంసార గంధమే లేదు గనుక సకల బంధ నిర్ముక్తుడై మానవుడు బ్రహ్మ భావాన్ని అందుకోగలడు. ఇదే పరమ పురుషార్థమైన మోక్షం.

★★★

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# జీవ యాత్ర

4. ఈ సంసార మహా పురాణ రచనం బేనాడు సాగించెనో
ఆ సచ్చిద్ఘన మూర్తి - అంత మను మాటైనన్ తలంపంగరా
దాసర్గంబులు - నా ప్రజా పతులు - నాయా వంశ చారిత్రముల్
భాసించున్ మరి య స్తమించు - మరలన్ భాసించు చక్రాకృతిన్.

5. ఏమని చెప్పవచ్చు పరమేశ్వర సృష్టి విచిత్ర రూపమై
ఈ మహి నుండి యా దివికి నెన్ని సహస్రము లెన్ని లక్షలో
యామడ లేర్పరించి సదృశా సదృశంబుగ నెన్ని సంఖ్యలో
భూమిక లన్ రచించి గ్రహ భూముల నిల్పి హరించు గ్రక్కునన్.

6. అందొక లిప్తయైన గలదా మనకాలము - దీని వేడబం
బెందును గాన - ముద్ధత మదేభము పోలిక సాగుచున్న - దీ
చందము నీకు నాకు మన సా వచ సా తల పంగ శక్యమౌ
చందము గాదు - దానికి వశం వదమై చనుచున్కి దక్కగన్ ॥

7. ప్రాణంబు లేదు మృత్పా షాణముల కట్టి
ప్రాణమున్న వి గుల్మ పాదపములు
ప్రాణంబుతో కొంత జ్ఞానమబ్బెను సరీ
సృప కీటకాదుల సృష్టిలోన
ఆజ్ఞాన ముపచితం బంత కంతకు జంతు
జాలంబునకు పక్షి సంతతులకు
అది వాసనా జ్ఞానమైన దానిని మించి
నరజాతి కుదయించి న ది వివేక

8. మీ వివేకంబు ప్రసవించెబో విశేష
వినయ విజ్ఞాన సంపత్తి ఘనతరముగ
అదియె యిప్పుడు ప్రతి లోమమైన సరణి
నష్టమై పోయె ప్రాణావ శిష్టమగుచు ॥

8. మననము చేయు వాడగుట మానవుడయ్యె మనుష్యుడయ్యె నీ
జనుడటు గాక పూర్ణ గుణ సంపద పూరుషుడయ్యె - నిట్టివా
డనితర లభ్యమైన తనయాస్తి సమస్తము కోలుపోవనే
మన గల - మింకనైన సరియైన పథంబున నే గుటొప్పగున్ ॥

9. అది మనకేది మూలమని యాడిరొ పెద్దలు - దాని తత్త్వమున్
చెదరని బుద్ధితో వెదకి చేరి పునర్భవ దుఃఖ వీచికా
స్పదమగు నీభవాబ్ధికిక స్వస్తి పఠించుట గాక యన్యమె
య్యదియను గానరా - ది దియ యంతము జీవిత దీర్ఘ యాత్రకున్.

★★★

Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in

# అద్వైత విజ్ఞాన సారము

సృష్టిలో మానవుడు విశిష్టుడైతే మానవుడిలో అతని జ్ఞానం ఉత్తమమైతే ఆ జ్ఞానంలో ఉత్త మోత్తమం అద్వైత విజ్ఞానం. అద్వైతం, ద్వైతం రెండూ అన్న దమ్ముల లాగా ప్రతి పదార్థంలోను మనకు ప్రత్యక్ష మౌతాయి. సామాన్య జ్ఞానం అద్వైతమైతే విశేష జ్ఞానం ద్వైతం. సామాన్యానికి కారణమని పేరు. అందులో నుంచి వచ్చిన విశేషానికి కార్యం అని పేరు. కారణమే కార్యానికి మూల పదార్థం. కార్యాలు అనేకమైతే వాటికి కారణమైన ఈ సామాన్యం ఏకం. ఈ ఏకమైన సామాన్యమే అనేకంగా కనిపించే విశేషాల నన్నింటినీ వ్యాపించి ఉంటుంది. ఈ వ్యాప్తికే అన్వయమని అనువృత్తి అని పేర్లు. నీటికి భిన్నంగా విశేషాలు ఎక్కడికక్కడ ఒక దాని కొకటి వేర్వేరుగా కనిపిస్తాయి గనుక వాటికి వ్యతిరేకమని వ్యావృత్తి అని పేరు పెట్టారు. వ్యాపకం గనుక నిజానికి సామాన్యమే ఉన్న పదార్థం. అందుకే దానిని వస్తువన్నారు. వస్తువంటే ఏది ఉన్నదో అది. ఈ వస్తువే సామాన్యం. అదే దాని స్వభావం వల్ల ననండి మన అజ్ఞానం వల్ల ననండి విశేష రూపంగా భాసిస్తున్నది. దీనినే ఆభాస అని వ్యవహరిస్తారు. విశేషాలన్నీ సామాన్యం తాలూకు ఆభాసలే. అంత మాత్రాన ఆభాస అనేది తన పాటికి తాను స్వతంత్రంగా ఉన్న ఒక పదార్థమని భావించరాదు. స్వతస్సిద్ధమైనది సామాన్య రూపమైన వస్తువే. సామాన్యంగా ఉంటూనే అది విశేష రూపంగా కూడా భాసిస్తున్నది. ఇది సామాన్య రూపం గానే సత్యం. విశేష రూపంగా అయితే సత్యం కాదు అనృతం. ఉదాహరణకు ఘట శరావాదులు సామాన్య రూపమైన మృత్తికగా చూస్తేనే సత్యం గాని మృత్తి కను తప్పించి వాటిపాటి కవి ఉన్నాయని ఎంత భావించినా అసత్యమే.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రతి ఒక్కటీ లోకంలో సామాన్య విశేషాత్మకంగానే దర్శనమిస్తుంటుంది. చిత్రమేమంటే ఈ సామాన్య విశేషాలకు నిలకడలేదు, ప్రతిదీ క్రింది దానికి సామాన్యమైతే పై దానికి విశేషమౌతూ పోతుంది, ఘటశరావాదుల దృష్ట్యా పృథివి సామాన్యమైతే మహాభూత దృష్ట్యా పంచ భూతాలలో అది మరలా ఒక విశేషం. కారణం సామాన్యమైతే కార్యం దానికి విశేషమని గదా ఇంతకు ముందు పేర్కొన్నాము. దీన్ని బట్టి పృథివి కూడా జలమనే భూతానికి కార్యం గనుక అదీ విశేషమే. అది కూడా తేజస్సుకు కార్యం గనుక తేజస్సు దృష్ట్యా విశేషం. తేజస్సు దానికి సామాన్యం. అలాగే ఆ తేజస్సు వాయువనే సామాన్యానికి విశేషమైతే వాయువు కూడా ఆకాశానికి విశేషం అవుతుంది. పోతే ఆకాశమిక దేనికీ విశేషం కాదని మనకు తోచవచ్చు. కాని అది కూడా ఒక కారణానికి కార్యమే. అదేదో కాదు దానికి సాక్షియైన చైతన్యమే. చైతన్యం ఇది ఆకాశమని గుర్తించినప్పుడే దానికి అస్తిత్వం. కనుక మిగతా భూతాలలాగే ఆకాశానికి కూడా స్వతంత్రమైన అస్తిత్వం లేదు. స్వతస్సిద్ధమైనది చైతన్య మొక్కటే. అది తనకు తాను ఉన్నానని భావిస్తూ తాను గ్రహించే మిగతా పదార్థాలన్నింటినీ ఉన్నాయని గ్రహిస్తున్నది. కనుక స్వతః ప్రమాణమైన ఈ చైతన్యమే మహా సామాన్యం. దాని కతీతమైనది మరేదీ లేదు కాబట్టి అది దేనికీ విశేషమనిపించుకోదు. మీదు మిక్కిలి దానిలో నుంచే ఆకాశాదులైన కార్యాలన్నీ ఏర్పడవలసి ఉంది గనుక అన్నీ దాని విశేషాలే. అంటే దాని దృష్ట్యా సామాన్య విశేష రూపంగా విభక్తమై కనిపించే ప్రపంచమంతా విశేషమే. అన్నిటికీ కలిపి అది ఏకైకమైన కారణం గనుక మూల కారణమని- సామాన్యం గనుక మహా సామాన్యమని వేదాంతుల పరిభాష.

మిగతావన్నీ స్వతస్సిద్ధంగాక అది ఒక్కటే స్వతస్సిద్ధమని ఎలా నిరూపించగలమని సందేహించ నక్కరలేదు. ఎందుకంటే ఏదైనా లోకంలో ఉన్నది, కనిపిస్తున్నదంటే దాని అస్తిత్వానికి ఏదో ఒక ప్రమాణం ఉండి తీరాలి. ప్రమేయంగానే దేనికైనా సిద్ధి గాని తన పాటికి తనకు కాదు. ప్రమేయమంటే ప్రమాణానికి గోచరించటమే. ప్రమాణమెప్పుడూ జ్ఞానమే. ఆకాశం మొదలుకొని జ్ఞానానికి గోచరించేవే గనుక ప్రమేయాల కోటిలోనే చేరిపోతాయి. కనుకనే వాటికి స్వతస్సిద్ధి లేదని చెప్పటం. దానికి భిన్నంగా జ్ఞానమనేది ఎప్పుడూ ప్రమేయం కాదు. అంటే ఏ ప్రమాణానికీ గోచరించదు. జ్ఞానమే కదా ప్రమాణమని పేర్కొన్నాము. అలాంటప్పుడది ప్రమాణానికి విషయమెలా కాగలదు ? దానికి వేరే ప్రమాణ మక్కర లేదు. కావాలని చెప్పినా అదీ జ్ఞాన స్వరూపమే గనుక రెండూ సజాతీయమే అయి కూచుంటాయి. జ్ఞానమనేది జ్ఞేయాన్ని చూపుతుంది గాని జ్ఞానం జ్ఞానాన్ని చూపలేదు. చూపకముందే అది సిద్ధమై ఉంది గనుక ఒక వేళ చూపబోయినా చెల్లదు. ఆత్మా (శ్రయమనే దోష మేర్పడుతుంది. అగ్ని తన్ను తాను కాల్చుకోలేదు. ఒక ఆటగాడు తన బుజం మీద తాను నిలుచొని ఆడలేడు. అలాగే జ్ఞానానికి జ్ఞాన మక్కర లేదు. అది స్వతః ప్రమాణం. కనుకనే స్వత స్సిద్ధం. దీనినే చైతన్యమని, ఆత్మ అని కూడా వ్యవహరిస్తారు.

ఏమిటది ఎలా ఉంటుందని అడగవచ్చు ఆత్మ అంటే ఏదో కాదు. నేననే స్ఫురణ మాత్రమే అది. ప్రస్తుత మీ స్ఫురణ మనలో ప్రతి ఒక్కరి అనుభవంలోనూ ఉంది. ఎవరు నీవని అడిగితే నేననే జవాబిస్తాడు ప్రతి ఒక్కడూ. ఈ నేననే జ్ఞానమే ఆత్మ అన్నా చైతన్య మన్నా. ఆత్మా చైతన్యం జ్ఞానం ఒకదాని కొకటి పర్యాయాలు. జ్ఞానమెప్పుడూ “అహమస్మి” నేనున్నాను అనే రూపంలోనే ఉంటుంది. ఆకాశం వరకూ ఇది ఇది అని

పరోక్షంగానే నిర్దేశిస్తాము గాని నేననే ఈజ్ఞానాన్ని మాత్రం పరోక్షంగా ఎప్పుడూ నిర్దేశించము. అపరోక్షంగా మన స్వరూపమనే భావిస్తాము. ఇదే దీని విలక్షణత. అందుకే దీనికొక్క దానికే ఆత్మ అని పేరు వచ్చింది. పోతే మన మనోభావాల దగ్గర నుంచి బాహ్యంగా ఉన్న ఆకాశం వరకు నా జ్ఞానానికి విషయంగా చూస్తున్నాను గనుక అదంతా ఇక ఆత్మ కాదు. కాదు గనుకనే అనాత్మ అని పేర్కొన్నారు మిగతా ప్రపంచాన్నంతా. ఇంకొక రహస్యమే మంటే "నేను" అనేది జ్ఞానం గనుక అంత వరకు అది చిత్తు. పోతే 'ఉన్నాను' అనేది దాని ఉనికి గనుక సత్తు. ఈ చిత్తుకే చితి అని సత్తుకే స్థితి అని మారు పేర్లు. ఇంతకూ నేను నాస్థితి. నన్ను విడిచి స్థితి లేదు. స్థితిని విడిచి నేను లేను. కనుక రెండుగా నిర్దేశించినా రెండూ కలిసి సచ్చిదాత్మకమైన ఒకే ఒక ఆత్మ పదార్థం. ఇదే అసలైన సామాన్యం. అనాత్మ ప్రపంచమంతా దీనికి విశేషమే.

సామాన్య మన్నప్పుడు దానికి కొన్ని లక్షణాలు సహజంగానే ఉంటాయి. అందులోనూ ఈ ఆత్మ మహా సామాన్యం గనుక అవి తప్పకుండా కనిపించి తీరాలి మనకు. ఏమిటవి ? విశేషాలు ఒక దాని నొకటి వ్యాపించ లేవు. వాటి సామాన్యాన్ని అసలే వ్యాపించ లేవు. కాని సామాన్యం మాత్రం దాని విశేషాలన్నింటినీ వ్యాపించి తీరుతుంది. అంతే కాదు. తనకు భిన్నంగా ఏ విశేషమూ స్వతంత్రంగా లేదు గనుక తనకది ఆ భాసే కావలసి ఉంది. అంటే తానే మొత్తం ప్రపంచ రూపంగా భాసిస్తున్న దన్నమాట. రెండు లేవు పదార్థాలు. ఉన్నది తానే. అదే స్వరూపం. స్వరూపమే విస్తరించి విశేష రూపంగా భాసిస్తున్నది. ఈ విస్తారానికే విభూతి అని మరొక పేరు. ప్రస్తుతం అన్నిటికీ సామాన్యం ఆత్మేనని కదా ప్రతి పాదించాము. ఆత్మ అంటే నేననే స్ఫురణే కదా. కాబట్టి నన్ను - నాకు కనిపించే సమస్త

ప్రపంచాన్ని - నేననే భావంతోనే చూడవలసి ఉంది. విశేష రూపంగా ప్రతి ఒక్కటీ నాలో నుంచే బయటికి వచ్చి నాకే గోచరిస్తూ మరలా నా స్వరూపంలోనే చేరిపోవలసి ఉంది. నాకు భిన్నంగా ఏదేదో కనిపిస్తున్నా ఇన్ని రూపాలుగా మారి నాకు నేనే భాసిస్తున్నాననే అనుభవం నాకు కలగాలి. అప్పుడే సర్వమూ ఆత్మే ననే అద్వైత సిద్ధాంతం సిద్ధాంతమే గాక అనుభవం కూడా నని సాధకుడికి ఋజువవుతుంది.

కాని ఇలాంటి అద్వైతానుభవం మనలో ఇప్పుడెవరికైనా కలుగు తున్నదా అని ప్రశ్న. విశేషాలన్నిటిలో పరుచుకొని ఉన్నది నేనే ఐనప్పుడు క్రొత్తగా సాధించి పట్టు కోవలసిన అవసరమేముంది. అలాంటప్పుడు ఎంత ప్రయత్నించినా మన బుద్ధికి రాకపోవట మేమిటి. దీనికి సమాధానం ఒక్కటే. మనమిప్పుడు ఆత్మ అని భావిస్తున్నది అహంకారమే గాని ఆత్మ కాదు. ఉపాధులతో కలిసిన ఆత్మనే ఆత్మ అని భ్రమపడుతున్నాము. మనస్సు, ప్రాణము, ఇంద్రియాలూ, శరీరమూ ఇవి నా ఉపాధులే గాని వాస్తవంలో నేను గాను. వీటిని నాకు విషయంగా చూస్తూ కూడా నేనని వీటితో తాదాత్మ్యం చెంది కూచున్నాము. కర్తా, భోక్తా అని మనల్ని భావిస్తున్నాము. ఇలాంటి భావాన్ని పెట్టుకొని బ్రతుకుతున్నాము కనుకనే ఇది శుద్ధమైన ఆత్మ కాదు. దీనికి అహంకారమని, కర్త్రాత్మ అని, జీవాత్మ అని, చిదా భాసుడని పేరు పెట్టారు వేదాంతులు. ఈ చిదాభాసుడే నిత్యమూ మన అనుభవానికి వస్తూ ఇదే ఆత్మ అని భ్రమ కొలపటం మూలాన శుద్ధమైన ఆత్మ మనకు తాత్కాలికంగా దూరమైంది. కనుకనే సర్వమూ నేననే అఖండానుభవం కలగటం లేదు. చిదా భాసుడు దానిని శరీరాది ఉపాధుల మేరకే తగ్గించి చూపుతున్నాడు.

Yalamanchili Brahmasri Ravi Rao
www.advaitavedanta.in

కనుక అసలైన ఆత్మ ఏదో గుర్తించవలసిన అవసర మేర్పడుతున్నది, అలా చేయాలంటే ఆత్మలో ప్రవేశించిన అనాత్మ భాగాలను ఒక్కొక్కటే "నేతి - నేతి" అని వేరు చేసి మిగిలిపోయిన చైతన్య భాగమేదుందో దానినే ఆత్మగా గ్రహించవలసి ఉంది. దీనికే ఆత్మా నాత్మ వివేచన అని పేరు. దీని వలన ఆత్మ ఎంత వరకో అనాత్మ ఎంత వరకో నిష్కర్షగా తెలిసిపోతుంది. ఆత్మ అంటే నేననే స్ఫురణ మాత్రమే నని కదా చెప్పాము. అంత వరకే కేటాయించి చూస్తే ఇక శరీరమని, ఇంద్రియాలని, ప్రాణమని, మనస్సని, కర్తృరూపమైన అహమని ఆలోచన రాకూడదు. ఈ కలాపంతో కలిపి దానిని చూడరాదు. చూచినా ఈ ఉపాధులు వాస్తవానికి దానిలో చేరవు. దానినంటవు. కారణమేమంటే నేననే జ్ఞానం ఆకాశం లాగా నిరాకారం. అసంహతం. అహంకారం మొదలుకొని త్వగింద్రియం దాకా మిగతా ఉపాధి వర్గమంతా సాకారం, సంహతం. అలాంటప్పుడు ఇవన్నీ "నేను" ఎలా అవుతాయి. నాకు గోచరించే వివి. మహా అయితే నావి కావలసిందే కాని నేను కాలేవు. నాకు గోచరించే దంతా నేనయితే భార్యా పుత్త్రాదులు, గృహా రామాదులు, ఇవి కూడా నేను కావలసివస్తుంది. కాని వాటిని మనం నేననుకోటం లేదు కదా. అలాంటప్పుడు శరీరేంద్రియాలను మాత్రమే నేనని భావించట మేమిటి హాస్యాస్పదం కదా.

అలా భావించే సరికి ఆత్మకు దీనితో తాదాత్మ్య మేర్పడింది. అది క్రమంగా దేహాత్మ, ఇంద్రియాత్మ, ప్రాణాత్మ, విజ్ఞానాత్మ (బుద్ధ్యాత్మ) కర్త్రాత్మ (అహంకారం) - అని ఇలా ఆయా స్థాయికి దిగజారి ఎక్కడికక్కడ పరిచ్ఛిన్నమై కలుషితమైపోయింది. దీనికే మిథ్యాత్మ అని అద్వైతులు పెట్టిన పేరు. ఈ మిథ్యాత్మే ఇప్పుడు మనం నేను - నేను అని దగ్గర పెట్టుకున్న ఆత్మ. ఇది శరీరాది సంఘాతంగా మారి అంత వరకే ఆగిపోయిన ఆత్మ.

దీనినే అసలైన ఆత్మ అని - శరీరం సరిహద్దులు దాటి ఉన్న ప్రపంచమే అనాత్మ అని - ఆనాత్మకు చెందిన దేహాదులను ఆత్మలో చేర్చుకున్నాము.

నిజానికీ దేహాదులు కూడా ఘట పటాదుల లాగా ఆత్మకు స్ఫురిస్తున్నవే కనుక బాహ్య జగత్తు లాగా ఇదీ అనాత్మ క్రిందికే వస్తుంది. అందులో కొంత అనాత్మ భాగాల్ని ఆత్మగా భావించటం పెద్ద పొరపాటు. దాని ఫలితమే ఈ మిథ్యాత్మ. పోతే దాని చుట్టూ ఉన్నదే అనాత్మ ప్రపంచమని దాన్ని మరలా నాది - నాది అని చూస్తున్నాము. ఈ నాది అనుకునే బాహ్య ప్రపంచమే గౌణాత్మ. కాగా ఇవి రెండూ కూడా దొంగలే. అసలైన ఆత్మ కావివి. అనాత్మే. అంటే కర్తృ రూపమైన అహంకారం మొదలు శరీరం వరకు. శరీరం మొదలు బాహ్యమైన ప్రపంచం వరకు - అంతా అనాత్మ క్షేత్రమే. పోతే ఈ క్షేత్రమంతా ఏ జ్ఞానానికి స్ఫురిస్తున్నదో అది ఒక్కటే క్షేత్రజ్ఞుడైన ఆత్మ. తొంబది తొమ్మిది ఇవి (99) అయితే అది ఒక్కటే ఒక్కటి. ఇది నామరూప క్రియాత్మకంగా విభక్తమై కనిపిస్తుంటే అది అవిభక్తంగా దీన్ని దర్శించే తత్త్వం.

అం ుటప్పు డిక నిజంలో దానికీ దేహాది సంఘాతంతో ఎలాటి సంసర్గమూ లేదు. విడిబడే ఉంటుంది. అలా ఉంటే అది అసంహతం నిరాకారం. అప్పుడు సాకారమైన దేహాదులను ముందుకు తోసి అది వీటి నుంచి వెనక్కు మళ్ళుతుంది. వెనక్కు మళ్ళక పోతే తన ముందుకు వచ్చిన ఈ దృశ్య వర్గాన్ని అది దర్శించలేదు. మరి దర్శిస్తూనే ఉన్న దిప్పుడు. కాబట్టి ఆమేర కది వీటన్నిటికీ వెనకాల ఉండవలసిందే. దీనికే ప్రత్యగాత్మ అని పేరు. సాకారమైన. సంహతమైన, శరీరాదులతో చేయి కలపక వాటి నుంచి తొలగిపోయే సరికి ఇక శరీరంలో ఉండవలసిన ఆగత్యం లేదు దానికి. సాకారంలో నిరాకారమైన తత్త్వం ఎప్పుడూ ఇమిడి పోదు. కనుక

ఒక ఘటాకాశం లాగా అది శరీరంలో ఎంత ఉందో శరీరం వెలపల కూడా అంతగా వ్యాపించగలదు. అలా వ్యాపించే ఈ ప్రత్యగాత్మనే పరమాత్మ అని పేర్కొన్నారు పెద్దలు. విడిబడింది కనుక ప్రత్యక్, వ్యాపిస్తుంది కనుక పరమ. అప్పుడు దాని స్వరూప మేమిటి ! మొదట చెప్పిందే. సత్తు చిత్తు. చిత్తు దాని స్వరూపం. సత్తు దాని అస్తిత్వం. సర్వత్రా ఉండాలి గనుక ఇక దేహాత్మ కాదది. అంటే మిథ్యాత్మ లేదు. ఎగిరి పోయింది. మిథ్యాత్మ లేకుంటే గౌణాత్మ కూడా లేదు. ఎందుకంటే దేహం వరకే నేననుకుంటే నే ఇది కాని దంతా నేను కాదు నాది అనే భావ మేర్పడింది. అంతటా నేనే వ్యాపించినప్పుడు ప్రత్యేకించి నాదనేది లేదు. ప్రత్యేకించి నేననే మిథ్యాత్మ ఎలా లేదో ప్రత్యేకించి నాది అనే గౌణాత్మ కూడా లేదు.

అంటే ఏమన్న మాట. అహంకార మమ కారాలనే రెండు అడ్డు గోడలూ కూలిపోయాయి. వాటి రెండింటి బదులూ ఆత్మ ఒక్కటే మిగిలిపోయింది. ఇది గౌణం కాదు. మిథ్య కాదు. పరిశుద్ధమైన ఆత్మ. దీనికే ముఖ్యాత్మ అని పేరు. అసలైన సిసలైన ఆత్మ ఇదే. ప్రత్యగాత్మ ఐనా ఇదే పరమాత్మ ఐనా ఇదే. సచ్చిద్విశేషం కాదిది. కేవలం సచ్చిత్తులే. ఇదే మహా సామాన్య మంటే. పోతే ముందు చెప్పిన గౌణ మిథ్యాత్మలు (బ్రహ్మాండ, పిండాండాలు) రెండూ దీనికి విశేషాలు. అందులోనూ సద్విశేషం ప్రపంచమైతే, చిద్విశేషం జీవుడు. విశేషమంటే ఫలానా అనే భావం. నేను ఫలానా అని భావించే జ్ఞానమే కదా జీవుడు. కనుక ఇది చిద్విశేషం. దీనికే నామమని గూడా పేరు (idea). ఇలాంటి వృత్తి జ్ఞానంతో దర్శించే బాహ్యమైన జ్ఞేయ ప్రపంచమంతా సద్విశేషం. ఊరక ఉందని చూస్తే విశేషం కాదిది. సత్సామాన్యం. అలా కాక ఫలానా ఘటంగా ఉంది. పటంగా ఉందని చూస్తాము గాబట్టి సద్విశేషమైంది ఈ బాహ్య ప్రపంచం. ఈ సద్వి శేషానికే

రూపమని గూడా పేరు. లోపల చిద్విశేషమైన నామం జీవుడు – వెలపల సద్విశేషమైన రూపం జగత్తు. ఈ రెండింటిలో ఒకటి గ్రహించేది ఇంకొకటి గ్రహించబడేది. రెంటికీ ఉన్న సంబంధమే క్రియ. నామ రూపాలు రెండూ రెండు తీరాలైతే క్రియ అనేది రెండు తీరాలనూ కలిపే ఒక పెద్ద వంతెన. ఇదే త్రిగుణాత్మకమైన సంసారం.

ఈ సంసారమే ఇప్పుడు మనకెదురైన సమస్య. దీని వల్లనే సుఖదుః ఖాదుల అనుభవం ఏర్పడుతూ ఉంది. చివరకు జనన మరణానుభవం కూడా దీని వల్లనే సంప్రాప్త మౌతున్నది. ఇంతకన్నా పెద్ద సమస్య మరొకటి ఏముంది. ఎవరికీ సమస్య. ఎవరనుభవిస్తే వారికి. ఎవడా అనుభవించే వాడు. ఆత్మ కాదు. అనాత్మ జగత్తు కాదు. ఆత్మ అనేది నిరాకారం సర్వవ్యాపకం పరిపూర్ణమని చెప్పాము. పోతే అనాత్మ అనేది కేవలం జడం పరిచ్ఛిన్నమని పేర్కొన్నాము. సమస్య ఎప్పుడూ పరిపూర్ణమైన చేతనకూ లేదు. పరిచ్ఛిన్నమైన జడానికీ లేదు. కారణం మొదటి దానికి విశేష దృష్టి లేదు. రెండవ దానికి అసలు దృష్టే లేదు. కనుక విశేష రూపమైన ఈ సంసారానుభవం రెండింటికీ లేదు.

ఆత్మా నాత్మలకు రెండింటికీ లేకపోతే మరి దేనికిక ? మూడవదైన జీవుడికే ఈ అనుభవం. వీడు ఆత్మలాగా సామాన్య దృష్టీ కాదు. అనాత్మ ప్రపంచం లాగా కేవల దృశ్యమూ కాదు. దృక్ – దృశ్యాల రెండింటి కలయిక. దీనినే గ్రంథి అని వర్ణించారు. దృశ్యంలో కొంత నేనని తనలో కలుపుకున్న దృక్కు. సామాన్య చైతన్యం కాదిది. విశేష చైతన్యం. దీనికే చిదాభాసుడని జీవాత్మ అని పేరు. వీడికున్నది విశేష దృష్టి మాత్రమే. వచ్చిన ఇబ్బంది ఏమంటే విశేష దృష్టితో చూస్తే ఎప్పుడూ విశేష దృశ్యమే కనిపిస్తుంది. కనిపించే కొద్దీ దానితో అతడు తాదాత్మ్యం చెందాడు గనుకనే



Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

విశేష దృశ్యమైన జగత్తుతో కూడా చెందుతూ వచ్చాడు. అలా చెందే సరికి దాని కష్ట సుఖాలు వీడికి సంక్రమించాయి. ఇదే సంసారానుభవం. విశేషమే నేననుకొనే సరికి విశేష ధర్మాలన్నీ నావే అవుతాయి. 'యద్భావ స్తద్భవతి' ఈ విశేష ధర్మాలే సుఖదుఃఖాలు - జనన మరణాలు.

ఐతే ఆత్మ - అనాత్మ రెండే అన్నారు కదా పదార్థాలు. అలాంటప్పుడీ జీవాత్మ అనే మూడవవాడు ఎలా వచ్చాడు. రాలేదు వాస్తవంలో. రావటానికి వీలు కూడా లేదు. ఐనా వచ్చాడంటే ఆ రావటం వాస్తవం కాదు. మరేమిటి. ఆభాస. దానికి కారణం అవిద్య లేదా అజ్ఞానం. సామాన్య చైతన్యం మాత్రమే నాస్వరూప మని గుర్తించక పోవటమే అజ్ఞానం. గుర్తిస్తే చిద్విశేషమైన జీవుడు లేడు. సద్విశేషమైన జగత్తూ లేదు. ఎందు కంటే సామాన్యం కంటే భిన్నంగా ఉండలేవు విశేషాలు. కనుక జీవ జగత్తులు రెండూ లేవు. రెండూ లేకుంటే ఈశ్వరుడు కూడా ఉండబోడు. ఈశ్వరుడనే వాడు జీవుడు కల్పించుకున్న ఒక సగుణమైన సమష్టి చైతన్యం.

ఇవి మూడే త్రిపుటి అంటే. జీవ జగదీశ్వరులు. చిత్రమేమంటే ఈ త్రిపుటి ఒక దానితో ఒకటి ముడిబడి ఉంది. అది అవిద్యతో ముడిబడి ఉంది. అవిద్య లేకపోతే దీని కస్తిత్వం లేదు. అవిద్య అంటే అజ్ఞానమని చెప్పాము. అజ్ఞాన మంటే జ్ఞానం లేకపోవటం కాదు. విశేష రూపమైన జ్ఞానం. ఫలానా అనే దృష్టితో ఫలానా అని చూడటం. చూస్తే ఫలానా అనే దృశ్యం ఫలానా అనే దృష్టికి బంధకమై కూచుంటుంది. ఇదే మనకు పట్టుకున్న సమస్య. మనమంతా ప్రస్తుత మీ సమస్యతో సతమతమౌతున్న జీవులం. నిజానికి సామాన్య చైతన్యమైన పరమాత్మ స్వరూపులమే మనం. అయి కూడా కాదనుకున్నాము. అంటే అర్థం. సామాన్యం కాదు ఎక్కడికక్కడ విశేష రూపమైన చైతన్యమే నా స్వరూప మని భావిస్తున్నాము.దానికి

నిదర్శనమే మనకీ దేహాత్మాభిమానం. అంటే దేహం మేరకే పరిమితమై ఉన్నామనే భావం. ఇది మనందరికీ ఇప్పుడను భవసిద్ధమే కదా ! అనుభవంలో ఉన్న దానికిక వివరణ అక్కర లేదు.

అయితే ఇది మనకు వాస్తవం కాదీ జీవ భావం. వాస్తవంలో పరమాత్మే మనం. మరి అవాస్తవమైన ఈ అభిమానం మన కెలా ప్రాప్తించింది. చెప్పాము కదా అజ్ఞానం వల్లనని. సామాన్యంగా చూడక మన స్వరూపాన్ని విశేషంగా భావించటమే జరిగిన మోసం. కాని సామాన్యమే వస్తుతః అన్నింటికీ అధిష్ఠానం. అన్నింటికీ అంటే విశేషా లన్నింటికీ అని అర్థం. అధిష్ఠానమే వీటికి స్వరూపం. అలాటి అదిష్ఠాన జ్ఞానం కోలుపోవటం మొదటి అపరాధం. దానికి మారుగా విశేష జ్ఞానమే నేననుకొని విశేష రూపమైన దేహాదులను బాహ్యమైన పృథివ్యాదులను నెత్తిన బెట్టుకొని దానితో సతమతం కావటం రెండవ అపరాధం. దీనికే అధ్యారోప మని పేరు. అందులోనూ సహజాధ్యారోప మిది. ఎప్పుడు చేశామో ఎందుకు చేశామో మనకే తెలియదు. కాలిలో గ్రుచ్చుకున్న ముల్లు ఎలా గ్రుచ్చుకున్నదో తెలియ నట్టే. లోకులందరికీ ఇది సాధారణమైనది గనుక సహజాధ్యారోప మన్నారు దీన్ని.

ఇది రెండు విధాలు. ఆత్మను తెచ్చి అనాత్మ మీద ఆరోపించచట మొకటి. ఇదే మిథ్యాత్మ. అలాగే అనాత్మను తెచ్చి ఆత్మ మీద ఆరోపించచట మొకటి. ఇదే గౌణాత్మ. దీనితో అసలైన ముఖ్యాత్మ మరుగు పడిపోయింది. అభావం కాదది. అనుపలబ్ధి. అధిష్ఠాన మెప్పుడూ అభావం కాబోదు. అది అభావమైతే దాని మీద ఆరోపితమైన జీవ జగత్తు లిలా కనిపించటం ఎప్పటికీ జరగదు. ఇవి ఇప్పుడు మనకు భావ రూపంగా అనుభవానికి వస్తున్నాయంటే వీటి కాధారమైన అది అభావమెలా అవుతుంది. భావ రూపంగా

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఉండవలసిందే. తప్పదు. అయితే ఎటువచ్చీ మనం గుర్తించలేదు. కాబట్టి మనకది మరుగు పడిపోయింది.

ఈ మరుగు పడటమే ఆవరణం. ఉపాధుల వల్ల ఆవృతమైంది మన ఆత్మ. అది ఆవృతమై అంతటితో ఆగి పోలేదు. అదే మరలా అనాత్మ రూపంగా భాసిస్తున్నది. దీనికే విపర్యయ మని పేరు. తన్ని మిత్తంగా సుఖ దుఃఖాది ద్వంద్వ రూపమైన సంసార మొకటి అనుభవానికి వస్తున్నది. ఇదే విక్షేప మంటారు. ఇది ఒక విష వలయం. ఆవరణం విక్షేపానికీ, విక్షేప మా వరణానికీ రాకపోకలు చేస్తుంటాయి. అవస్థాత్రయంలో మనకు కనిపించే వ్యవహారమిదే. దీని కంతటికీ ఏకైకమైన కారణం అజ్ఞానమే. అంటే అధిష్ఠాన జ్ఞానం లేక పోవటం. అధిష్ఠాన మనేది సామాన్యమైన జ్ఞానం. అది విశేష జ్ఞానమని ఎప్పుడు భ్రమ పడ్డామో అప్పుడదే విశేష రూపమైన సంసారానుభవానికి దారి తీస్తున్నది.

అయితే ఒక ప్రశ్న. అంతా ఆత్మే. అది ఒక్కటే యథార్థం. అఖండ జ్ఞానమే అది. అదే మన స్వరూపమని గదా వర్ణించారు. అలాంటప్పుడు సామాన్య జ్ఞానమే ఎప్పుడూ ఉండాలి గాని మనకీ విశేష రూపమైన అజ్ఞానమెలా ప్రాప్తించింది. సూర్యుని తేజస్సులో తమస్సనే మాట కర్థం లేనట్టే దీనికీ అర్థం లేదు. నిజమే. అర్థం లేదు వాస్తవంలో. వస్తుసిద్ధంగా లేకపోయినా బుద్ధి సిద్ధంగా అనుభవానికి వస్తున్నదిది. ఏది కాదన్నా అనుభవాన్ని కాదన లేము. అది ఆత్మ వంచన అవుతుంది. 'నహి దృష్టే అనుపపన్నం నామ' అన్నారు. భాష్య కారులు. ఒక ప్రక్క కంటికి కనిపిస్తుంటే ఇది ఎలా చెల్లుతుందని ప్రశ్న వేసి సుఖం లేదట. అనుభవానికి రావటమే చెల్లటం. చెల్లకుంటే అనుభవానికే రాదు కదా.

Brahmasri Vallabhajosyula Srinivasa Rao
www.advaitavedanta.in

అందుకే నేమో అనిర్వచనీయమని వర్ణిస్తారు పెద్దలు దీన్ని. ఉందని చెప్పలేము. లేదనీ చెప్పలేము. సత్తు కాదిది. అసత్తు కాదు. చూడండి. ఘట మసత్తన టానికి లేదు. మృత్తికగా సత్తే అది. అలాగే సత్తన టానికి లేదు. మృత్తికకు వేరుగా ఘటమనే రూపం ఎక్కడా లేదు. అలాగే ఈ జీవుడనే విశేష దృష్టి జగత్తనే విశేష దృశ్యమూ ఒక ఘటం లాగా ఉందనలేము. లేదన లేము. సచ్చిద్రూపంగా సత్యమే రెండూ. తదన్యంగా రెండూ అసత్యమే. అయితే చమత్కార మేమంటే అసత్యమైనా భాసించటం. అదే ఆభాస. అభాస అనేది ఒకటి స్వతంత్రంగా ఉండి కాదు భాసించటం. అలా చెబితే విశేషానికి అస్తిత్వం చెప్పినట్టవుతుంది. సామాన్యానికి వేరుగా విశేషం లేదని గదా సిద్ధాంతం. అలాంటప్పుడీ భాసదేని ఆభాస. వస్తువు ఆభాసే కావాలి. వస్తువే ఇంకొక రూపంలో భాసిస్తున్నది. ప్రతీతి మాత్ర మిది. యథార్థం కాదు. అయినా ఎందుకలా భాసిస్తున్నది.

అలా భాసించటం మాత్మ కాదు. మరేమిటి. ఆత్మ అలా భాసిస్తున్నదని భావించే ఒక విశేషాత్మ. అదే జీవుడు జీవుడంటున్నాడు ఈ అనాత్మను చూచి ఆత్మే ఇలా భాసిస్తున్నదని. వీడి భావన ననుసరించి ఈ అభాస. అయితే జీవుడెందుకిలా భావించ వలసి వచ్చింది. అసలైన ఆత్మ దృష్టి లేక. ఆత్మ దృష్టి లేక జీవు డయ్యాడా - జీవుడై తత్కారణంగా ఆత్మ దృష్టి కోలుపోయాడా - జీవుడు ముందా అజ్ఞానం ముందా అని ప్రశ్న వచ్చింది. ఇది ఉంటే గాని అది లేదు. అది ఉంటే గాని ఇది లేదు. అన్యోన్యాశ్రయ మనే దోషమిది. బీజ వృక్ష న్యాయమిలాంటిదే.

అయితే ఏమిటిక దీనికి పరిష్కారం. జీవుడవై కోరుతున్నావా పరిష్కారం ఆత్మవై కోరుతున్నావా ? ఆత్మ వైతే అడగనే అడగవు. ఎందుకంటే నీకప్పుడు అజ్ఞానమే లేదు. మరి జీవుడవై అడిగావో. జీవుడనే భావాన్ని

వదలకుండానే అడుగుతున్నావు. కాబట్టి అడిగినా సుఖం లేదు. జీవుడనే భావంతోనే పరిష్కారాన్ని అందుకోలేవు. చెప్పినా గ్రహించ లేవు.

ఇది ఎలాంటి దంటే ఒకడు స్వప్నంలో ఉండి స్వప్న జగత్తును చూస్తున్నాడు. - ఇది స్వప్నం - వాస్తవం కాదని ఎవడు చెప్పినా నమ్మడు వాడు. కారణం వాడు స్వప్నంలోనే ఉన్నాడు. సమాధానం చెప్పే వాణ్ణి వాడి సమాధానాన్ని కూడా స్వప్నంగానే చూస్తాడు. అది యథార్థం కాదనే మాట ఇక ఎలా అర్ధమౌతుంది వాడికి. అలా కాక వాడే స్వప్నంలో నుంచి మేలుకొని జాగ్రత్ లోకి వచ్చాడనుకోండి. అప్పుడు వాడికిది ఏమిటి ? ఎందుకనే ప్రశ్నే రాదు. కాబట్టి ఎవరూ పరిష్కరించి చూపనక్కరలేదు. తన పాటికి తానే తెలుసుకోగలడు. వెలుగు చీకటుల లాంటి దిది. చీకటిలో ఉన్నంత వరకు ఇదుగో నల్లగా కనపడుతున్నదిదే వాస్తవం. వెలుగెక్కడ ఉంది. ఒక వేళ ఉందని చెప్పినా అది నాకు చీకటి అయి ఎందుకు కనిపిస్తున్నదని ప్రశ్నిస్తావు. నీవు చీకటినే చూస్తూ వెలుగిలా ఎందు కయిందని ప్రశ్నించి ఏమి లాభం. చీకటనే దృష్టి వదలలేదు. నిన్ను. ఆ దృష్టి వదల కుండా పట్టుకొనే సరికి వెలుగే చీకటయి భాసిస్తున్నది. మరి దీని కేమిటి పరిహారం. ఒక్కటే. వెలుగును చూడటమే. అప్పుడు నీ దృష్టి వెలుగయింది కాబట్టి దానికిక చీకటి లేదు. అంతా వెలుగే. వెలుగే కదా ఉన్నది అది చీకటి ఎలా అయింది ఎందుకయిందని అడగనే అడగవు. ఎందుకంటే చీకటి అనే భావమే లేదు నీకు.

కనుక అజ్ఞాన మెక్కడిది ? జీవుడెక్కడి వాడు ? అది ముందా ? ఇది ముందా ? అనే వితర్కం అనావశ్యకం. ఎంత వితర్కించినా దానికి సమాధాన మెప్పటికీ రాదు. సమాధానమే కావాలంటే ఎందుకని కాదు నీవు ప్రశ్నించ వలసింది. ఇది ఎలా పోతుందని. ఎలా పోతుందో ఆ

ఉపాయాన్ని పట్టుకొని పోతే చివరకు దానికే సమాధానం వస్తుందో అదే దీనికీ సమాధానం. ఇలాంటి ఉపాయానికే ప్రయత్నమని సాధన అని పేరు. సాధన చేస్తేనే ఎప్పటికైనా సిద్ధి. లేకుంటే దానికెప్పటికీ నోచుకోలేము. అంత వరకూ అది కేవలం సిద్ధాంతమే గాని అనుభవం కాదు.

అయితే అద్వైతంలో సాధన అనేది ఉందా అని ప్రశ్న. అంతకు ముందు లేని పదార్థమైతేనే సాధన వల్ల తయారు చేసుకోవలసి ఉంటుంది. తయారై ఉన్న దాన్ని క్రొత్తగా సాధించట మేమిటి ? అనుభవించట మేమిటి. ఆత్మ అనేది ఏదో కాదు. మన స్వరూపం. అది ఇంతకుముందే సిద్ధమైన పదార్థం. తయారు చేయ నక్కరలేదు. చేస్తే అప్పుడది ఆత్మే కాదు. అనాత్మ ప్రపంచంలో ఏదో ఒక పదార్థమౌతుంది. దానికేమి. పూర్వ సిద్ధమైనా దూరంగా ఉన్న దాన్ని దగ్గరకు తెచ్చుకొనే ప్రయత్న ముంటుంది కదా అనవచ్చు. అది మనకెప్పుడూ దూరం కాదు. మన స్వరూపమేనని పేర్కొన్నాము. పైగా లోపలా వెలపలా అనే తేడా లేకుండా సర్వత్రా వ్యాపించి ఉంది. అలాంటప్పుడిక సాధన ఏమిటి.

కావచ్చు. మన స్వరూపమైనా మరచి పోయి ఉండవచ్చు గదా మరిస్తే అది మనదే అయినా మరుగుపడి ఉండవచ్చు గదా అన్నావో. భేష్. అలాంటప్పుడు క్రియా రూపమైన సాధన కాదది. కేవలం గుర్తు చేసుకుంటే సరిపోతుంది. సాధన గాని సాధన ఇది. ఇలాంటి సాధన అయితే మేము కాదన మంటారు అద్వైతులు. దీనికే ప్రత్యభిజ్ఞ అని పేరు పెట్టారు. మరచిపోయిన సత్యాన్ని గుర్తు చేసుకోటమే ప్రత్యభిజ్ఞ. జీవ జగదీశ్వరులనే మూడింటికీ స్వరూపం నేనే – నా చైతన్యమేననే విషయం మరచి పోయాము మన మందరమూ. అంటే అధిష్ఠాన జ్ఞానం లేదని అర్థం. దాని బదులు ఎక్కడికక్కడ విశేష రూపంగా చూస్తూ విశేష

జ్ఞానవృత్తులే నా స్వరూపమని బ్రతుకుతున్నాము. ఈ వృత్తులే నామం. ఇదే జీవుడు. దీనితో చూస్తూ పోతే విశేష రూపంగానే కనిపిస్తున్న దాత్మ. అదే జగత్తు. రెంటికీ ఏర్పడిన లావాదేవీ క్రియ. ఇదే సంసార బంధం.

ఇప్పుడిదంతా నిర్మూలమై పోవాలంటే దీని మూలమేదో దాన్ని పోగొట్టుకోవాలి. అజ్ఞానమే దీనికి మూలం. సామాన్య జ్ఞానం లేక పోవటమే అజ్ఞానం. చీకటి లాంటిదది. చీకటి పోవాలంటే తుడిచి వేయటం, కడిగి వేయటం ఇలాంటి ప్రయత్నమేదీ పనికి రాదు. దీపం వెలిగించట మొక్కటే ఉపాయం – వెలిగిస్తే చాలు ఇక చీకటి లేదు. అది ఆ వెలుగులో చేరి వెలుగు గానే దర్శన మిస్తుంది. అలాగే సచ్చిదాత్మ రూపమైన సామాన్య జ్ఞానం అవలంబిస్తే చాలు. అదే ప్రకాశం. ఆ ప్రకాశంలో నామ రూపాలనే తమస్సు విరిసి పోతుంది. అప్పుడంతా ఆత్మ చైతన్య ప్రకాశమే. కనుక జ్ఞానమే అజ్ఞానానికి జవాబు. జ్ఞానమంటే ఒక వృత్తి. వృత్తి ఇక్కడ సవిశేషం కాదు. నిర్విశేష వృత్తి. ఆత్మా కార – అఖండాకార – బ్రహ్మా కార వృత్తి అన్నా ఇదే. భాష్యకారులు ఈ వృత్తినే విద్య అని జ్ఞానమని పేర్కొంటారు.

ఇది ఎక్కడ కలగాలి ఈ వృత్తి. మిగతా వృత్తులన్నీ ఎక్కడో అక్కడే. మనసులోనే కదా ఏ వృత్తి అయినా కలుగుతుంది, ప్రాపంచిక వృత్తులైనా అందులోనే. పారమార్థికమైన వృత్తి అయినా అందులోనే. "మన ఏవ మనుష్యాణాం – కారణ" మని కదా పెద్దల మాట. అయితే మిగతా ప్రాపంచిక వృత్తులన్నీ ఖండ వృత్తులైతే ఇది ఒక్కటీ అఖండ వృత్తి. అవి అనేకమైతే ఇది ఏకం. అవి అనాత్మకు చెందిన వైతే ఇది ఆత్మకు చెందినది. వృత్తి అయినా దీనికీ దానికీ హస్తి మశ కాంతర ముంది. అయితే ఒక ప్రశ్న. ఇవి కలిగినంత సులువుగా అది కలుగుతుందా. అలాటి భయమక్కర లేదు. ఎందుకంటే మొదటనే చెప్పామొక రహస్యం. ఆత్మ అనాత్మ రెండూ



Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

ఒక దానితో ఒకటి తెగ దెంపులు చేసుకున్నవి కావు. ప్రతి పదార్ధంలోనూ కలిసిపోయే ఉంటాయి రెండూ. సామాన్య రూపంగా ఒకటి. విశేష రూపంగా ఒకటి. అందులో ఆస్తి – భాతి సామాన్యమైతే నామం రూపమనేవి విశేషం. ఈ రెండంశాలూ కలిసి ఉండని పదార్థామంటూ లేదు. భావమంటూ లేదు సృష్టిలో. ఇక మనకేమి భయం. నామ రూపాలను చూచి తదాకారంగా మన మనసు ఎలా మారుతుందో అక్కడే ఉన్న సచ్చిత్తులను చూచి అలాగే మారిపోవచ్చు గదా.

మనసు కొక లక్షణ ముంది. అది ఏది భావిస్తే అలా మారిపోగలదు. సాకారమే కానక్కరలేదు. నిరాకారాన్ని కూడా భావించగలదు. పృథివ్యాదులైన సాకారాలను మన మెలా చూస్తున్నామో నిరాకారమైన వాయువాకాశాలను గూడా చూడ గలుగుతున్నాము గదా. చివరకు సుఖ దుఃఖాదులైన భావాలు ఎంత నిరాకారమైనా అనుభవానికి వస్తున్నాయి గదా ! దీన్ని బట్టి ఆత్మ కూడా నిరాకార మైనప్పటికీ అది ఒక ప్రతిబంధకం కాదు. ఆకాశం లాగే దాన్ని గూడా అనుభవానికి తెచ్చుకోవచ్చు. ఎలాటి ఇబ్బంది లేదు. పైగా ఆకాశం లాగా విషయం కూడా కాదది. నా స్వరూపమే. కనుక ఇంకా సన్నిహితం నాకు.

ఎటు వచ్చీ దీన్ని భావించినట్టు దాన్ని భావించటాని కలవాటు పడలేదు మనం. అలవాటనేది చేసుకుంటే అవుతుంది. లోకంలో కూడా అంతే కదా. వంటా వార్పు దగ్గర నుంచి సంగీత సాహిత్యాదుల వరకు అంతా మన అభ్యాసం మీదనే ఆధార పడ్డది. అదే సూత్ర మిక్కడ. పోతే బద్ధకించకుండా సాగించాలి ప్రయత్నమనేది. అందుకే చెప్పారు శ్రవణ మనన నిది ధ్యాసన లనే మూడింటిని. శ్రవణమనేది మన దృష్టిని అనాత్మ వైపు నుంచి ఆత్మ వైపు మళ్ళిస్తుంది మొదట. దానితో ఆత్మ విషయమైన

వృత్తి లేదా జ్ఞాన మేర్పడుతుంది. కాని దానితో పాటు అనాత్మ వృత్తులు కూడ కలుగుతూనే ఉంటాయి. కనుక వాటిని పోగొట్టు కోవాలంటే తరువాత మననమనే దాన్ని సాగించాలి మనం. దీనితో అనాత్మ కూడా ఏదో కాదు ఆత్మే అలా భాసిస్తున్నదని రెండింటికీ ఉన్న వైరుధ్యం తొలగి పోతుంది. మొదటిది అజ్ఞానానికి జవాబైతే ఇది సంశయానికి నివర్తకం. మానసికంగా ఇలాంటి నిశ్చయ జ్ఞానం ఏర్పడినా బాహ్యంగా మరలా అనాత్మ ప్రపంచంతో వ్యవహరించక తప్పదు. అలాంటప్పుడు విజాతీయ భావాలు తొంగి చూస్తూనే ఉంటాయి. శరీర మున్నంత వరకూ వ్యవహారం తప్పదు. ప్రారబ్ధ మున్నంత వరకూ శరీర సంపర్కం తప్పదు. కాబట్టి దేహ పాతమయ్యే వరకూ ఆత్మ వృత్తికి ఆనాత్మ వృత్తులతో పోరాట ముండనే ఉంటుంది. కాబట్టి వాటికి పరిష్కారం వెదకి పట్టుకోవాలి మనం. ఈ పరిష్కారమే సాధన మార్గంలో మూడవదైన నిదిధ్యాస. ఆనాత్మ వృత్తు లుదయిస్తుంటే వెంట వెంటనే వాటిని ఆత్మ వృత్తిగా మార్చుకుంటూ తదేక నిష్ఠతో కాలం గడపటమే నిది ధ్యాస. ఇవి మూడూ కలిసి ఒక వడ్ల దంపకం లాంటిదని వర్ణిస్తారు భాష్యకారులు. బియ్య మయ్యే వరకు దంచవలసినట్టే ఆత్మ దృష్టి నిలబడే వరకూ ఈ శ్రవణాదులు మూడు పాటిస్తూ పోవలసిందే. దృష్టి నిలబడితే అదే నిష్ఠ అదే సాక్షాత్కారం. బ్రతికుండగా ఇది సిద్ధిస్తే జీవన్ముక్తి. దేహపాతమైతే మరొకదేహమనే ప్రసక్తి లేదు. కాబట్టి విదేహముక్తి.

అయితే ఒక్క మాట. ఆత్మా కార వృత్తి అనేది మనసులో కలిగేది కదా ! మరి బాహ్యమైన అనాత్మ ప్రపంచం దాని వల్ల ఆత్మగా మారటమెలా సంభవం. ఎందు కంటే ఒక పట్టణం తాలూకు వృత్తి వేరు. ఆ పట్టణం వేరు. పట్టణానికి సంబంధించి మనసులో కలిగే వృత్తే పట్టణం కాదు. ఇది దాని ప్రతి చ్ఛాయ పట్టణమనేది బాహ్యంగా ఉన్న పదార్థం. అది బింబమైతే

దాని ప్రతిబింబమే మన మనసులో ఏర్పడే వృత్తి. ఇదే బింబం కాదు. ఈ ప్రతి బింబాన్ని బట్టి ఆ బింబమెక్కడ ఉందో అన్వేషిస్తూ పోవాలి. అప్పుడే దాన్ని మనం చూడగలం. ప్రస్తుతం మీరు చెప్పేది చాల విడ్డూరంగా కనిపిస్తుంది. ఆత్మా కార వృత్తి అంటున్నారు. ఈ వృత్తే ఆత్మ ఎలా కాగలదు ? వృత్తి మానసికం. ఆత్మ తద్వి లక్షణం.

ఇది ప్రతి ఒక్కరికీ పట్టుకున్న సందేహం. దీనికి సమాధాన మేమంటే లోకం లాంటిది కాదిక్కడ వ్యవహారం. లోకంలో వస్తువెక్కడో ఉంటే దానికి చెందిన భావం మాత్రమే మనసులో ఏర్పడుతుంది. రెంటికీ ఎంతో కొంత దూరముంటుంది. కనుక ఇదే అది కాదు. పోతే ఇక్కడ వస్తువేదో కాదు. సచ్చిత్తులని చెప్పాము. అది సామాన్య రూపం గనుక లోపల వెలపల అనే తేడా లేకుండా సర్వత్రా వ్యాపించి ఉంది. అలాంటప్పుడు తదాకారమైన జ్ఞానానికి భిన్నంగా అది ఇక ఎక్కడ ఉండగలదు పైగా జ్ఞేయం కాదది. కేవలం జ్ఞానమే. నిరాకారం గనుక సర్వవ్యాపకం. సర్వ వ్యాపకమనే వృత్తే మనకేర్పడే వృత్తి కూడా. అలాంటప్పుడు రెండు వ్యాపకాలెలా ఉండగలవు? రెండూ కలిసి ఒకటే కావలసి ఉంది. ప్రమాణమైన వృత్తికి భిన్నంగా ప్రమేయమైన ఆత్మ లేదు. అది ప్రమేయం కాదు కూడా.

కనుకనే ఆత్మాకారమైన వృత్తి అఖండమని పేర్కొనటం. అఖండమైన జ్ఞానమే కదా ఆత్మ. అంచేత ప్రమాణమైనా అదే ప్రమేయమైనా అదే. తానే ప్రమాణమై తానే దానికి ప్రమేయమై తన్ను తానే పట్టుకుంటున్నది. 'ధ్యానే నాత్మని పశ్యంతి - కేచిదాత్మాన మాత్మనా' - అని శాస్త్రం చెపుతున్నది. తానే అని తెలియక తన స్వరూపాన్ని వృత్తి జ్ఞానమనే ప్రమాణంతో అన్వేషించి అన్వేషణ పూర్తి అయ్యే సరికి అది తానేనని గ్రహించటమే చివర కద్వైత సాధన. ఒక విధంగా సిద్ధ సాధన మిది.

ఇంతకూ కొండను త్రవ్వి ఎలుకను పట్టి నట్టయింది మనం. మన స్వరూపాన్ని మనమే మరచి పోయి మరల మనమే దాన్ని ఫలానా అని గుర్తించాము. కనుకనే ఒక రహస్యం గుర్తుంచుకోవాలి మనం. అద్వైతంలో క్రొత్తగా ఏదో ప్రయత్నించి పట్టుకుంటామనే ప్రశ్నే లేదు. ఉన్నదేదో అదే ఉంది. లేని దసలు లేనే లేదు. లేనిదాన్ని లేదనుకోవటం - ఉన్న దాన్ని ఉందనుకోవటమే అద్వైతులు చెప్పే సాధన. మెడలో ముత్యాల హారం ఉన్నా గుర్తులేక ఎక్కడో తీసి పెట్టామని వెతుకుతూ వచ్చాము. చివరకయ్యో నామెడ లోనే ఉందని గుర్తించి వెతకటం మానేశాము. ఆత్మాన్వేషణ ఇలాంటిది. "ప్రాప్తస్య ప్రాప్తిః" అంటారు దీన్ని. పొందిన దాన్నే పొందటం. అలాగే "పరిహృతస్య పరిహారః" వదిలేసిన దాన్నే వదులు కోటం. అనాత్మ విషయం ఇలాంటిది. ఇది నాకు అన్యంగా లేకున్నా ఉందని భావించాము. పూల దండ కాలికి తగిలితే పామని ఉలికిపడ్డట్టు. దీపం వెలుగులో చూచి పాము లేదనుకొన్నట్టే మరల ఈ అనాత్మ జగత్తు లేదని గ్రహిస్తాము.

ఇంతకూ విషయ మేమంటే అనాత్మ ఉందనే భ్రమ ఒకటి - ఆత్మలేదనే భ్రమ ఒకటి రెండూ భ్రమలే మనకు. ఇవి రెండూ పోనంత వరకూ సమస్య సమస్యే. పరిష్కారం లేదు. భ్రమ తొలగించు కోటమే పరిష్కారం. రెండింటిలో ఆత్మ లేదనే భ్రమే మొదట తొలగించు కోవలసింది. ఎందుకంటే ఒకటి పట్టుకొంటే గాని ఇంకొకటి వదిలేయటం సాధ్యం కాదు. కనుక ఆత్మను పట్టుకొనే అనాత్మ భావాన్ని కొట్టి వేయాలి. ఆత్మ నెలా పట్టుకోవటం ? నా స్వరూపాన్ని దేహాది సంఘాతంగా కాక సచ్చిదాకారంగా భావిస్తూ పోవాలి. అలా భావిస్తే మనసులో తదాకార వృత్తి ఏర్పడుతుంది. అది మహా సామాన్యం కనుక ఆ దృష్టితో చూస్తే దృశ్య ప్రపంచ మంతా తదాకా రంగానే మారి కనిపిస్తుంది. వస్తువైతే

మారదు. ఆ భాస అయితేనే మారుతుంది. ప్రపంచ మాత్మకు ఆభాసే గనుక ఆత్మ ఫలానా అని గుర్తిస్తే చాలు. అందులోనే అనాత్మ కూడా లయమౌతుంది.

అయితే ఒక చిక్కున్న దిక్కడ. మనసనే ప్రమాణం మన దగ్గరే ఉంది. పరమాత్మ అనే ప్రమేయ మెక్కడబడితే అక్కడ ఉన్నది. అయినా ఇది దాన్ని పట్టుకోలేక పోతున్నది. అంటే తదాకార వృత్తి ఏర్పడడ మసాధ్యమని తోస్తుంది. సాధ్యమే అయితే శ్రవణం చేసిన ప్రతి వాడికీ కలగాలి కదా ఆ వృత్తి. 'మనుష్యాణాం సహస్రేషు' అన్నట్టు కోటి కొకడికి కలిగితే ఎక్కువ. ఏమి కారణం ?

ప్రమేయం తప్పు కాదది. సర్వత్రా అది ప్రకాశిస్తూనే ఉంది. పోతే దాన్ని పట్టుకొనే మనసనే ప్రమాణం తాలూకు దోషమే కావాలి. వస్తు సిద్ధమైనా బుద్ధి సిద్ధం కావటం లేదు. కాకపోవటానికి బుద్ధిదే దోషం. ఇది రెండు విధాలు. ఒకటి ఆవరణం. మరొకటి విక్షేపం. ఆవరణమంటే మాలిన్యం. ఒక అద్దానికి అంటిన మసిలాంటి దది. మసి పూసిన అద్దమెలా కనపడదో అలాగే కొన్ని బుద్ధులు సహజంగానే అసమర్థమై ఉంటాయి. ఒక గొప్ప భావాన్ని ఎంత బోధించినా అందుకో లేవు. అలాగే మరి కొన్ని బుద్ధులు విన్న వెంటనే అందుకోగలవు. వాటికా సామర్థ్య ముంది. కాని అవి చెప్పిన విషయాన్ని గాక దానికి భిన్నంగా మరేదో పట్టుకొని సతమతమౌతాయి. ఇది పగిలిపోయిన అద్దంలాంటిది. బింబం కనపడుతుంది కాని ముక్కలు చెక్కలయి కనిపిస్తుంది. ఇందులో మొదటిది ఆవరణం. రెండవది విక్షేపం. ఒక మనస్సు కసలు స్ఫురించదు. మరొక దానికి ఛిన్నా భిన్నంగా స్ఫురిస్తుంది. ఇదే మన కవస్థాత్రయ రూపంగా తయారయింది. సుషుప్తిలో అసలే లేదు స్ఫూర్తి. జాగ్రత్ స్వప్నాలలో ఉన్నా అది ఆయా విశేష రూపాలుగా స్ఫురిస్తున్నది.

కనుక ఆత్మాకార వృత్తి కలగాలంటే శ్రవణాదుల మాట అటుంచి ముందు మన మనస్సును సంస్కరించుకోవాలి. అందుకే కర్మయోగ మొకటి ఉపాసనా లేదా భక్తి యోగ మొకటి చెప్పవలసి వచ్చింది శాస్త్రం. నిషిద్ధ కామ్య కర్మలు రెండూ మానేసి సత్కర్మలు మాత్ర మాచరిస్తూ పోతే మనస్సుకు శుద్ధి ఏర్పడుతుందని చెబుతారు. కాని కేవల కర్మానుష్ఠానం కన్న కర్మ యోగం మంచిది. అందులో 'అహం' 'మమ' లుండవు. అలాగే సమాధి, భక్తి యోగాల వల్ల మనసు కొక లక్ష్యం మీద ఏకాగ్రత ఏర్పడుతుంది. శుద్ధి మాలిన్య రూపమైన ఆవరణానికి జవాబు చెపితే - ఏకాగ్రత విక్షేపానికి చెబుతుంది. దానితో మనసు బాగా పరిపాకానికి వచ్చి పదునెక్కి శ్రవణాదులు చేయటాని కున్ముఖ మౌతుంది. కనుక ఆత్మాకార వృత్తి ఉదయించటాని కిక అభ్యంతరం లేదు.

అయితే ఇది సాంప్రదాయికంగా చెప్పిన మాట. సాధకుడైన వాడు చెప్ప వలసిందేమంటే కర్మ, భక్తి, సమాధులు ప్రత్యేకంగా ఒక్కొక్కటే అభ్యసిస్తూ పోతే అందులోనే పడిపోయే ప్రమాద ముంది. అది జ్ఞానానికి దారి తీసే ఆలంబనమే కాని గమ్యం కాదనే ఆలోచన రాదు మానవుడికి. ఏది అలవాటైతే అది వదులుకోటం కష్టం. కాబట్టి అవి ఏవో వేరుగా ఉన్నాయను కోకుండా ఆత్మను గురించి చెప్పే మాటలు నిరంతరమూ వింటూ ఉండటమనే కర్మ చేస్తూ ఉంటే చాలు. అదే కర్మ యోగం. సత్సంగమూ, సద్గోష్ఠి, సద్గ్రంథ పఠనమూ, ఇదే కర్మ యోగం. జ్ఞానాని కుపకరించే కర్మే నిజమైన యోగం. అలాగే ఆ స్వరూపం మీదనే మనసు నిలపటం సమాధి యోగం. నిరాకారమైన దానినే సాకారమైన ప్రతి పదార్థంలోనూ దర్శిస్తూ పోవటమే అసలైన భక్తి యోగం. ఈ విధంగా ఇవి మూడూ జ్ఞానంలో మూడు భాగాలుగా మారి దానితోనే ముడిపడి ఉండటమే యోగమనే మాట

కర్థం. అప్పుడే అన్నింటికీ కలిపి ఏక వాక్యత లేదా ఏక సూత్రత ఏర్పడుతుంది. ఒకే ఒక సూత్రంలో మూడూ పూసలుగా మారి కనిపిస్తాయి. ఇదే అసలైన అద్వైత సాధన.

అయితే ఇప్పుడు మరి ఒక ఈతి బాధ ఉంది ఈ సాధన మార్గంలో. అనుకున్నంత సులభం కాదిది. కాకుల లెక్కగా సిద్ధాంతం మాటాడినా కార్యరంగంలోకి దిగితే ఎన్నో ఉన్నాయి చిక్కులు. ముందు పేర్కొన్న ఆవరణ , విక్షేపాలు అలా ఉంచి అసలు సాధనే మనం చేయగలమా అని సందేహం. ఎందుకంటే ప్రారబ్ధ మనేది ఒక దయ్యం లాగా తయారయింది మన జీవితంలో. జీవిత మంతా అదే రాజ్యం చేస్తున్నది. ప్రాప్తం లేనిదే ఏదీ ఆలోచించలేము. చేయలేము. ఫలిత మాశించలేము. అంతా మన ఆధీనంలోనే ఉంటే అందరూ అన్నీ సాధించ వచ్చు గదా ! సాధించటం దేవుడెరుగు. అసలు బుద్ధే పుట్ట దెంతో మందికి 'శ్రవణాయాపి బహు భి ర్యో నలభ్యః'– అని శాస్త్రమే చాటుతున్నది. అలాంటప్పుడిక మన ప్రయత్న మేమిటి ఫలితమేమిటి. వ్రాసి పెట్టక పోతే ఏదీ లేదు. జీవితంలో ధన ధాన్య వస్తు వాహన పుత్ర పౌత్ర సుఖ దుఃఖాది భావా లెలా ప్రార బ్ధాని కధీనమో అలాగే అధ్యాత్మ జీవితంలో కూడా శ్రవణ సాధన ఫలాను భవాదులు కూడా ప్రారబ్ధాధీనమే. అలాంటప్పుడు దానికే వదిలేస్తే సరిపోదా. ప్రయత్నం పెట్టుకొనే చింత మనకు దేనికి ?

ఇది ఒక పెద్ద అపోహ. పిన్నలు పెద్దలు చాలా మందికి పట్టుకున్న జిడ్డిది. యథార్థ మేమిటో తెలియక గాబరా పడుతున్నారందరూ. ప్రారబ్ధ మున్నదనే మాట వాస్తవమే. అది మామూలు లోకులకే కాదు. జీవన్ముక్తుడికి కూడా ఉంది ఆమాటకు వస్తే. కాని దానితో పాటు పురుష ప్రయత్నం కూడా ఒకటుందనే సత్యం మరచి పోతున్నారు. ప్రారబ్ధం మన ప్రయత్నాని

కద్దురాదు. ఎలాగంటే భూతానికి సంబంధించినది ప్రారబ్ధం. భవిష్యత్తుకు చెందినది ప్రయత్నం. అది అతీతమైతే ఇది వర్తమానం. జీవుడు భోక్తే గాక కర్త కూడా. భోక్త గనుక ప్రారబ్ధ ఫల మొకప్రక్క అనుభవిస్తుంటాడు. కర్త కనుక మరొక ప్రక్క ప్రయత్నం సాగిస్తుంటాడు. అలా కాకుంటే అసలీ ప్రారబ్ధ మెలా తయారయింది. ఒకప్పుడు మానవుడు చేస్తేనే కదా. కాబట్టి అనుభవించే గుణమెలా ఉందో చేసే లక్షణం కూడా ఉంది మనకు. రెండింటి సంగమ స్థానమే మన ఈ వర్తమాన జీవితం.

అంచేత మనమిక బీద పలుకులు పలకరాదు. ప్రారబ్ధ ఫలానుభవం తప్పించుకొనే శక్తి లేదు మానవుడికి. కాని ప్రయత్నం చేసి జీవిత గమ్యాన్ని అందుకోటాని కెంతైనా ఉంది అవకాశం. గతం మన వశంలో లేకపోవచ్చు. భవిష్యత్తు అంతా మన కధీనమే. కనుక ప్రారబ్ధం కొద్దీ ఎప్పటికప్పుడు సుఖదుఃఖాదు లనుభవిస్తున్నా దానితో పాటు ఎప్పటికప్పుడు శ్రవణ మననాదులు కూడా ప్రయత్నంతో సాగించవచ్చు. ప్రారబ్ధ మింతకు ముందు చేసిన అప్పు. అనుభవిస్తే తీరిపోతుంది. ఎంతో కాలం బాధించదు. ప్రయత్న మలా కాదు. అది నిత్యమైన ఆత్మకు సంబంధించిన నిక్షేపం. తీరిపోయేది కాదిది. అక్షయంగా ఉండిపోయే ధనం.

కాబట్టి ప్రారబ్ధం మీద కాదు చూపు పెట్ట వలసింది. పెడితే అదే మనకొక ప్రారబ్ధ మౌతుంది. మరెక్కడ పెట్టాలి దృష్టి. ఆత్మ జ్ఞానం కోసం శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేయటంలో. మొదటిది ప్రతిలోమమైతే రెండవది అనులోమం. కనుక ఎంత చేస్తే అంత ఫలిత మిస్తుంది. ప్రారబ్ధం ఫలానుభవంతో సమసిపోయేదయితే - ప్రయత్నం సమసిపోని ఫలానుభవం. కాబట్టి ఆత్మ సాధకుడిక వెనక్కు చూడకుండా ముందుకు దూసుకొని పోవటమే. వెనక్కు తిరిగితే ప్రారబ్ధమే కనిపిస్తుంది. ముందుకు

పోతే ప్రయత్నం ఫలిస్తుంది. చివరకు మోక్షమనే మహాఫలాన్నే సాధకుడు చవి చూడగలడు.

అయితే ప్రయత్న మన్నారు. ఎంత కాలం చేయాలది ? ఎలా చేయాలి ? అన్ని పనులు మానుకొని అదే పట్టుకొని కూచోవాలా ? లేక మిగతా పనులు చేస్తూ ఇదీ చేయవచ్చా ? అలా చేస్తూ పోతే ఎప్పటికి ఫలితమిస్తుంది. జీవితంలో ఇస్తుందా? లేక మరణానంతరమా. ఎలా ఉంటుందా ఫలితం ? అది మరణానికి ముందే కలిగితే మరణమెలా ప్రాప్తిస్తుంది ? అనంతరమైతే కలిగిందో లేదో నమ్మకమేమిటి – అని ప్రశ్న పరంపర ఎదురౌతుం దిప్పుడు.

ఒక్కొక్కటి పరిశీలించి చూతాము. ఎంత కాలం చేయాలని గదా ప్రశ్న. "సతు దీర్ఘ కాల నైరంతర్య సత్కార సేవితో దృఢ భూమిః" అన్నాడు పతంజలి. ఇంత కాలమని పరిమితి లేదు. ఫలితాన్ని బట్టి ప్రయత్నం. వడ్ల దంపకం వంటిదని చెప్పాము. బియ్య మయ్యే వరకు ఎలా దంచుతూ పోవాలో అలాగే ఆత్మ దర్శన మయ్యే వరకు సాధనే. అది నైరంతర్యం. అంటే పది రోజులకో పది నెలలకో ఒక సారిగా కాక ప్రతి క్షణమూ కనీసం ప్రతి దినమూ సాగాలి. అలాగే మొక్కుబడి తీర్చినట్టుగా గాక ఇది మన జీవితమే నని సత్కార బుద్ధితో జరగాలి. అలా అయితేనే గట్టి పడుతుంది.

అంతే కాదు. ప్రతి దినమూ కూడా దినమంతా మనది కాదు. స్వప్న సుషుప్తులు రెండూ ప్రారబ్ధాని కధీనం. ప్రయత్నాని కాస్కారం లేదక్కడ. పోతే ఇక జాగ్రత్తు. అందులోనూ రోగాలు రొష్టులు, పెండ్లిండ్లు, పేరంటాలు, ఇల్లు వాకిలి ఏర్పాట్లు చుట్ట పక్కాలు లోక వ్యవహారాలు ఎన్నో అవసరాలు ఏర్పడుతుంటాయి. అలాంటప్పుడీ ఆత్మాకార వృత్తినే పట్టుకొని కూచోలేము.



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

జారిపోతుంటుంది. అసలు పత్తా లేకుండా ఎగిరిపోయినా ఆశ్చర్యం లేదు. అంచేత మన పనులతో పాటు అది కూడా పాటించట మనేది పొసగదు. పోనీ పనులు మానుకొని చేద్దామంటే జీవిత అవసరాలకు స్వస్తి చెప్పి బ్రతకలేము. పనులు పూర్తి అయిన తరువాత సాగిద్దామా అంటే మళ్ళీ పనులు పడితే మాసిపోతుంది. అది కేవలం గజస్నానమే.

మరి ఎలాగా పరిష్కారం. అందుకే అత్యవసరమైన పనులు మాత్రం పెట్టుకోమన్నారు శాస్త్రజ్ఞులు. 'యుక్త చేష్టస్య కర్మసు' అలాగైతే అవకాశ మంత కంతకు ఎక్కువగా దొరుకుతుంది. అప్పుడు బాగా అభ్యాసం చేస్తూ పోవచ్చు. అది బలం పుంజుకొని ఆ సంస్కారం పనులు పెట్టు కొన్నప్పుడు కూడా పనిచేస్తుంది. పనుల వల్ల కలిగే భారం దీని వల్ల తగ్గుతూ వస్తుంది. ఇదే ఉపాయం. వేరొకటి లేదు. కొంత కాలానికి జ్ఞానానుష్ఠానమూ జీవితావసరాలూ రెండూ పరస్పర విరోధం లేకుండా రాజీ పడి ఏక కాలంలో జోడు గుఱ్ఱాల లాగా దౌడు తీస్తూ పోతాయి. భయం లేదు. కనుక ఆత్మ వ్యవహారం లోక వ్యవహారాని కడ్డు తగలదు. ఇదీ దాని కడ్డు రాదు. సాధన చేసే వాడికి గాని ఈ రహస్యం తెలియదు.

పోతే ఎలా చేయాలి సాధన అని అడిగితే చెబుతున్నాము. యోగుల లాగా కళ్ళు మూసుకొని చేసే సాధన కాదిది. ఉపాసకుల లాగా ఒక మంత్రమో దేవతనో పట్టుకొని కూచోటమూ కాదు. కర్మిష్ఠుల లాగా మొక్కుబడి తీర్చినట్టు ఆయా కర్మ లాయా సమయాలలో ఆచరించి మిగతా సమయ మంతా లోక వ్యాసంగంతో గడపట మంత కన్నా కాదు. మరేమంటారు. అవన్నీ ఏక దేశ దృష్టి. నేను వేరు - ఈ చూచే జగత్తు వేరు - ఆ ఈశ్వరు డెక్కడో ఉన్నాడు వాడు వేరు - ఏదో చేసి ఏదో అందుకోవాలనే భేద భావన వదల కుండా చేసే సాధనలు.

పోతే మన దలాంటిది కాదు. నేనేమిటి ? నాదేమిటి ? మరొక టేమిటి – ఏది స్ఫురిస్తే అదంతా నా స్వరూపమే – అదే సర్వత్రా పరచినట్టు కనిపిస్తూ ఉందని 'అహం' 'మమ'లు రెండూ రెండుగా కాక ఏకం చేసి అది నా స్వరూపమని ఆత్మ దృష్టితో చూస్తూ పోవటమే మన సాధన. ఆత్మను ప్రపంచంగా కాదు ప్రపంచాన్ని ఆత్మగా దర్శించాలి. పరమాత్మ ప్రపంచమైతే ప్రమాదం. ఏక మనేక మౌతుంది. నిరాకారం సాకారమౌతుంది. పరిపూర్ణం పరిచ్ఛిన్న మౌతుంది. అలా కాక ప్రపంచాన్నే పరమాత్మగా చూస్తే ఆ మూడు దోషాలూ తొలగి పోతాయి. ద్వైతంగా కాక అప్పు డద్వైతంగా అనుభవ మేర్పడుతుంది. ద్వైతానుభవమే అయితే అది ఇప్పుడే ఉంది మనకు. క్రొత్తగా దాని కోసం ప్రాకులాడటం దేనికి. ముందు చెప్పిన వన్నీ ఇలాంటి ద్వైత సాధనలే. కనుకనే అవి సమస్యకు పరిష్కారం కావు. పరిష్కార మిప్పుడు చెప్పిన అద్వైత సాధనే. ఇది జీవ జగదీశ్వరులను మూడింటినీ ఆత్మా కారంగా మార్చి చూపుతుంది కనుక పరిష్కారం ఇదే నని సిద్ధాంతం చేశారు మన పెద్దలు.

అది ఎలాగా ఆ ప్రక్రియ అని అడగవచ్చు. సాధకుల కోసం కొన్ని మాటలు. చెప్పవలసి ఉందిక్కడ. సామాన్య విశేషాలు రెండూ కలిసే ఉంటాయని మొదటి నుంచీ చెబుతూనే వచ్చాము. సామాన్య స్పర్శ లేని విశేష మంటూ ఏదీ లేదు. కాని మన దృష్టి ఎప్పుడూ విశేషానికే అలవాటు పడ్డది. అందుకే వాటిలోనే కూరుకుపోతున్నది. ఎంతెంత దిగిపోతుందో అంతంత సామాన్యానికి దూరమవుతూ ఉంది. సామాన్య మక్కడ లేక కాదు. వస్తుసిద్ధంగా ఉండనే ఉంది. ఎటువచ్చీ అది మనకు బుద్ధి సిద్ధం కావటం లేదు. బుద్ధి దాని మీద పడితే చాలు సిద్ధంగా ఉంది ప్రతి ఫలించటానికి. ప్రతి ఫలిస్తే చాలు బుద్ధి దర్పణం దానితో నిండిపోతుంది. పోతే అది ఇక

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

బుద్ధి కాదు. ఆత్మే. అది మహా సామాన్యం కాబట్టి లోపల ఆలోచన బాహ్యంగా పదార్థం అనే తేడా లేదు. మహా అయితే లోపల చిత్సామాన్యం – వెలపల సత్సామాన్యం. దానితో దీన్ని చూస్తూ పోతాము కాబట్టి అది దీనిలో ఇది దానిలో కలిసి సచ్చిదాకారంగా ఒకే అఖండమైన అనుభవం కలిగి తీరుతుంది. అసాధ్యమేమీ కాదు. సొమ్ములన్నిటిలో బంగారమూ, పాత్రలన్నిటిలో మృత్తికా చూచినట్టే విశేష రూపంగా కనిపించే చరాచర పదార్థలన్నిటిలో కేవలం స్థితి రూపంగా విస్తరించినట్టు చూడవచ్చు. ఆయా వ్యవహారాలు జరుగుతుంటే అచలమైన ఆ స్థితే చలిస్తున్నట్టు భావించాలి. జలంగా అచలం. తరంగంగా చలమని ఒక సముద్రాన్ని చూచినట్టే మనదేహం మొదలు ప్రపంచం వరకు అన్నింటినీ ఒకే ఒక అస్తి – భాతి – అనే సూత్రంతో చేర్చి పట్టు కోవాలి. జారి పోతుంటే మరలా దానిలోనే చేర్చుకోవాలి. జారినప్పుడది విశేషంగా తోస్తుంది. జారకుంటే మరల సామాన్యం గానే మారి దర్శన మిస్తుంది.

అయితే ఎన్నో ఆలోచనలు, పనులు పెట్టుకొని వాటిలో నిరంతరమూ తల దూరిస్తే మాత్రం ప్రయోజనం లేదు. ధారణ చాలదు. కుంపట్లో వేసిన బొగ్గులు నిప్పు కావాలంటే నిప్పుకణిక శక్తిని మించి బొగ్గు లందులో పడకూడదు. పడితే బొగ్గులు నిప్పు కావటమలా ఉంచి నిప్పే బొగ్గుగా మారుతుంది. నామరూపాలు బొగ్గులు. అవి సచ్చి ద్రూపంగా మారాలంటే సచ్చిదాకార వృత్తిని దెబ్బ తీసేటన్ని వ్యాసంగాలు పనికిరావు. జీవనానికి కావలసిన పనులే పెట్టుకోవాలి సాధకుడు. మిగతా సమయమంతా ఆత్మాకార వృత్తి నవలంబించి కూచోవాలి. అప్పుడు దానికి బలం తగ్గి ఇది బలం పుంజుకోగలదు. మనం కూడా ఉత్సాహంతో ముందుకు సాగి పోగలం. జాగ్రత్తు సరే. నిద్రాదులు, రోగాదులు సంక్రమించి

నప్పు డెలాగా అప్పుడు మనకు స్ఫురణే లేదు గదా అని సందేహించవచ్చు. ఇది నిరంతర మా వృత్తి అయితే ఈ వృత్తి వల్ల ఏర్పడే సంస్కారం వృథా పోదు. అక్కడ కూడా పని చేస్తుంది. ఒక తైల బిందువు లాగా అంతటా విస్తరిస్తుంది.

అయినా మనసు మొద్దు బారినా - రేపు మరణమే సంభవించినా ఈ ఆత్మ వృత్తి నిలుస్తుందా ? మనం నిలుపుకోగలమా ? జీవన్ముక్తుడికి కూడా మరణం తప్పదని చెబుతున్నారే. అప్పుడీ ఆత్మ జ్ఞానమే మైంది జీవితంలో దాఖలా కాకుంటే మరణానంతరం ముక్తు డయ్యాడో ? లేదో నమ్మకమేమిటి అని ప్రశ్న వస్తుంది. నిజమే. ఆత్మ వృత్తి నిద్రాది దశలలో నిలుస్తున్నట్టు మనకు కనిపించదు. అంతెందుకు. బాల్యంలో లేదీ జ్ఞానం. తర్వాత ఎప్పుడో శ్రవణాదులు చేస్తే ఉదయిస్తున్నది. మరలా అవసానంలో సడలిపోతున్నది. ఇందు వల్లనే లోకులందరికీ దీని విషయంలో అను మానం సహజంగానే ఏర్పడుతున్నది. నలుగురికీ ఇది ప్రత్యక్ష సిద్ధమైన విషయం.

కాని అంతకన్నా ప్రత్యక్ష సిద్ధమేదో తెలుసా. ఇప్పుడు నీవు వర్ణించిన అన్ని దశలలో గూడా ఆ దశలే కాదు నీవు కూడా ఉన్నావు. నీవే లేకపోతే వ్యాధి. మూర్ఛా మరణాదులైన ఈ దశ లను భవిస్తున్న దెవరు. వాటినవే కాదు కదా. జ్ఞానమే జ్ఞేయాన్ని అనుభవిస్తుం దెప్పుడూ. జ్ఞానమే నీవు. మరి నీవు లేకుండా పోయిందేమిటి. లేకుండా పోయేదవి. వస్తాయి ఉంటాయి పోతాయి. జన్మ ఇప్పుడుందా నీకు. గడచి పోయింది. మరణ ముందా ఇప్పుడు. ఎప్పుడో వస్తుంది. నీవో వాటి రెండింటినీ అనుభవించాలి గాబట్టి అప్పుడూ ఉన్నావు తరువాతా ఉండబోతావు. ఇప్పుడెలాగూ ఉంటూనే ఉన్నావు. సర్వదా వర్తమానమే నీ స్వభావం. భూతమూ భవిష్యత్తూ కాదు. భూత భవిష్యత్తులు నీవు అనుభవించే జ్ఞేయ ప్రపంచం తాలూకు అనుభవాలు.



Vallabhajosyula Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

ఇప్పుడు కూచొని ఆలోచిస్తున్నావు నీవు ఎప్పుడో పుట్టానని ఎప్పుడో మరణిస్తానని. ఇంతకు ముందు మరణించిన నీ పెద్దలందరూ నీకు గుర్తుకు వస్తుంటారు. మనం పోయినా ఈ ప్రపంచ ముంటుందని – పోయేది అయితే తండ్రి తాతలతో పాటు ఈ పాటికే పోయి ఉండేది గదా ! అలాగే రేపు నాసంగతీ అని – ఏవోవో భయాలు బాధిస్తుంటాయి నిన్ను అనుక్షణమూ. కాని ఒక్క మాట ఆలోచిస్తే చాలు. ఇదంతా నీ భ్రమేనని తేలిపోతుంది. ఎలాగంటే అసలేది ఆలోచించినా నీవే గదా ఆలోచిస్తున్నావు. నీ జన్మ నీవు చూడలేదు. ఇప్పుడది మనసుకు వస్తే అది నీ ఆలోచనే. అలాగే నీ మరణమింకా నీకు ప్రాప్తించలేదు. ఎప్పుడో ప్రాప్తిస్తుందని ఇప్పుడు నీకు కలిగే ఆలోచనే. నీ వున్నచోటనే ఉంటూ నీ ఆలోచనే అటూ ఇటూ తిరుగుతున్నది. నీవు స్థితి. నీ ఆలోచన గతి. స్థితే ఆలోచిస్తే గతిగా మారుతుంది. ఆలోచన మానేస్తే స్థితి గానే అనుభవానికి వస్తున్నది. ఆద్యంతాలలో స్థితే. గతి లేదు. జనన మరణాలనేవి ఇప్పుడు నీ ఉన్న స్థితి కాద్యంతాలే గదా. నీవు కదలకుంటే అవి కనిపించవు. నీకు నీవే కనిపిస్తుంటావు. ఏదో కనిపిస్తున్న దనుకోటం వల్ల ఆ అవస్థలలో పడ్డావు నీవు. అనుకోక పోతే నీ పాటికి నీవుంటావు. అప్పుడీ జనన మరణాద్యవస్థ లేవీ నీమనసుకు రావు.

కాకపోయినా ఒక్క సంగతి. నీవేది ఆలోచించినా అది ఆభాసే కదా. వస్తువొక్కటే. అది నీ జ్ఞానం. నీ స్వరూపమే అది. పుట్టినప్పటి నుంచి గిట్టే దాకా ఉంటూనే ఉందది. ఉంటుందని నీకు చెప్పనక్కర లేదు. అది నీ అనుభవం. మరి దానికేది తగిలినా వదిలినా అది ఇక ఆభాసే కదా ! దీన్ని బట్టి ఒక కష్టమనూ, సుఖమనూ, పుణ్యమనూ, పాపమనూ, లోకాంతరాలనూ, జన్మాంతరాలనూ. నీమనసుకు వచ్చేవే గదా

ఈ భావాలన్నీ. ఎవరం దిచ్చారివి. లోకమా శాస్త్రమా. అవి కూడా నీ జ్ఞానానికి సోకే భావాలే గదా ! జ్ఞానానికి సోకేది స్వరూపమెలా అవుతుంది. స్వరూపానికే అస్తిత్వం కాని తదాభాస అయిన ఏ భావానికీ స్వతహాగా అస్తిత్వం లేదు. రజ్జుసర్పానికి ఎలా లేదో తరంగ బుద్బుదాలకు ఎలా లేదో అలాగే ఆత్మ భిన్నమైన ఏ ఆలోచనకూ అస్తిత్వ ముండబోదు. ప్రస్తుతం ఇహపరాలకు సంబంధించిన వన్నీ నీ ఆలోచనలే కాబట్టి జనన మరణాదికమైన దేనికీ అస్తిత్వం లేదని చెప్పనక్కర లేదు. కనుక నీవు వాటిని తలచుకొని భయపడుతున్నా వంటే అది నీ నీడను చూచి నీవు భయపడటమే. నీడను గాదు నీవు పట్టుకోవలసింది. నిన్ను నీవే. నీ స్వరూపాన్నే నీవు గట్టిగా పట్టుకొంటే మిగతా నీకు కలిగే భావాలన్నీ నీ స్వరూపమనే తెర మీద వస్తూ పోయే బొమ్మల లాగా ఎప్పటికప్పుడు మాసిపోతున్నట్టు నీవు చూడగలవు.

అయినా మనకు ధైర్యం లేదు. దానికి కారణం శరీరాది ఉపాధులకు విలక్షణంగా మన స్వరూపాన్ని గుర్తించక పోవటమే. గుర్తించ గలిగితే జన్మించినపుడు ఉపాధే జన్మించింది నేను కాదు – రేపు మరణించేటపుడూ ఉపాధే పోతుంది. నేను కాదనే నిబ్బరంతో బ్రతుకు తుంటావు. స్థితే గాని నీకు గతి లేదనేది అక్షరాల నిజం. ఈ నిజాన్ని నిజం చేసుకోవాలంటే నేను సర్వవ్యాపకుణ్ణి అనే స్మృతి ఎప్పుడూ సడలిపోరాదు.

అలా సడలి పోనివాడే జీవన్ముక్తుడు. వాడు జీవితంలో కలిగే అన్ని దశలలోనూ ఆత్మ స్మృతితోనే ఉంటాడు. జీవితాంతమూ అలాగే దాన్ని పొడిగించు కొంటూపోతాడు. అలా ఉంటాడో లేదో ఏమిటి నమ్మకం ! ఇంతమందికి లేని స్మృతి వాడికి మాత్రం ఎలా కలిగిందంటావా – దానికొక్కటే మా సమాధానం. చంద్ర మండలానికి వెళ్ళి చూచి వచ్చాడొక

అంతరిక్షగామి. అది వాడి అనుభవమే. మనకెవరికీ లేదా అనుభవం. అయినా ఎలా నమ్మావది. పదిమందీ చెప్పుకొంటుంటే విని నమ్ముతున్నావు. అలాగే పది మంది బ్రహ్మవేత్తలు చెబుతున్నారు. ఏమని. జీవన్ముక్తుడైన వాడు కూడా ఒక చిదాకాశంలో ఎప్పుడూ పయనిస్తుంటాడు. అక్కడే నిత్యమూ నివసిస్తుంటాడని. మరి ఇది కూడా నమ్మవలసిందే గదా.

వాడెలా నివసించ గలిగాడా చిదాకాశంలో. చిదాకాశమే తన శరీరమని భావించి ఈ భౌతిక శరీరంలో నుంచి బదిలీ అయి అందులో ప్రవేశించాడు. క్రొత్తగా కూడా ప్రవేశించ నక్కర లేదు. చిదాకాశ మంటే ఆకాశం లాగా విస్తరించిన నీ నా జ్ఞానమే కదా. అది ఈ శరీరమే నేనను కొని ఇందులోనే కూచున్నా నీకిప్పుడూ సిద్ధంగానే ఉంది. నీవే అది. అయినప్పటికీ జ్ఞేయమైన ఈ శరీరమే నేనని చాలాకాలం నుంచీ అలవాటు పడ్డావు. కనుకనే ఇది వదిలేసి అది నేనని దానితో తాదాత్మ్యం చెందలేక పోతున్నావు.

అందుకే నిది ధ్యాసనా రూపమైన అభ్యాసం చేయవలసి ఉంది మన మంతా. అభ్యాసం చేసే కొద్దీ శరీరాత్మ వాసన దూరమయి దానికి మారుగా చిదాత్మ వాసన దృఢమవుతూ వస్తుంది. ఇంకా ఒక మాటేమంటే జడమైన ఈ శరీర మసలు వస్తు రూపంగా లేదు కదా. ఆభాసే గదా ఇది. లేని ఆభాసే ఇంత బలంగా నిన్ను పట్టుకొంటే ఉన్న వస్తువు నీ చైతన్యం నిన్ను పట్టుకోక పోవటమేమిటి. అన్యాయం. ఎటువచ్చీ తగినంత శ్రద్ధ లేదు నీకు. "శ్రద్ధా వాన్ లభతే జ్ఞాన" మన్నారు. కాబట్టి నిద్ర అని, రోగమని, మరణమని, పునర్జన్మలని, ప్రతిలోమంగా నిన్ను చూచి భయపడటం మానేసి అనులోమంగా అన్ని దశలలోనూ నేను సద్రూపంగా, చిద్రూపంగా, ఉంటూనే ఉన్నానని నిన్ను నీవు గట్టిగా పట్టుకొని కూచో.

అలా పట్టుకొంటే అది పోయిన బలం పుంజుకొని అసద్రూపమైన ఈ సమస్తాన్ని తనలోనే కలుపుకొని ఆత్మేమిటి అనాత్మేమిటి అంతా తన స్వరూపం గానే అనుసంధానం చేసుకోగలదు. ఎప్పటికీ అలాగే ఉండిపోగలదు. ఉంటే ఇక నాకూ నీకూ జననం లేదు. మరణం లేదు ఇహం లేదు. పరం లేదు. ఏదీ లేదు. నాకు నేనే. నాదీ నేనే. నేనూ నేనే. అనే అఖండాద్వయాత్మ భావం అనుక్షణమూ అనుభవానికి వస్తూ ఉంటుంది. దీనికే ఏకాత్మ భావమని, సర్వాత్మ భావమని పెద్దలు పెట్టిన పేరు. ఇది అందుకో గలిగితే జనన మరణాది జీవిత సమస్యలన్నింటికీ పరిష్కారం చేసుకొని సాధకులమైన మన మందరమూ ఈ జీవితంలోనే సిద్ధ పురుషులమై చివరకు మోక్ష సామ్రాజ్యానికి పట్టాభిషిక్తులం కాగలము.

★★★

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# ఉపనిష త్సందేశః

అ శరీరమ్ శరీరేషు - అనవస్థే ష్వవస్థితమ్ - మహాంతం విభు మాత్మానమ్ - మత్వా ధీరో న శోచతి - ఏష కఠోపనిష ద్గతః శ్లోకః- కోస్యార్థః - అశరీరమితి ఆత్మనస్తత్త్వమ్ - కేవల చైతన్య రూపమేవతత్ - చైతన్యస్య నిరాకారత్వాత్ తత్సర్వత్ర జాగర్తి - దేశకాల వస్త్వాదికమ్ జగ దిదమ్ తస్య కదా పి న నిరోధకమ్ భవతి - నహి సాకారం వస్తు నిరాకార మాత్మసాత్కర్తు ముత్సహతే కదా పి. నాపి నిరాకార ఆత్మా సాకారే శరీరే సమ్మీయతే - అతఏవ శరీర మస్మదీయమ్ త మాత్మానమ్ నాల మభ్యంతరీ కర్తుమ్ - శరీరస్య సాకారత్వాత్ - నిరాకారత్వాచ్చ ఆత్మనః- తర్హి కథ ముచ్యతే అశరీరమ్ శరీరేష్వితి - అశరీర స్స ఆత్మా సర్వగతో వస్తుతః - సర్వగతో యత స్తతఏవ శరీరేపి సంక్రమితుమ్ ప్రభవ తీతి న కశ్చి ద్విరోధః - యథా శరీరా ద్బహి రేవం శరీర స్యాంతరపి వర్తతే ఆకాశవత్ - ఆకాశోపి నిరాకారఏవ - నిరాకారత్వా దయమ్ సర్వత్ర వర్తమానోపి తత్ర తత్ర ఘటమఠాదిషు గృహారామా దిష్వపి అప్రతిహత స్సంచరన్ని వ దృశ్యతే - అనేన దృష్టాంతేన చిదాకాశో ప్యేష ఆత్మా తద్వైవ అంతర్బహిరపి పదార్థానా మవిశేషేణ భవతీ త్యవగంతవ్యమ్ - అంత శ్శరీరే - బహి శ్శరీరా దన్యత్ర.

ఏవం శరీరే విద్యమానో ప్యయమాత్మా న శరీర వ దనవస్థితః- అనవస్థా నామ ప్రతిక్షణ పరిణామశీలతా - సా యస్య తదనవ స్థితమ్ - శరీర మిదం మనః ప్రాణేంద్రియాత్మకమ్ తద్వైవ లక్ష్యతే - ప్రతిక్షణ మన్యథా అన్యథా పరివర్తత ఏవ - ఏకరూపేణ న జాతుచి దవతిష్ఠతే - ఆ లోచనాత్మకమ్ మనః- ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాత్మకః ప్రాణః- కరచరణాద్యవయవాః సర్వేపి పరిణమ మానా ఏవ - అనుభవ సిద్ధ ఏవాయమ్ వ్యవహారో స్మాకమ్ - ఏవ మనవ స్థితే ష్వపి శరీరేషు తత్రైవ వర్తమానోయ మాత్మా నైవ పరిణమతే - ప్రత్యుత స్వరూపేణైవ అవతిష్ఠతే

– సాకారత్వా చ్చలతు నామ శరీరమ్ – న తావతా తద్గతో ప్యాత్మా చలతీతి భేతవ్యమ్ – నిరాకారత్వా త్తస్య కథంచిదపి చలనమ్ నామ న సంభవతి – చలనే అసతి పరిణామో దూరతఏవ – తదధీనత్వాత్తస్య –

భవతునామ – సర్వగత స్స ఆత్మా శరీరేష్వస్తీతి వచనేన కి మభిప్రేతం శాస్త్రేణ – అస్తి చే దస్తు నామ – కిం తావతా – ఇతిచే దుచ్యతే – వయమ్ శరీర భృతో మనుష్యా అస్మిన్ సంసార సాగరే అలాబువ త్పరిప్లవమానాః పారం గంతు మక్షమతయా తాపత్రయేణ పరిభూయా మహే–సోఽయం సంతాపః శరీర మేవా హమితి తాదాత్మ్యభావేన ఉపస్థితః–అనర్థ కరత్వా దేష సర్వథా పరిహర్తవ్యోఽస్మాభిః బుద్ధి జీవైః–సచ శరీరేణ యథా ఏవ మశరీరేణ ఆత్మనా యది తాదాత్మ్య ముపగచ్ఛేమ తదా అయత్నేనైవ సంపద్యతే– అ శరీరశ్చస ఆత్మా నకుత్రా ప్యన్యత్ర గత్వా గ్రహీ తవ్యః– శరీరా దన్య త్రైవ న కేవలమ్–కింతు శరీర స్యాభ్యంతరేపి వర్తతే–దృష్టి రేవ కేవలమ్ కర్తవ్యా తత్ర విషయే–ఇమ మర్థమ్ మనసి నిధాయ అశరీరమ్ శరీరేష్వితి విశేషతో నిర్దిశ్యతే శాస్త్రేణ–

తర్హి కేన ప్రకారేణ గ్రహీతవ్యస్స ఆత్మా ఇత్యపే క్షాయా మభిధీయతే– మహాంతం విభుమాత్మానం మత్వేతి – శరీరే దర్శన శ్రవణ మననా దికం వ్యాపారం కుర్వాణం యదహ మహ మితి విజ్ఞాన ముపలభ్యతే సంప్రతి – న తచ్ఛరీర మాత్ర పరిచ్ఛిన్నమ్ – తావన్మాత్రమ్ చేత్కథం నామ తద్బాహ్య మాకాశాదికమ్ విషయీ కరోతి – తస్మాద్యావ చ్ఛరీరే తావ ద్బహిరపి శరీరా దాకాశవ దేవ సర్వత్ర ప్రసృతమితి నసంశయః– ఏవం వస్తుత : సార్వత్రిక మపి త దస్మద్బుద్ధే స్తథా న స్ఫురతి – నాసౌ వస్తుగతః కింతు బుద్ధిగతో దోషః– అతః పరిచ్ఛిన్న మివ ప్రతీయ మానం తవాత్మానం మహాంతమ్ భావయితు మర్హసి – పునః పున రేవం భావ్యమాన స్సవిభు స్సర్వ వ్యాపీ భవతి – తత్తన్నామ రూపాదిభి ర్విశేషైరపి భవతీ త్యర్థః– స్వరూపేణ ఆకాశవ ద్భూత్వా విశేషత స్సర్వ పదార్థాకారై రపిస ఏవ భాతీతి వేదితవ్యమ్ –

అపిచ నాయ మపూర్వతయా మంతవ్యః కింతు పూర్వసిద్ధ ఏ వాత్మా – యావంతం కాలమ్ నమనుతే భవాం స్తావంతమ్ కాలమ్ శరీర మాత్ర నియంత్రితః– స ఏవ యదా శరీరాతి గత్వేన మతః తదా పునరాకాశ ఇవ సర్వవ్యాపీ సర్వాత్మకశ్చ సంవేద్యతే – ఇయమేవ ప్రత్యభిజ్ఞానామ సాధన ప్రక్రియా వేదాంతశాస్త్రే – ఇతః పూర్వమ్ దేవదత్తో నామ కశ్చి దాసీన్మమ మిత్రమ్ – స అంతరాళే మయా న సంగతో నాప్యాకర్ణితః క్వాస్తీతి – అకస్మా దేకదా క్వాపి దేవాలయే దైవవశా న్మమ దృష్టి పథ మాయాతః– తదానీ మభిజ్ఞాత పూర్వోపి చిరకాల వ్యవధానా ద్విస్మృత స్సః ముహూర్త మాత్రమ్ తధా భూతోపి పశ్చా న్నన్వయమ్ దేవదత్తో మమమిత్ర మితి పున రభి జ్ఞాయతే–ఆదా వభిజ్ఞానమ్–పశ్చా ద్విస్మరణమ్ – తదను ప్రత్యభి జ్ఞానమితి–ఏవమేవ పూర్వ మహమితి స్మృతిః మధ్యేవిస్మృతి ర్జాతా అజ్ఞాన వశాత్–పునరిదానీ మభ్యాసవశా త్సఏవాత్మా అహమితి జ్ఞాన ముపజాయతే

యద్యేవమ్ ప్రత్యభిజ్ఞా స్యాత్సైవాలమ్ సాధనాయ నకర్మ – నోపాసనా –న యోగో–న మంత్ర తంత్రాదిక మాశ్రయణీయమ్–వినైవ తత్సర్వమ్ క్రియా కలాపం ఆత్మానుభవః అవశ్యమ్ భావీ–అనుభవేచ స త్యాత్మనః నశోచతి –సంసారికః క్లేశః శోకః–స సూర్యోదయే సత్యంధకారఇవ పలాయతే –నలేశతో వ్యవతిష్ఠతే–కింత్వేతా దృశమ్ భాగధేయమ్ ధీ రస్యైవ–న యస్సక స్య చి దితి బ్రూతే ఉపనిషత్–ధీ రస్యాస్తీతి ధీరః–ధీ రిత్యాత్మ విషయా బుద్ధిః– ఆత్మాకార వృత్తి రితి యావత్ – తయైవ శక్యతే ఉపలబ్ధు మాత్మా – నాన్యథా – అత స్తాదృగ్ బుద్ధి రభ్యసనీయా ముముక్షుభి ర్మానవై స్సంసార మార్గతరణాయేతి ఉపనిష త్సందేశః–

ఓమ్

శాంతి శ్శాంతి శ్శాంతిః

★★★